www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 24-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 236 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం, తిథి: చవితి రా.9.22 తదుపరి పంచమి, నక్షత్రం: పూర్వాషాఢ రా.9.54 తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: శేషం ఉ.7.48 వరకు, దుర్ముహూర్తం: ప.12.24-1.08, ప.2.37-3.21, అమృతఘడియలు: సా.4.36-6.22, రాహుకాలం: ఉ. 7.30-9.00, సూర్యోదయం: 6.28, సూర్యాస్తమయం: 5.34 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బిహార్‌లో ఎన్డీయే సర్కారుకు మజ్లిస్ మద్దతు

షరతులతో కూడిన మద్దతు ఇస్తాం: పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ

పట్నా, నవంబరు 23: బిహార్‌లో ఎన్డీయే ప్రభుత్వానికి షరతులతో కూడిన మద్దతు ప్రకటిస్తున్నట్లు మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ సూచనప్రాయంగా తెలిపారు. అయితే, రాష్ట్రంలో ముస్లింలు అధికంగా ఉండే, వెనుకబడిన సీమాంచల్ ప్రాంతానికి న్యాయం జరిగితేనే తమ పార్టీ పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. బిహార్‌లోని అమౌర్‌లో జరిగిన ఓ ర్యాలీలో ఒవైసీ ప్రసంగించారు. సీమాంచల్ ప్రాంతం దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైందని.. వరదలు, వలసలు, అవినీతి వంటి సమస్యలతో సతమతమవుతోందని ఆరోపించారు. అభివృద్ధి కేవలం పట్నా, రాజ్‌గిర్ ప్రాంతాలకు మాత్రమే పరిమితం కాకూడదని ఆయన పేర్కొన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి బిహార్ అంతటా ఆధిపత్యం కనబర్చినప్పటికీ.. సీమాంచల్‌లో మాత్రం 24 సీట్లలో 14 స్థానాలనే గెలుచుకుంది. ఎంఐఎం ఐదు స్థానాలు సాధించి తన ఉనికిని చాటుకుంది.

టచ్ చేశారో ఖాతా ఖాళీ!

- ఏపీకే ఫైళ్లతో సైబర్ నేరగాళ్ల పంజా
- ఎస్బీఐ పేరిట లక్షలాది మందికి సందేశాలు
- వేలాది ఖాతాల్లో డబ్బు కొల్లగొట్టిన వైనం
- సీఎం, మంత్రులు, జర్నలిస్టు గ్రూపుల హ్యాక్
- ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలంటూ వాట్సాప్ సందేశం 12
- లేదంటే ఖాతా బ్లాక్ అవుతుందని హెచ్చరికలు



రీల్స్ కోసం లేడీ గ్యాంగ్ దారుణం

యువతిని అపహరించి.. దాడి!

ఆ దృశ్యాలు నెట్‌లో.. మధ్యప్రదేశ్‌లో ఘటన.. ఇద్దరు బాలికలు, ఓ యువతి అరెస్టు

భోపాల్, నవంబరు 23: సోషల్ మీడియాలో రీల్స్‌కు లైక్‌లు, కామెంట్ల కోసం యువత ఎంతకైనా తెగిస్తున్నారనేందుకు ఈ దారుణ ఘటనే ఉదాహరణ! ఓ లేడీ గ్యాంగ్.. రీల్స్ ప్రైకంలో యువతులను కిడ్నాప్ చేసి, వారిని విచక్షణారహితంగా కొడుతూ.. ఆ దృశ్యాలను చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు చేస్తోంది. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో ఈ దారుణం వెలుగుచూసింది. ఇటీవల ఓ యువతిని కిడ్నాప్ చేసిన గ్యాంగ్.. ఆమెను జుత్తు పట్టుకొని కొడుతున్న, కాలితో తన్నుతున్న దృశ్యాలు నెట్‌లో వైరల్ అయ్యాయి. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఆ లేడీ గ్యాంగ్‌లోని 17 ఏళ్ల ఇద్దరు బాలికలు సహా ఓ యువతిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ గ్యాంగ్ ఇదే తరహాలో మరికొందరు యువతులపై దాడులకు పాల్పడినట్లు తెలిసింది.

ఇంతింతై.. జెడ్డా టవరంతై 2

- సౌదీ అరేబియాలోని జెడ్డానగరానికి సమీపంలో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవన నిర్మాణం
- ఈ ఆకాశహర్మ్యం ఎత్తు కిలోమీటరుకు పైమాటే!
- ప్రస్తుతానికి ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన బుర్జ్‌ఖలీఫా కన్నా 590 అడుగులు ఎక్కువ ఎత్తు
- నిర్మాణానికి దాదాపు రూ.11 వేల కోట్ల ఖర్చు
- బరువు 9 లక్షల టన్నులు.. మే 2028కి పూర్తి





స్వతంత్రత నిరూపణకు.. ప్రభుత్వ వ్యతిరేక తీర్పులు ఇవ్వక్కర్లేదు

- అలా ఇస్తేనే స్వతంత్రంగా వ్యవహరించే జడ్జి అనుకుంటారనే భావన సరికాదు
- కోర్టు ముందున్న పత్రాలు, ఆధారాల మేరకే తీర్పులు ఇవ్వాలి
- న్యాయవ్యవస్థ స్వతంత్రత కోసం కొలీజియం వ్యవస్థ ఉండాల్సిందే
- ఎస్సీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ ఉండాలి: జస్టిస్ బీఆర్ గవాయ్

న్యూఢిల్లీ, నవంబరు 23: ఎవరైనా న్యాయమూర్తి తాను స్వతంత్రుడనని నిరూపించుకునేందుకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులు ఇవ్వాల్సిన పని లేదని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. అయితే న్యాయమూర్తులు స్వతంత్రంగా వ్యవహరించక తప్పదని, కోర్టు ముందున్న ఆధారాలకు అనుగుణంగా నిర్ణయం

మిగతా 2వ పేజీలో...

53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్

- నేడే ప్రమాణ స్వీకారం 2
- తొలిసారి అతిథులుగా 6 దేశాల సీజేలు
- హాజరు కానున్న సీఎం రేవంత్‌రెడ్డి

పారిశ్రామిక వాడలు.. ఇక వాణిజ్య వీధులు

మల్టీ యూజ్ జోన్లుగా మార్చనున్న సర్కారు.. హెచ్‌ఐఎల్‌టీపీ పేరిట కొత్త పాలసీ

- అపార్టుమెంట్లు, ఆఫీసులు, స్కూళ్లు, హోటళ్లు, హాస్పిటళ్లు, టెక్ పార్కుల నిర్మాణానికి అవకాశం
- ఇంపాక్ట్ ఫీజు వసూలుతో అనుమతులు
- రోడ్ల వెడల్పు 80 అడుగుల లోపు ఉంటే 30%, 80 అడుగులకు ఎక్కువ ఉంటే 50% ఫీజు
- ల్యాండ్ కన్వర్షన్ ఫీజులు కూడా అందులోనే
- హైదరాబాద్‌లోని 22 పారిశ్రామిక పార్కులు, స్టాండ్ అలోన్ యూనిట్లకు పాలసీ వర్తింపు
- మొత్తం 9,292 ఎకరాల భూముల్లో 4,740 ఎకరాల ప్లాటెడ్ భూములు
- టీజీఐపాస్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ
- నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనున్న టీజీఐఐసీ
- 45 రోజుల్లో పూర్తికానున్న మొత్తం ప్రక్రియ
- 2013లోనే ఈ పాలసీకి నాటి సర్కారు శ్రీకారం



హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకూ విస్తరిస్తున్న రాజధాని నగరాన్ని భవిష్యత్తు అవసరాలకు తగినట్లు తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఔటర్ రింగ్‌రోడ్డు లోపల, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో 50, 60 ఏళ్ల క్రితం నెలకొల్పిన పారిశ్రామిక ఎస్టేట్లు, పార్కుల భూములను 'మల్టీ యూజ్ జోన్‌లు'గా మార్చాలని నిర్ణయించింది. ఇందుకోసం 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ (హెచ్‌ఐఎల్‌టీపీ)-2025' పేరిట ప్రభుత్వం కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. నగర అభివృద్ధి, భూముల సక్రమ వినియోగం కోసం ఈ పాలసీని తీసుకొస్తున్నట్లు పేర్కొంటూ ఈ నెల 22న ఉత్తర్వులు

మిగతా 13వ పేజీలో...

నేడో రేపో నగారా!

- పంచాయతీ ఎన్నికల షెడ్యూలు జారీకి ఎన్నికల సంఘం కసరత్తు
- ఇప్పటికే ఖరారైన రిజర్వేషన్లు
- పంచాయతీ, వార్డుల రిజర్వేషన్లపై జిల్లాల్లో గెజిట్‌ల జారీ 13
- నేడు ఎస్ఈసీకి అందజేయనున్న పంచాయతీ రాజ్ శాఖ



చండీగఢ్‌ను వదులుకోం

- భగ్గుమన్న పంజాబ్ రాజకీయ పార్టీలు
- కేంద్ర ప్రభుత్వ బిల్లుతో దుమారం
- చండీగఢ్‌పై మాకు హక్కుంది: సీఎం మాన్
- ఆ బిల్లు పంజాబ్‌పై దాడే: కేజ్రీవాల్
- లాక్కుంటే తీవ్ర పరిణామాలు: కాంగ్రెస్
- అది పంజాబ్ వ్యతిరేక బిల్లు: బాదల్
- ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు: కేంద్రం

న్యూఢిల్లీ, చండీగఢ్, నవంబరు 23: కేంద్ర పాలిత ప్రాంతమైన చండీగఢ్‌లో చట్టాలు చేసే అధికారాన్ని రాష్ట్రపతి పరిధిలోకి తెచ్చేందుకు వీలుగా రాజ్యాంగ అధికరణం 131ను సవరిస్తూ బిల్లు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. చట్ట సభల్లేని కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ దీవులు, దాద్రానగర్ హవేలీ తరహాలో చండీగఢ్‌ను కూడా రాజ్యాంగ అధికరణం 240 పరిధిలోకి తీసుకురావాలని యోచించింది. దీనికి సంబంధించి పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో బిల్లు పెట్టాలనుకుంది. బిల్లు ఆమోదం పొందితే పంజాబ్ గవర్నర్ పర్యవేక్షణలో ఉన్న చండీగఢ్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయి అధికారి స్వతంత్ర పాలకుడిగా నియమితులవుతారు. అయితే పంజాబ్‌లోని రాజకీయ పార్టీలన్నీ ఈ ప్రతిపాదనను

మిగతా 2వ పేజీలో...

సత్యసాయి.. ప్రజల్లో దేవుడిని చూసిన మహానుభావుడు

- తెలంగాణలోనూ అధికారికంగా శతజయంతి ఉత్సవాలు
- బాబా ట్రస్టు కార్యక్రమాలకు తోడ్పడతాం: సీఎం రేవంత్
- నిస్వార్థ సేవలకు ప్రతిరూపం: ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్
- పుట్టపర్తిలో సత్యసాయి శత జయంతి వేడుకలు

దావోస్ తరహాలో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

- ముఖ్యమంత్రి రేవంత్ సూచన
- సౌకర్యాల్లో రాజీపడొద్దు
- అంతర్జాతీయ స్థాయిలో ఉండాలి
- పనులు పరిశీలించిన రేవంత్



సత్యసాయి సమాధి వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

అనంతపురం/పుట్టపర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి ప్రజల్లోనే దేవుడిని చూశారని, ప్రేమ ద్వారానే ఏదైనా సాధ్యమవుతుందనేది ఆయన సందేశమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బాబా సందేశం యుగయుగాలపాటు ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. తెలంగాణలోనూ సాయిబాబా శతజయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. బాబా సేవా కార్యక్రమాలను విస్తరించేందుకు, ఆయన సిద్ధాంతాలను ప్రతి ఇంటికి చేరవేయడానికి తమ ప్రభుత్వం

మిగతా 13వ పేజీలో...



మన తేజస్ ఎంత భద్రం?

- 24 ఏళ్లు.. 18 వేల ఫ్లైట్ అవర్స్‌లో కేవలం రెండే ప్రమాదాలు
- ఎఫ్-16 తొలినాళ్లతో పోలిస్తే తక్కువే
- ఫ్లైట్ అవర్స్ పెరిగే కొద్దీ ట్రాక్ రికార్డు మరింత మెరుగయ్యే అవకాశం

సింగిల్ ఇంజిన్‌తో కూడిన నాలుగో తరం యుద్ధవిమానమైన తేజస్-ఎంకే1ను కొనుగోలు చేసేందుకు అర్జెంటీనా, ఈజిప్ట్, నైజీరియా, ఫిలిప్పీన్స్ వంటి దేశాలు ఆసక్తిగా ఉన్నాయి. ఇలాంటి సమయంలో.. దుబాయ్‌లో జరిగిన ఎయిర్ షోలో మన తేజస్-ఎంకే1 నేలకూలడం ఆందోళన

మిగతా 2వ పేజీలో...

కాళోజీ వర్సిటీలో అక్రమార్కులు

వైద్య విద్య పీజీ పరీక్షల్లో గోల్ మాల్

- ఫెయిలైన ఐదుగురికి మార్కులు కలిపిన వైనం
- పునః మూల్యాంకనమే లేనప్పుడు ఇదెలా సాధ్యం?
- ఖాళీ పేజీల్లో మళ్లీ రాతలు రాసినట్టు అనుమానాలు
- వీళ్లందరూ ప్రైవేట్ మెడికల్ కళాశాలకు చెందిన వారే
- రీకౌంటింగ్ తర్వాత మరో యూజీ విద్యార్థి కూడా పాస్
- పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారినట్లు ఆరోపణలు
- సమగ్ర విచారణ చేపట్టాలని వైద్య విద్యార్థుల డిమాండ్



హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సాధారణ విద్యార్థులు పరీక్షల్లో ఫెయిలైతే ఏం చేస్తారు?.. పాస్ అయ్యే దాకా కష్టపడి చదువుతారు... కానీ, భవిష్యత్తులో డాక్టర్లు కావాల్సిన ఐదుగురు విద్యార్థులు అడ్డదారి తొక్కారు. అక్రమంగా మార్కులు వేయించుకుని పాస్ అయ్యారు. ఈ తతంగం వెనుక కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయంలోని కొందరు అక్రమార్కుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తొలుత ఫెయిలై.. మళ్లీ పాస్ అయిన వారంతా ప్రైవేట్ మెడికల్ కాలేజీ విద్యార్థులు కావడం గమనార్హం. మరోవైపు.. ఓ ప్రైవేటు మెడికల్ కాలేజీ యూజీ విద్యార్థి ఫెయిలైనా... రీకౌంటింగ్‌లో

మిగతా 14వ పేజీలో...

నేడు స్పీకర్ ముందుకు దానం?

- అనర్హత అంశంలో వివరణ ఇచ్చేందుకు ఆదివారంతో ముగిసిన గడువు
- దానం నాగేందర్ స్పీకర్‌ను గడువు కోరినట్టు ప్రచారం
- ధ్రువీకరించని శాసనసభ సభాపతి కార్యాలయం 13





ఈవీల చార్జింగ్‌కు ప్రత్యేక పార్కింగ్

- బహుళ అంతస్తుల భవనాల్లో ఇకపై తప్పనిసరి
- స్థలం కేటాయిస్తేనే నిర్మాణానికి అనుమతి
- నూతన బిల్డింగ్ కోడ్‌లో నిబంధన! 3

మావోయిస్టుల అడ్డాలో బలగాలు!

- కర్రెగుట్ట కొండల్లో కొత్త క్యాంపు ఏర్పాటు
- ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులో ఆపరేషన్లు!
- క్యాంపును సందర్శిస్తున్న సీనియర్ అధికారులు
- బీజాపూర్‌లో ఐదుగురు నక్సల్స్ అరెస్టు
- లొంగిపోయిన నక్సల్స్‌ను కలిసిన ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం విజయ్ శర్మ 2



విమాన టికెట్లపై 80% దాకా వాపస్!

- చివరి 4 గంటల్లో రద్దు చేసుకున్నా కూడా..
- కేంద్ర ప్రభుత్వం కసరత్తు 2
- టికెట్ చార్జీల్లోనే స్వల్ప మొత్తంలో బీమా?

చండీగఢ్‌ను వదులుకోం

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకించాయి. చండీగఢ్‌పై కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనతో రాజకీయ దుమారం రేగింది. పంజాబ్‌లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్, అకాలీదళ్ నేతలు కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను తప్పుబట్టారు. చండీగఢ్‌పై పంజాబ్‌కు హక్కు ఉందని, వదులుకోబోమని సీఎం భగవంత్ మాన్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదన పంజాబ్‌పై దాడి అని ఆప్ అధినేత కేజ్రీవాల్ విమర్శించారు. చండీగఢ్‌ను లాక్కుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని పంజాబ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అమరీందర్ సింగ్ రాజా హెచ్చరించారు. పంజాబ్ బీజేపీ నేతలు కేంద్రం వైపు ఉంటారో లేక పంజాబ్ వైపు ఉంటారో తేల్చుకోవాలన్నారు. పంజాబ్ వ్యతిరేక బిల్లుగా అకాలీదళ్ అధినేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్ విమర్శించారు. పంజాబ్‌లోని రాజకీయ పార్టీలన్నీ వ్యతిరేకించడంతో కేంద్ర ప్రభుత్వం వెనకడుగు వేసింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చండీగఢ్ బిల్లును పెట్టడంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని కేంద్ర హోంశాఖ స్పష్టం చేసింది. అన్ని భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు జరిపాకే బిల్లును ప్రవేశపెడతామని తెలిపింది.

విమాన టికెట్లను రద్దు చేసుకుంటే 80% రీఫండ్

న్యూఢిల్లీ, నవంబరు 23: విమాన ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం త్వరలోనే శుభవార్త చెప్పనుంది. ప్రయాణాన్ని వాయిదా వేసుకున్న, రద్దు చేసుకున్న సందర్భాల్లో టికెట్ల కోసం చెల్లించిన మొత్తంలో 80% సొమ్మును ప్రయాణికులకు తిరిగి చెల్లించే విధానంపై కసరత్తు చేస్తోంది. విమానం టేకాఫ్ అయ్యే చివరి 4 గంటల సమయంలో టికెట్ రద్దు చేసుకున్నా ఈ సదుపాయాన్ని అందించాలని భావిస్తోంది. ఈ సదుపాయాన్ని వచ్చే రెండు మూడు మాసాల్లోనే అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశం ఉందని సంబంధిత అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న విధానంలో విమానం టేకాఫ్ అయ్యే మూడు గంటలకు ముందు.. టికెట్‌ను రద్దు చేసుకున్న వారికి రూపాయి కూడా తిరిగి చెల్లించడం లేదు. కేవలం వైద్య పరమైన అవసరాల్లో మాత్రమే దీనికి మినహాయింపు ఉంది.

పుస్తకాల్లో అక్బర్ పేరు నుంచి 'గ్రేట్' తొలగింపు!

న్యూఢిల్లీ, నవంబరు 23: పాఠశాల చరిత్ర పుస్తకాల్లో మొఘల్ చక్రవర్తి అక్బర్, మైసూర్ పాలకుడు టిప్పు సుల్తాన్ పేర్లకు అనుబంధంగా ఉండే గౌరవప్రదమైన 'గ్రేట్' అనే పదాన్ని ఎన్సీఈఆర్టీ తొలగించింది! ఈ నిర్ణయంపై రాజకీయ, సామాజిక నేతల నుంచి మిశ్రమ స్పందనలు వస్తున్నాయి. నాగ్‌పూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆరెస్సెస్ నేత సునీల్ అంబేకర్ మాట్లాడుతూ ఎన్సీఈఆర్టీ మార్పులను స్వాగతించారు. ఎన్సీఈఆర్టీ నిర్ణయాన్ని అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ గట్టిగా సమర్థించారు. ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'టిప్పును సముద్రంలో పడేయండి..' అంటూ వ్యాఖ్యానించారు.

ఇంతింతై.. జెడ్డా టవరంతై..

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవనం అనగానే ఠక్కున గుర్తొచ్చేది.. దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫా! దాని ఎత్తు 828 మీటర్లు! దాంట్లో ఉన్న అంతస్తుల సంఖ్య 163. ఇప్పుడు దానికి పోటీగా.. దీటుగా.. కిలోమీటరు ఎత్తుండే ఆకాశహర్మ్యాన్ని సౌదీ అరేబియా నిర్మిస్తోంది. దాని పేరు.. జెడ్డా టవర్! ఈ టవర్ ప్రతిపాదిత ఎత్తు 1008 మీటర్లు. అంటే బుర్జ్ ఖలీఫా కన్నా 180 మీటర్లు ఎక్కువ! 120 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ టవర్‌లో అంతస్తుల సంఖ్య మాత్రం 168. బుర్జ్ ఖలీఫా భవన నిర్మాణానికి రూపకల్పన చేసిన అమెరికన్ ఆర్కిటెక్ట్ అడ్రియన్ స్మిత్.. దీని డిజైన్‌ను కూడా రూపొందించారు. టవర్ నిర్మాణం కోసం దాదాపు 660 అడుగుల లోతుకు గుంతలు తవ్వి వాటిలో కాంక్రీటు నింపి బలమైన పునాదులు నిర్మించారు. వాటిపై 300 అడుగుల వెడల్పు, 15 అడుగుల లోతైన కాంక్రీట్ ప్యాడ్ నిర్మించి.. దానిపై ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. 2013 ఏప్రిల్‌లో మొదలుపెట్టి అదే ఏడాది డిసెంబరు నాటికి పునాదులు, కాంక్రీట్ ప్యాడ్ నిర్మాణాన్ని పూర్తిచేశారు. 2018 జనవరిలో పలు కారణాలతో టవర్ నిర్మాణం నిలిచిపోయింది. మళ్లీ ఈ ఏడాది జనవరిలో పనులు పునఃప్రారంభమై శరవేగంగా సాగుతున్నాయి. 2028 నాటికి ఈ టవర్ నిర్మాణాన్ని పూర్తిచేయనున్నట్టు సమాచారం. ఈ భవనం బరువు దాదాపు 9 లక్షల టన్నుల దాకా ఉంటుంది. దీని నిర్మాణానికి 1.8 కోట్ల ఘనపుటడుగుల కాంక్రీటును, 80 వేల టన్నుల ఉక్కును వినియోగిస్తున్నారు. ఈ భవనం నిర్మాణం ఖర్చు రూ.11 వేల కోట్లని అంచనా!!



భర్త మృతదేహానికి శాల్యూట్ చేస్తూ నివాళి అర్పిస్తున్న వింగ్ కమాండర్ అఫ్షాన్

'తేజస్' పైలెట్ నమన్ష్ సియోల్‌కు ఘన నివాళి

చెన్నై, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ వైమానిక విన్యాసాలలో యుద్ధవిమానం తేజస్ ఎంకే 1 కూలిన దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన పైలెట్ వింగ్ కమాండర్ నమన్ష్ సియోల్ భౌతికకాయానికి కోయంబత్తూరులోని సూలూరు వైమానిక దళం వద్ద ఆదివారం అధికారులు, సిబ్బంది ఘననివాళులర్పించారు. నమన్ష్ సియోల్ సూలూరు వైమానిక దళంలోనే పనిచేస్తున్నారు. అక్కడి వైమానిక దళం క్వార్టర్స్‌లోనే భార్యతోపాటు నివసిస్తున్నారు. ఆమె వైమానిక దళం అధికారిగా ఉన్నారు. ఈ దంపతులకు ఏడేళ్ల కుమార్తె ఉంది. నమన్ష్ సియోల్ భౌతికకాయాన్ని దుబాయ్ నుంచి విమానంలో శనివారం రాత్రి సూలూరు వైమానిక దళానికి తీసుకువచ్చారు. ఆ తర్వాత యాన్ని ప్రత్యేక విమానంలో నమన్ష్ సియోల్ స్వస్థలమైన హిమాచల్ ప్రదేశ్‌లోని కంగ్రా గ్రామానికి తీసుకెళ్లారు.



నేత్ర-వంశీ దంపతులతో మంతెన రామరాజు, జెన్నిఫర్ లోపెజ్

మంతెన రామరాజు కుమార్తె వివాహానికి దేశ, విదేశీ సెలబ్రిటీల క్యూ

- రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఘనంగా వేడుకలు
- జూ.ట్రంప్, జెన్నిఫర్, బీబర్, బాలీవుడ్ తారల హాజరు

ఉదయ్‌పూర్/విజయవాడ, నవంబరు 23: డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు అడ్డా అయిన రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఆదివారం మరో 'రిచ్' వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ సంతతికి చెందిన అమెరికా పారిశ్రామికవేత్త, ఇంజెనెస్ ఫార్మాస్యూటికల్స్ అధినేత మంతెన రామలింగరాజు కుమార్తె నేత్ర-వంశీ గాదిరాజు(ఎన్‌ఆర్‌ఐ) ఒక్కటయ్యారు. ఈ పెళ్లికి దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ సెలబ్రిటీలు హాజరై.. నూతన దంపతులను ఆశీర్వదించారు. అతిథుల్లో అమెరికా అధ్యక్షుడు కుమారుడు జూనియర్ డొనాల్డ్ ట్రంప్, గాయని-నటి జెన్నిఫర్ లోపెజ్, జస్టిన్ బీబర్, రాంచరణ్, హృతిక్ రోషన్ తదితరులు ఉన్నారు. గత మూడు రోజులుగా జరుగుతున్న ఈ వివాహ వేడుకల్లో శుక్ర, శనివారాల్లో జెన్నిఫర్ లోపెజ్, బీబర్, కృతి, మాధురి, షాహిద్‌లు తమ ప్రదర్శనలతో అలరించారు. మంతెన రామరాజు విజయవాడలో జన్మించారు. ఉన్నత విద్య కోసం 1984లో అమెరికాకు వెళ్లారు. తర్వాత అక్కడ పలు కంపెనీలు ప్రారంభించారు.

ప్రభుత్వ వ్యతిరేక తీర్పులు ఇవ్వక్కర్లేదు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలని చెప్పారు. విద్వేషపూరిత ప్రసంగాలను నియంత్రించేందుకు ప్రత్యేకంగా ఒక చట్టం అవసరమని చెప్పారు. సుప్రీం ప్రధాన న్యాయమూర్తిగా ఆదివారం పదవీ విరమణ చేసిన జస్టిస్ గవాయ్ తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. "ఒక న్యాయమూర్తిగా తమ ఎదుట ఉన్నది ప్రభుత్వమా, ప్రైవేటు వ్యక్తులా అన్నదానిని బట్టి నిర్ణయం తీసుకోకూడదు. కోర్టు ముందున్న పత్రాలు, ఆధారాలను బట్టి నిర్ణయం తీసుకోవాలి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటేనే స్వతంత్రంగా వ్యవహరించే జడ్జి అనే భావన కొందరిలో ఉంది. అది సరికాదు. స్వతంత్రంగా వ్యవహరించే న్యాయమూర్తి అని నిరూపించుకునేందుకు ప్రభుత్వం చేసే ప్రతిదానికి వ్యతిరేకంగా తీర్పులు ఇవ్వాల్సిన అవసరం లేదు" అని గవాయ్ చెప్పారు.



కొలీజియం వ్యవస్థ తప్పనిసరి!

ప్రజల్లో న్యాయవ్యవస్థ పట్ల విశ్వాసం కొనసాగాలంటే.. న్యాయవ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరించాల్సిందేనని జస్టిస్ గవాయ్ చెప్పారు. జడ్జీల నియామకాలకు సంబంధించిన కొలీజియం వ్యవస్థపై కొన్ని విమర్శలు ఉన్నా.. న్యాయవ్యవస్థ స్వతంత్రతను నిలుపుకొనేందుకు అది తప్పనిసరని పేర్కొన్నారు. అదే సమయంలో నిఘా, దర్యాప్తు సంస్థలు, కేంద్ర న్యాయశాఖ నుంచి వచ్చే నివేదికలు, సూచనలను కొలీజియం కచ్చితంగా పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపారు. కొందరు మహిళా న్యాయమూర్తులను సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించే ప్రతిపాదనను పరిశీలించామని.. కానీ కొలీజియంలో ఏకాభిప్రాయం రాకపోవడంతో నియమించలేకపోయామని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు.

గవర్నర్లకు గడువు విధించలేం.

గవర్నర్లకు గడువు విధించలేమన్న తాజా తీర్పుపై విమర్శలను ప్రస్తావించగా.. "రాజ్యాంగంలో లేని దానిని మేం చెప్పలేం. రాజ్యాంగం వ్యవస్థల మధ్య అధికారాలను విభజించింది. అందువల్ల గవర్నర్లకు గడువును నిర్దేశించలేమని చెప్పాం. అదే సమయంలో అవసరమైన మేర న్యాయ సమీక్షకు అంగీకరించాం. గవర్నర్లు సుదీర్ఘకాలం బిల్లులను పెండింగ్‌లో పెట్టడం సరికాదని, అలాంటి సమయంలో న్యాయ సమీక్ష ఉంటుందని స్పష్టం చేశాం" అని చెప్పారు. ప్రొటోకాల్ ప్రకారం గవర్నర్ కంటే సుప్రీం చీఫ్ జస్టిస్ ఎప్పుడూ పైస్థాయిలో ఉంటారని పేర్కొన్నారు. ఇక పాలన వ్యవస్థ నుంచి తాను ఎలాంటి ఒత్తిడిని ఎదుర్కోలేదని తెలిపారు.

రిజర్వేషన్లలో క్రీమీలేయర్ ఉండాలి..


తన తండ్రి పెంపకం, రాజ్యాంగ సూత్రాలు, సామాజిక, ఆర్థిక న్యాయం తదితర అంశాలు తనను ప్రభావితం చేశాయని.. రాజ్యాంగ సూత్రాలకు, ప్రాథమిక హక్కులకు మధ్య సమతౌల్యం ఉండాలనేది తన నమ్మకమని గవాయ్ చెప్పారు. రిజర్వేషన్లలో క్రీమీలేయర్ ఉండాలన్నది తన అభిమతమని, దానిపై చట్టం చేసే బాధ్యత ప్రభుత్వానిదని పేర్కొన్నారు. రిజర్వేషన్ల విషయంలో ఒక పెద్ద అధికారి కుమారుడు, మరో వ్యవసాయ కూలీ కుమారుడు ఇద్దరినీ ఒకేలా చూడటం సరికాదన్నారు. రిజర్వేషన్లతో కొన్ని ఎస్సీ కుటుంబాలు తరతరాలుగా ప్రయోజనం పొందుతూనే ఉన్నాయని చెప్పారు.

53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ నేడే ప్రమాణ స్వీకారం



న్యూఢిల్లీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ సూర్యకాంత్ భారత దేశ 53వ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా ప్రమాణం చేయనున్నారు. జస్టిస్ సూర్యకాంత్‌తో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ప్రమాణం చేయించనున్నారు. రాష్ట్రపతి భవన్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనుంది. ఆరు దేశాల ప్రధాన న్యాయమూర్తులు సీజేఐ ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరు కానున్నారు. భూటాన్, కెన్యా, మలేసియా, మారిషస్, నేపాల్, శ్రీలంక దేశాల చీఫ్ జస్టిస్‌లు వారి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొననున్నారు. భారత ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విదేశీ అతిథులు రావడం ఇదే తొలిసారి. జస్టిస్ సూర్యకాంత్ సుమారు 15 నెలల పాటు సీజేఐ పదవిలో ఉంటారు. 2027 ఫిబ్రవరి 9న ఆయన పదవీ విరమణ చేస్తారు. జస్టిస్ సూర్యకాంత్ సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తొలి హరియాణా వ్యక్తిగా నిలవనున్నారు. సీజేఐ ప్రమాణ స్వీకారోత్సవానికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరవనున్నారు. జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హరియాణాలోని హిసార్‌లో ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అలాగే, 2024 నవంబరు 12 నుంచి సుప్రీంకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేస్తున్నారు.

లోకం తీరు



నేనూ సీఎం రేసులో ఉన్నా!

- కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర్ ప్రకటన
- తెరపైకి దళిత ముఖ్యమంత్రి డిమాండ్



బెంగళూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సీఎం రేసులో తానూ ఉన్నానని హోంమంత్రి పరమేశ్వర్ ప్రకటించారు. ఆదివారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను ఎప్పటి నుంచో సీఎం రేసులో ఉన్నానని, దళిత నేత సీఎం కావాలనే ప్రతిపాదన చాలా కాలంగా ఉందని అన్నారు. అయితే, 2023లో సీఎం ఎంపిక సందర్భంగా రెండున్నరేళ్ల తర్వాత మార్పు అన్న అంశం చర్చకు రాలేదన్నారు. మధ్యలో అధిష్ఠానం ఏ నిర్ణయమైనా తీసుకోవచ్చని, అధిష్ఠానం అన్నింటినీ పరిశీలిస్తుందని చెప్పారు. 'గతంలో బంగారప్పను మార్చి వీరప్ప మొయిలీని చేయలేదా?' అని ప్రశ్నించారు. అయితే, ప్రస్తుతం అలాంటి పరిస్థితి ఉందని తాను భావించడం లేదన్నారు. రాహుల్‌గాంధీ విదేశాల నుంచి వచ్చాక చర్చలు జరగవచ్చన్నారు.

పరిణామాలను పరిశీలిస్తున్నా: ఖర్గే

ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ఆదివారం మీడియాతో మాట్లాడుతూ కర్ణాటక కాంగ్రెస్‌లో పరిణామాలను పరిశీలిస్తున్నానన్నారు. తాను ఏమీ చెప్పనని, దీనిపై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. అధిష్ఠానం నిర్ణయాన్ని తనతోపాటు డీకే శివకుమార్ సహా అందరూ అంగీకరించాల్సిందేనన్నారు. కాగా, అధికార పోరాటంలో అధిష్ఠానం జాప్యం చేస్తే కాంగ్రెస్ పార్టీకి నష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సిద్దరామయ్య, శివకుమార్ గ్రూపులు సహా ప్రస్తుతం కర్ణాటక కాంగ్రెస్‌లో నాలుగు గ్రూపులు ఏర్పడినట్లు తెలుస్తోంది. దీంతో అంతర్గత కుమ్ములాటలు తారస్థాయికి చేరుతున్నాయి. అధిష్ఠానం జాప్యం చేస్తే పార్టీకి నష్టం తప్పదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

బెంగాల్ నుంచి బంగ్లాదేశీయులు వెనక్కు

- 'సర్' ప్రభావంతో తిరిగి వెళ్లిపోతున్న వైనం
- బీఎస్ఎఫ్ అవుట్‌పోస్టు వద్ద భారీ క్యూలు

హకీంపూర్, న్యూఢిల్లీ, కోల్‌కతా, నవంబరు 23: పశ్చిమ బెంగాల్‌లో ఎన్నో ఏళ్లుగా అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశీయులు తిరిగి వారి దేశానికి వెళ్లిపోతున్నారు. హకీంపూర్ వద్ద ఉన్న బీఎస్ఎఫ్ సరిహద్దు అవుట్‌పోస్టు వద్ద వారు భారీగా బారులు తీరుతున్నారు. తమను 'ఇంటికి' వెళ్లనివ్వాలని బీఎస్ఎఫ్ సిబ్బందిని వేడుకుంటున్నారు. భారత్‌లో ఓటర్ల జాబితాపై నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రభావం కారణంగా నవంబరు నెల ఆరంభం నుంచి ఇలా 'రివర్స్ మైగ్రేషన్' పరిస్థితి నెలకొందని అధికారులు చెబుతున్నారు. వెళ్లిపోతున్న వారిలో చాలామంది పశ్చిమబెంగాల్‌లో ఉన్నప్పుడు తప్పుడు పత్రాలతో నకిలీ ఆధార్, రేషన్ కార్డులు, ఓటు గుర్తింపు కార్డులు పొందినట్టు అంగీకరిస్తున్నారని పీటీఐ వార్తా సంస్థ తెలిపింది. బీఎస్ఎఫ్ నివేదిక ప్రకారం నవంబరు 4వ తేదీ నుంచి సరైన పత్రాలు లేని వారిని ధ్రువీకరణ అనంతరం రోజుకు 150-200 మంది వరకూ బంగ్లాదేశ్‌కు పంపించేస్తున్నారు. నిర్ధారణ ప్రక్రియకు రెండు నుంచి మూడు రోజుల సమయం పడుతోంది. గత వారం రోజుల్లో అధికారిక ప్రక్రియ పూర్తిచేసుకున్న దాదాపు 1,200 మంది బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లిపోయారని బీఎస్ఎఫ్ అధికారులు వెల్లడించారు.

సర్... ఉద్దేశపూర్వక కుట్ర: రాహుల్ గాంధీ

వివిధ రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'సర్'లో పాల్గొంటున్న కొందరు బూత్ స్థాయి అధికారుల మరణంపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. 'సర్' అనేది సంస్కరణ కాదని, కేంద్ర విధించిన అణచివేత అని ఆ పార్టీ ముఖ్యనేత రాహుల్ గాంధీ అభివర్ణించారు. 'సర్ అనేది ఉద్దేశపూర్వక కుట్ర. ఒత్తిడి కారణంగా బీఎల్‌వోలు మరణిస్తున్నారు' అని రాహుల్ ఎక్స్‌లో మండిపడ్డారు. మరోవైపు, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి పార్టీలు గెలిచిన నియోజకవర్గాల్లో 50 వేలకంటే ఎక్కువ ఓట్లను రద్దు చేయడానికే 'సర్'ను అమలుచేస్తున్నారని అఖిలేశ్ యాదవ్ విమర్శించారు.

మావోయిస్టుల అడ్డాలో భద్రతాదళాల పాగా

- కర్రెగుట్ట కొండల్లో కొత్త క్యాంపు
- ఫార్వర్డ్ ఆపరేషన్లకు బేస్‌గా ఉపయోగపడుతుందని ఆలోచన

బీజాపూర్/సుక్మా, నవంబరు 23: ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్ట కొండల్లో భద్రతాదళాలు కొత్త క్యాంపును ఏర్పాటు చేసుకున్నాయి. దట్టమైన అడవులతో కూడిన ఈ ప్రాంతాన్ని ఒకప్పుడు మావోయిస్టు సీనియర్లకు సురక్షితమైన స్థావరంగా భావించేవారు. అయితే, మావోయిస్టుల నిర్మూలనలో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్-మే నెలల్లో కర్రెగుట్ట కొండల చుట్టూ ఉన్న దట్టమైన అడవుల్లో కేంద్ర, రాష్ట్ర భద్రతాదళాలు 21 రోజుల సమగ్ర ఆపరేషన్‌ను నిర్వహించి 31 మంది నక్సల్స్‌ను అంతమొందించాయి. భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలనూ స్వాధీనం చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో బీజాపూర్ జిల్లాలోని ఉసూర్ పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న తాడ్పాలా గ్రామ సమీపంలో ఈ నెల 4న భద్రతాదళాలు 'సురక్షా ఏవం జన్ సువిధ క్యాంపు'ను ఏర్పాటు చేసినట్లు ఒక అధికారి ఆదివారం వెల్లడించారు. సీఆర్‌పీఎఫ్, కోబ్రా దళాలకు చెందిన 196, 205 బెటాలియన్లకు ఈ క్యాంపు ఎఫ్‌వోబీ(ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్)గా ఉపయోగపడనుందన్నారు. ఈ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలను అరికట్టడానికి, భద్రతాదళాల ఆపరేషనల్ సామర్థ్యాలను మెరుగుపరచడానికి, అలాగే, గ్రామస్థులకు అత్యవసర సేవలు కల్పించడంలో ఈ క్యాంపు దోహదపడుతుందని చెప్పారు. అడవుల్లో ఆపరేషనల్ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఈ ప్రాంతాన్ని ప్రత్యేక శిక్షణ కేంద్రంగానూ అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. ఇక్కడి నుంచే ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దు వెంబడి సంయుక్త, సమన్వయ ఆపరేషన్లు నిర్వహించనున్నట్టు చెప్పారు. కాగా, బీజాపూర్‌లో ఐదుగురు నక్సల్స్‌ను, ఇద్దరు సానుభూతిపరులను అరెస్టు చేసినట్టు ఓ పోలీసు అధికారి తెలిపారు.

అసెంబ్లీ సమావేశాలకు లొంగిపోయిన నక్సల్స్!

ఛత్తీస్‌గఢ్ ఉపముఖ్యమంత్రి విజయ్ శర్మ శనివారం సుక్మా జిల్లా కేంద్రంలోని లొంగిపోయిన నక్సల్స్ పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. అందులో 94మంది లొంగిపోయిన నక్సల్స్ ఆశ్రయం పొందుతున్నారు. వారిలో 54 మంది పురుషులు, 40మంది మహిళలు ఉన్నారు. అక్కడ వారికి అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలు, వసతి సౌకర్యాలను డిప్యూటీ సీఎం అడిగి తెలుసుకున్నారు. అసెంబ్లీ శీతాకాల సమావేశాల సమయంలో వారంతా శాసనసభను సందర్శించి ప్రజాస్వామ్య ప్రక్రియలు ఎలా ఉంటాయో తెలుసుకునేలా ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

ఏఐ దుర్వినియోగాన్ని అడ్డుకోవాలి

గ్లోబల్ కాంపాక్ట్‌ను ఏర్పాటు చేయాలి.. జీ20 సదస్సులో ప్రధాని మోదీ పిలుపు



దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రమఫోసా, బ్రెజిల్ అధ్యక్షుడు లులాతో ప్రధాని మోదీ

జొహన్నెస్‌బర్గ్, నవంబరు 23: ప్రపంచవ్యాప్తంగా ఏఐ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు గ్లోబల్ కాంపాక్ట్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ అన్నారు. దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో జరుగుతున్న జీ20 సదస్సు మూడో సెషన్‌ను ఉద్దేశించి ఆదివారం ఆయన మాట్లాడారు. 'అందరికీ పారదర్శకమైన, న్యాయమైన భవిష్యత్తు-కీలక ఖనిజాలు-ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' అంశాలపై ఈ సెషన్‌లో చర్చిస్తున్నారు. దీనిపై మోదీ మాట్లాడుతూ.. ఏఐ వినియోగంలో తగిన మానవ పర్యవేక్షణ, డిజైన్ సేఫ్టీ, పారదర్శకత ఉండాలన్నారు. డీప్‌ఫేక్‌కు, నేరాలు, ఉగ్రవాద కార్యకలాపాలకు ఏఐని వినియోగించకుండా కఠిన పరిమితులు విధించాలని సూచించారు. ఏఐ వ్యవస్థను బాధ్యతాయుతంగా తీర్చిదిద్దాలన్నారు. అన్నింటికంటే ముఖ్యంగా ఏఐ అనేది మానవ సామర్థ్యాన్ని మరింత పెంచేదిగా ఉండాలని, కానీ.. అంతిమ నిర్ణయం తీసుకునే బాధ్యత మాత్రం మనుషుల చేతిలోనే ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఏఐ పట్ల 'నేటి ఉద్యోగాలు'గా ఉన్న అభిప్రాయం.. 'రేపటి సామర్థ్యాలు'గా మారాలన్నారు. ఈ విషయంలో వేగవంతమైన సృజనాత్మకత కోసం చైతన్యవంతమైన ప్రతిభ అవసరమని, తాము ఢిల్లీలో నిర్వహించనున్న జీ20 తదుపరి సదస్సులో ఈ అంశాన్ని చేరుస్తామని చెప్పారు. భారత్‌లో ఏఐ ప్రయోజనాలు దేశంలోని ప్రతి ఒక్కరికీ అందేలా తాము చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందుకోసం ఇండియా-ఏఐ మిషన్‌ను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఏఐ ప్రభావ సదస్సుకు భారత్ ఆతిథ్యమివ్వనున్నట్లు చెప్పారు. ఈ సదస్సుకు జీ20 దేశాలన్నీ హాజరు కావాలని కోరారు.

భద్రతా మండలిలో సంస్కరణలు చేపట్టాలి..

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలు చేపట్టడం అనివార్యమని మోదీ అన్నారు. మొత్తంగా ప్రపంచ పరిపాలనా వ్యవస్థలోనే సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందంటూ భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా దేశాల (ఐబీఎస్‌ఏ) గ్రూప్ సందేశం ఇవ్వాలన్నారు. ఆదివారం ఐబీఎస్‌ఏ నేతల సదస్సులో మోదీ మాట్లాడారు. ప్రపంచం చీలికలకు, విభజనకు గురవుతున్నట్లు కనిపిస్తున్న తరుణంలో ఐక్యత, సహకారం, మానవత్వ సందేశాన్ని ఐబీఎస్‌ఏ ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఐబీఎస్‌ఏ-ఎన్‌ఎస్‌ఏ సమావేశాన్ని సంస్థాగతం చేయడం ద్వారా మూడు దేశాల మధ్య భద్రతా సహకారాన్ని బలోపేతం చేయాలని దక్షిణాఫ్రికా, బ్రెజిల్ అధ్యక్షులు సిరిల్ రమఫోసా, లులా డా సిల్వకు భారత ప్రధాని ప్రతిపాదించారు.

మన తేజస్ ఎంత భద్రం?

(మొదటిపేజీ తరువాయి)

కలిగిస్తోందిగానీ.. ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన ఎఫ్-16లు, రఫేల్ యుద్ధవిమానాల వంటివి తొలిదశల్లో ఇంతకన్నా ఎక్కువ సంఖ్యలో నేలకూలినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుతానికి భారత వాయుసేన వద్ద రెండు స్క్వాడ్రన్ల తేజస్-ఎంకే1లు ఉన్నాయి. 2001లో మొదటి టెస్ట్ ఫ్లైట్ నిర్వహించినప్పటి నుంచి దాదాపు 18 వేల గంటల ఫ్లీట్ ఫ్లైయింగ్ అవర్స్ నమోదు చేసిన తేజస్ విమానం ప్రమాదానికి గురికావడం ఇది రెండోసారి. మొదటి ప్రమాదం కిందటి సంవత్సరమే జరిగింది. 2024 మార్చిలో రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో ఒక తేజస్-ఎంకే1 కూలిపోయింది. 24 సంవత్సరాల వ్యవధిలో రెండు ప్రమాదాలు అంటే చాలా తక్కువగా అనిపించవచ్చు. కానీ, విమాన ప్రమాదాలను 'ఫ్లైట్ అవర్స్' లెక్కలో కొలుస్తారు. లక్ష గంటల ఫ్లైట్ అవర్స్‌లో సగటున ఎన్ని ప్రమాదాలు జరిగాయి అనే లెక్క ఆధారంగా ఆయా విమానాలు ఎంతవరకూ సురక్షితమో గుర్తిస్తారు. ఉదాహరణకు.. అమెరికాకు చెందిన ఎఫ్-16 యుద్ధవిమానాలనే తీసుకుంటే.. 1975-1993 నడుమ లక్ష ఫ్లైట్ అవర్స్‌లో సగటున 5 'క్లాస్-ఏ' ప్రమాదాలు జరిగాయి ('క్లాస్-ఏ' ప్రమాదాలంటే.. పైలట్ ప్రాణాలు కోల్పోవడం లేదా శాశ్వత వైకల్యానికి గురికావడం లేదా ఆ ప్రమాదం వల్ల 20 లక్షల డాలర్లకు మించి నష్టం వాటిల్లడం). కానీ.. 1975 సంవత్సరం ఒక్కదాన్నే లెక్కలోకి తీసుకుంటే.. ఒక ఎఫ్-16 నేలకూలి పైలట్ చనిపోయారు. ఆ ఏడాది ఎఫ్-16 యుద్ధవిమానాలు 161 గంటల పాటు ఎగిరాయి. ఎగిరిన గంటలు, పోయిన ప్రాణాల ఆధారంగా లెక్కిస్తే ((1/161) × 100,000).. ప్రమాదాల సగటు 621.11. రెండో ఏడాదికి ఆ సగటు 442.48కి తగ్గింది. ఇలా ఎఫ్-16లు ఇప్పటిదాకా ఎగిరిన గంటలన్నింటినీ కలిపి లెక్కిస్తే ఆ ప్రమాదాల సగటు 3.55కు తగ్గిపోయింది. ఇలా మన తేజస్ ఎంకే1 'క్యుములేటివ్ ఆపరేషనల్ ఫ్లైట్ అవర్స్'కు సంబంధించి అధికారిక గణాంకాలు అందుబాటులో లేవు. ఉన్న 'దాదాపు 18 వేల గంటల ఫ్లైట్ అవర్స్' అనే అంచనా లెక్కనే పరిగణనలోకి తీసుకుని దాన్ని లక్ష గంటలకు అన్వయిస్తే.. ((2/18,000) ꠰100,000).. సగటున 11.1 ప్రమాదాలతో సమానం. అమెరికన్ ఎఫ్-16 తొలినాటి ప్రమాదాల లెక్కతో పోలిస్తే ఇది చాలా తక్కువ కిందే లెక్క. ఇక.. ఫ్రాన్స్‌కు చెందిన దసో కంపెనీ నుంచి మనం కొంటున్న రఫేల్ యుద్ధవిమానాల విషయానికి వస్తే.. లక్ష గంటల ఫ్లైట్ అవర్స్‌లో 1.73 నుంచి 3 క్లాస్-ఏ ప్రమాదాలు జరిగినట్లు.. అందుబాటులో ఉన్న వివరాల ఆధారంగా తెలుస్తోంది. పాకిస్థాన్ వద్ద ఉన్న జేఎఫ్-17 యుద్ధవిమానాల ఫ్లైట్ అవర్స్ 19 నుంచి 25 వేల గంటలని సమాచారం. 2007 నుంచి 2024 నడుమ ఆరు జేఎఫ్-17లు నేలకూలాయి. 19 వేల ఫ్లైట్ అవర్స్‌ను లక్ష ఫ్లైట్ అవర్స్‌కు అన్వయిస్తే.. 26.3 ప్రమాదాలతో సమానం. అయితే, ఎఫ్-16లు, రఫేల్ యుద్ధవిమానాలకు లక్షల గంటల ఫ్లైట్ అవర్స్ ఉన్నాయి కాబట్టి వాటి విషయంలో నిర్దిష్ట డేటా దొరుకుతోంది. కానీ.. తేజస్-ఎంకే1, జేఎఫ్-17ల విషయంలో లక్ష గంటల ఫ్లైట్ అవర్స్ ఇంకా నమోదు కాలేదు. మన తేజస్ ఎంకే1కు సంబంధించి 24 ఏళ్ల వ్యవధిలో జరిగినవి రెండే ప్రమాదాలు.

-సెంట్రల్‌డెస్క్



తగ్గుతున్న నమ్మకం?

తేజస్ యుద్ధవిమానం కూలిపోవడం వల్ల మన వాయుసేనకు హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్)పై ఉన్న విశ్వసనీయత మరింత తగ్గే ముప్పుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. హాల్‌పై భారత వాయుసేనకు నమ్మకం కలగట్లేదని ఫిబ్రవరిలో ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ బహిరంగంగా వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. 2025 ఫిబ్రవరి నాటికే 11 'తేజస్-ఎంకే1ఏ' యుద్ధవిమానాలను సరఫరా చేస్తామన్న హాల్ ఒక్క విమానాన్ని కూడా సిద్ధం చేయలేకపోయిందని గుర్తుచేశారు. విమానాల తయారీలో ఆలస్యానికి కారణం.. జీఈ సంస్థ నుంచి ఎఫ్404 ఇంజిన్లు రాకపోవడమేనని హాల్ సంస్థ చెబుతూ వచ్చింది. అక్టోబరు 17కు రెండు తేజస్-ఎంకే1ఏ విమానాలను సరఫరా చేస్తామని తెలిపింది. జీఈ కంపెనీ నుంచి ఇంజిన్లు వచ్చాయి. 4ఇంజిన్లు సిద్ధంగా ఉన్నాయి. కానీ.. నవంబరు ముగుస్తున్నా విమానాలు మాత్రం వాయుసేనకు అందలేదు. మరోవైపు.. మిగ్ విమానాలను కూడా ఈ ఏడాదే సేవల నుంచి తొలగించడంతో వాయుసేన వద్ద స్క్వాడ్రన్ బలం బాగా తగ్గిపోయింది. ఇలాంటి సమయంలో.. తేజస్-ఎంకే1 విమానం కూలిపోవడం ఆందోళన కలిగిస్తోంది.

ఫార్ములా-ఈ రేస్ కేసులో కేటీఆర్‌కు జైలు ఖాయం

▸ కేటీఆర్, హరీశ్‌లవి డైవర్షన్ పాలిటిక్స్ : మంత్రి అడ్లూరి



జగిత్యాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ రేసు కేసులో మాజీ మంత్రి కేటీఆర్ జైలుకెళ్లక తప్పదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితమైతే కేటీఆర్, హరీశ్‌రావు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆదివారం మీడియాతో అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అతిపెద్ద భూకుంభకోణానికి తెర లేపారని ఇటీవల కేటీఆర్, హరీశ్‌లు చేసిన ఆరోపణలపై మండిపడ్డారు. దమ్మూ ధైర్యం ఉంటే ఆ ఆరోపణలకు ఆధారాలను ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉంటుందన్న అడ్లూరి.. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని స్పష్టం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో మధ్యలోనే జెండా కింద పడేసి బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు పలికిందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ కాంగ్రెస్ పార్టీకే ప్రజలు పట్టం కట్టారని గుర్తు చేశారు.

చీరలను సారెగా భావించి.. 'స్థానికం'లోనూ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

▸ ఇందిరమ్మ చీరల పంపిణీలో మంత్రులు పొన్నం, దుద్దిళ్ల




మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం

ఎల్కతుర్తి, కృష్ణకాలనీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అన్నింటి కన్నా ఆడబిడ్డ ఆశీర్వాదమే బలమైందని, రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డలకు అందించే చీరలను సారెగా భావించి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి, భూపాలపల్లిలలో ఇందిరా మహిళా శక్తి ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రులిద్దరూ ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడంతో పాటుగా వ్యాపారాల్లో రాణించడానికి మహిళా సంఘాలకు బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ ప్లాంట్‌లు రాయితీపై అందించి ప్రోత్సహిస్తున్నదని అన్నారు. మహిళా సంఘాలు ఐక్యతగా ఉండి ఆర్థికాభివృద్ధి సాధించేలా పని చేయాలని సూచించారు. దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతోందని, ఇది ప్రతిపక్షాలకు మింగుడు పడటం లేదని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని రద్దు చేయాలని జూబ్లీహిల్స్ ఎన్నిక సందర్భంగా డిమాండ్ చేశాయని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఆదరించిన మాదిరిగానే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరారు.

'విత్తన ధ్రువీకరణ'కు కొత్త డైరెక్టర్!

▸ ప్రస్తుత డైరెక్టర్ కునుసోత్ కేశవులు డిప్యూటేషన్ గడువు నేటితో పూర్తి
▸ కొత్తవారి నియామకానికి సర్కారు యోచన
▸ పలువురు ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తల యత్నాలు

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థ (సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ) డైరెక్టర్ పదవికి పోటాపోటీ నెలకొంది. ప్రస్తుత డైరెక్టర్ ప్రొఫెసర్ కునుసోత్ కేశవులు డిప్యూటేషన్ గడువు సోమవారంతో ముగుస్తోంది. 2014 నుంచి 11 ఏళ్లుగా ఈ పోస్టులో కొనసాగుతున్న ఆయన డిప్యూటేషన్ పొడిగింపు ఉత్తర్వులేవీ ప్రభుత్వం జారీ చేయలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచి కొనసాగుతున్న ఆయనను కొనసాగించటం సరికాదనే ఆలోచనకు వచ్చినట్టు తెలిసింది. కేశవులును మాతృశాఖకు పంపి, కొత్తవారికి అవకాశం కల్పించాలని భావిస్తున్నట్టు సమాచారం. విత్తనాల ధ్రువీకరణ, విత్తన కంపెనీలతో సంబంధమున్న నేపథ్యంలో.. ఈ పోస్టు కోసం పలువురు ప్రొఫెసర్లు పోటీపడుతున్నారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థతోపాటు విత్తన ధ్రువీకరణ సంస్థకు వ్యవసాయశాఖలో చాలా ప్రాధాన్యత ఉంది. డైరెక్టర్ పోస్టులో శాఖకు సంబంధించిన అధికారులే ఉండేవారు. తెలంగాణ ఏర్పాటయ్యాక జయశంకర్ వ్యవసాయ వర్సిటీ ప్రొఫెసర్ కేశవులును డిప్యూటేషన్‌పై ఈ పోస్టులో నియమించారు. అప్పటి నుంచి డిప్యూటేషన్ పొడిగిస్తూ వచ్చారు. ఈసారి గడువు నవంబరు 24తో ముగుస్తోంది. ఈ క్రమంలో వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 10మందికిపైగా ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు ఈ పోస్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. అయితే అనుభవమున్న శాస్త్రవేత్తకే ఈ పదవిని అప్పగిస్తేనే మేలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు సమాచారం. మరోవైపు విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ పోస్టును ఆశిస్తున్న ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలపై రాష్ట్ర ప్రభుత్వం ఇంటలిజెన్స్ విభాగం ద్వారా విచారణ చేయిస్తున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

ఈవీల చార్జింగ్‌కు ప్రత్యేక పార్కింగ్

బహుళ అంతస్తుల భవనాల్లో ఇకపై తప్పనిసరి.. ఆ స్థలం కేటాయిస్తేనే భవన నిర్మాణానికి అనుమతి

▸ త్వరలో అమలులోకి రానున్న నూతన బిల్డింగ్ కోడ్‌లో నిబంధన !



హైదరాబాద్ సిటీ, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) వినియోగం నానాటికి పెరుగుతోంది. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వాలు కూడా ఈవీల కొనుగోలుకు ప్రజలను ప్రోత్సహిస్తున్నాయి. ఇంధన ఖర్చుల ఆదా కోసం ప్రజలు కూడా ఈవీలను విరివిగా కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ఈవీల సంఖ్య రోజురోజుకి పెరుగుతోంది. బహుళ అంతస్తుల భవనాల్లో ప్రస్తుతం వాహనాల పార్కింగ్ స్థలం మాత్రమే ఉంటుంది. కొత్తగా నిర్మిస్తున్న కొన్ని భవనాల్లో కొందరు ఈవీ చార్జింగ్ పార్కింగ్(ఎలక్ట్రిక్ వాహనాలు చార్జింగ్ చేసుకునే ప్రదేశం)లను ఏర్పాటు చేస్తున్నారు. భవిష్యత్తులో ఈవీల వినియోగం మరింత పెరగనుండడంతో పెద్దపెద్ద అపార్ట్‌మెంట్లు, భవనాల్లో ఈవీలు చార్జింగ్ చేసుకొనే స్థలానికి భవిష్యత్తులో చాలా ప్రాధాన్యం ఉండనుంది. ఈ నేపథ్యంలో భవిష్యత్తు అవసరాల దృష్ట్యా బహుళ అంతస్తుల భవనాల్లో ఈవీ చార్జింగ్ పార్కింగ్‌కు ప్రత్యేకంగా స్థలాన్ని తప్పనిసరిగా విడిచిపెట్టాలనే నిబంధనను రాష్ట్ర ప్రభుత్వం తీసుకురాబోతుంది. ఆ నిబంధనను పాటిస్తేనే భవన నిర్మాణానికి అనుమతి ఇచ్చేలా ప్రణాళికలు చేస్తోంది. భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతులకు సంబంధించి త్వరలో తీసుకువస్తున్న యునిఫైడ్ డెవలప్‌మెంట్ బిల్డింగ్ కోడ్(యూడీబీసీ)లో ఈ నిబంధనను చేర్చుతుంది. భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్ అనుమతులపై ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించి 2012 ఏప్రిల్ 7న జీవో నెం.168ను జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత కూడా ఆ ఉత్తర్వులనే అమలు చేస్తున్నారు. అయితే, కాలానుగుణంగా, ప్రజల అవసరాలకు అనుగుణంగా జీవో 168లో సవరణలు చేశారు. నదుల వెంట బఫర్ జోన్ గతంలో 100మీటర్ల వరకు ఉండగా దానిని 50మీటర్లకు సవరించారు. చెరువులు, కుంటల వెంట బఫర్‌జోన్ 30మీటర్లు ఉంటే అందులో 12 అడుగుల వరకు సైకిల్ ట్రాక్ లేదా వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి అవకాశం కల్పించారు. భవనాల చార్జీలను సవరిస్తూ 2016లో జీవో 7 జారీ చేశారు. బహుళ అంతస్తుల భవన నిర్మాణ అనుమతుల సందర్భంలో నిర్మాణానికి గ్రౌండ్‌తో పాటు మొదటి రెండు అంతస్తులను మాత్రమే తనఖా పెట్టేందుకు అవకాశం ఉండగా ఆ తర్వాత సవరణ చేసి ఏదైనా అంతస్తు తనఖా పెట్టేందుకు అవకాశం కల్పించారు. అదేవిధంగా లేఅవుట్లకు అప్రోచ్ రోడ్డు వంద అడుగులు చేశారు. ఇలా జీవో 168ను పలుమార్లు సవరించారు. ఈ విధంగా సవరించిన జీవోలు 50కి పైగా ఉన్నాయి.

యూడీబీసీ బాధ్యతలు హెచ్‌ఎండీఏ కమిషనర్‌కు

జీవో 168లో ప్రస్తుతమున్న నిబంధనలు, తర్వాత తీసుకొచ్చిన సవరణలన్నింటినీ క్రోడీకరించి యూడీబీసీని రూపొందిస్తున్నారు. యూడీబీసీకి సంబంధించిన బాధ్యతలను ప్రభుత్వం హెచ్ఎండీఏ కమిషనర్‌కు అప్పగించింది. యూడీబీసీ రూపకల్పనకు ఎర్నెస్ట్ యంగ్ అనే సంస్థను కన్సల్టెన్సీగా నియమించారు. ఈ సంస్థ ఇప్పటికే ముసాయిదా సిద్ధం చేయగా, వివిధ శాఖల ఉన్నతాధికారులు, వివిధ రంగాలకు చెందినవారితో వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారు. దేశ, విదేశాల్లోని అభివృద్ధి చెందిన నగరాల్లో అమల్లో ఉన్న అత్యుత్తమ విధానాలను హైదరాబాద్‌లో అమలు చేయడానికి చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా భవన నిర్మాణ అనుమతుల్లో ఈవీ చార్జింగ్ పార్కింగ్‌కు పెద్దపీట వేయాలని నిర్ణయించారు. బహుళ అంతస్తుల భవనాల్లో ఎలక్ట్రిక్ వాహనాలకు చార్జింగ్ పెట్టేందుకు ప్రత్యేకంగా పార్కింగ్‌ను ఏర్పాటు చేసేలా నిబంధన తీసుకొస్తున్నారు. సాధారణ పార్కింగ్‌కు అదనంగా ఈవీ చార్జింగ్ పార్కింగ్‌కు భవన నిర్మాణంలో స్థలం కేటాయించాలని నిర్ణయించారు. ఈ నిబంధనను యూడీబీసీలో చేర్చనున్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా.. వాగులో మునిగి పదో తరగతి విద్యార్థి మృతి

▸ మరో ఇద్దరి ప్రాణాలు కాపాడిన రైతులు
▸ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఘటన

అశ్వారావుపేట రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి వాగులోకి సరదాగా స్నానానికి విద్యార్థులు.. ఈత రాక మునిగిపోవడంతో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆదివారం జరిగింది. అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని దొంతికుంటకు చెందిన గుమ్మళ్ల విజయ్, లిజి దంపతుల చిన్న కుమారుడు యశ్వంత్ (15) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం అయిదుగురు స్నేహితులతో కలిసి ఏపీలోని జీలుగుమిల్లి మండలంలో గల సంగం వాగులోకి స్నానానికి వెళ్లాడు. అతడితో పాటు మరో ఇద్దరు వాగులోకి దిగగా.. లోతు ఎక్కువగా ఉండడం, ఈత రాకపోవడంతో మునిగిపోయారు. ఒడ్డున ఉన్న మరో ఇద్దరు గమనించి కేకలు వేయడంతో చుట్టుపక్కల పొలం పనులు చేస్తున్న రైతులు వచ్చి ముగ్గురినీ బయటకు తీసుకువచ్చారు. వీరిలో ఇద్దరు ప్రాణాలతో బయటపడగా.. యశ్వంత్ అప్పటికే మృతిచెందాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు వాగు వద్దకు వెళ్లి మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు. సరదగా బయటకు వెళ్లిన తమ కుమారుడు విగతజీవిగా మారడంతో ఆ కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏఐతో ఊపిరితిత్తుల క్యాన్సర్ గుర్తింపు

▸ యశోద ఆస్పత్రిలో లంగ్ నోడ్యూల్ క్లినిక్ ప్రారంభం

హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఏటా లక్ష మందికిపైగా ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో ప్రాణాలు కోల్పోతున్నారని యశోద ఆస్పత్రి ఎండీ డాక్టర్ జీఎస్ రావు అన్నారు. వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స అందించకపోవడమే దీనికి ప్రధాన కారణమన్నారు. ఏఐతో ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను ముందుగా గుర్తించి చికిత్స అందించేందుకు అస్ట్రాజెనెకా సహకారంతో హైటెక్ సిటీ యశోద ఆస్పత్రిలో 'లంగ్ నోడ్యూల్ క్లినిక్'ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎస్ రావు మాట్లాడుతూ.. ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు సంబంధించి 80% కేసులను ఆలస్యంగా గుర్తిస్తున్నారని, ఫలితంగా చికిత్స కష్టంగా మారుతోందని చెప్పారు. కాగా, ఏఐ సాయంతో తాము 77 మందిలో ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించామని యశోద ఆస్పత్రి సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ నాగార్జున చెప్పారు.

2న ఎర్త్‌సైన్స్ వర్సిటీ ప్రారంభం

▸ ముఖ్య అతిథిగా పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి

కొత్తగూడెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ రెండో తేదీన భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటైన ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. యూనివర్సిటీ ప్రారంభం, తర్వాత బహిరంగ సభ నిర్వహణ ఏర్పాట్లపై ఆయన ఆదివారం పరిశీలించి అధికారులతో సమీక్షించారు. అనంతరం తుమ్మల మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రోజుకు 2 జిల్లాల చొప్పున ఏడు రోజుల్లో అన్ని జిల్లాల్లో సీఎం రేవంత్ పర్యటించి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారన్నారు. ఇప్పటి వరకూ మనదేశంతోపాటు ప్రపంచ దేశాల్లో భూగోళంలోని ఒక్కొక్క సబ్జెక్టుకు ఒక్కో వర్సిటీ మాత్రమే ఉందన్నారు. అందుకు భిన్నంగా దేశ భవిష్యత్తుతోపాటు ప్రపంచానికి ఉపయోగ పడేలా జియాలజీ, పర్యావరణం, బయో డైవర్సిటీ వంటి అన్ని సబ్జెక్టులతో సంస్కరణలకు ఆద్యుడైన ఆర్థిక వేత్త, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేరుతో ఎర్త్ సైన్స్ వర్సిటీ ఏర్పాటు చేశామని తుమ్మల తెలిపారు. కొత్తగూడెంలో అన్ని రకాల ఖనిజాలు లభించడం కలిసొచ్చే అంశమన్నారు. ప్రపంచ భవిష్యత్తుకు ఉపయోగ పడేలా విద్యావ్యవస్థను రూపొందించి, దానికి కావాల్సిన మౌలిక వసతులను యూనివర్సిటీలో కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, రాందాస్ నాయక్, భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ పాల్గొన్నారు.

'నీరు'గారిన గిరిజన ఉపాధి

ఏడేళ్లుగా గోదాముల్లోనే అటవీ సంపద.. కుళ్లి, రంగుమారి, కరిగిపోయిన ఇప్పపువ్వు

▸ గోదాముల్లోని ఇతర ఉత్పత్తులదీ అదే పరిస్థితి
▸ రెండేళ్లుగా గిరిజనుల నుంచి జీసీసీ కొనుగోళ్లు బంద్
▸ ఆదివాసీల జీవనాధారంపై దెబ్బ.. జీసీసీకి తీవ్ర నష్టం
▸ కోట్లలో నష్టం వస్తున్నా పట్టించుకోని అధికారులు



భద్రాచలం డివిజన్ చిన్ననల్లబల్లి గోదాములో పాడైపోయిన ఇప్పపువ్వు

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు ఉపాధి కల్పించి, వారికి ఆర్థికంగా దన్నుగా నిలవాల్సిన గిరిజన సహకార సంస్థ (జీసీసీ).. ఇప్పుడు ఆ అడవి బిడ్డలకే భారంగా మారింది. జీసీసీ అధికారుల నిర్లక్ష్యం.. గిరిజనుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అడవి బిడ్డలు ఎంతో శ్రమించి సేకరించిన విలువైన అటవీ ఉత్పత్తులు (మైనర్ ఫారెస్ట్ ప్రొడ్యూస్-ఎంఎఫ్‌పీ) జీసీసీ గోదాముల్లో ఏళ్ల తరబడి నిల్వ ఉండి పాడైపోతున్నాయి. సకాలంలో వీటిని విక్రయించకపోవడంతో ఇప్పపువ్వు వంటి అటవీ సంపద కుళ్లిపోయి, రంగుమారి నీరై కరిగిపోతోంది. పాత సరుకు గోదాముల నిండా ఉండటంతో గత రెండేళ్లుగా గిరిజనుల నుంచి కొత్త ఉత్పత్తులను సేకరించటం లేదు. దీంతో అటు అడవి బిడ్డలకు ఉపాధి లేకుండా పోగా, ఇటు జీసీసీ కూడా భారీ నష్టాలను మూటగట్టుకుంటోంది. మూడేళ్ల క్రితం జీసీసీ ఆదాయం రూ.400 కోట్లను మించగా.. గత రెండేళ్లలో పరిస్థితి పూర్తిగా తిరగబడి రూ.60-70 కోట్లు నష్టపోయే పరిస్థితి వచ్చింది.

ఏళ్ల తరబడి నిల్వ..

రాష్ట్రంలో గిరిజనుల నుంచి జీసీసీ 15 రకాల అటవీ ఉత్పత్తును సేకరించింది. 2017-18 నాటి అత్యంత పాత నిల్వలు సైతం నేటికీ గోదాముల్లోనే మగ్గుతున్నాయి. ఏడేళ్లుగా నిల్వ ఉండటం వల్ల ఇప్పపువ్వు రంగు నల్లగా మారి, కరిగి నీళ్లలా మారిపోయింది. ఉట్నూరు గోదాములో 2017-18 నుంచి 2023-24 వరకు సేకరించిన ఇప్పపువ్వు నిల్వలు 7,798 క్వింటాళ్లు పేరుకుపోయాయి. ఏటూరునాగారంలో 2017-18లో సేకరించిన ఇప్పపువ్వు 1,744 క్వింటాళ్లు గోదాములోనే పాడైపోయింది. 2018-19, 2022-23లలో కొనుగోలు చేసిన 3,448 క్వింటాళ్ల ఇప్పపువ్వు గోదాములోనే మూలుగుతోంది. భద్రాచలంలో 2021-22 నుంచి 2023-24 వరకు వెయ్యి క్వింటాళ్లకుపైగా ఇప్పపువ్వు నిల్వ ఉంది. గతంలో ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన అధికారి స్థానిక గోదాము ఇన్‌చార్జికి తాళంచెవులు అప్పగించకపోవడంతో దానిని ఇప్పటివరకు తెరవనేలేదు. దీంతో ఆ గోదాములో సరకులు ఎలా ఉన్నాయనేది ఎవరికీ తెలియని పరిస్థితి ఏర్పడింది. కామారెడ్డిలో 2020-21 నుంచి దాదాపు 2 వేల క్వింటాళ్లు గోదాముల్లోనే ఉండిపోయింది. పాడవకుండా ఉన్న ఇప్పపువ్వు కిలో ధర రూ.30లకుపైగా ఉంది. పాడైపోయిన ఉత్పత్తుల వల్ల జీసీసీ భారీగా నష్టపోయే పరిస్థితి వచ్చింది. ఉట్నూరులో కిలో రూ.10కి, ఏటూరునాగారంలో రూ.20లకు అమ్ముదామన్నా కొనేందుకు ఎవరూ ముందుకు రావటం లేదు. ఇప్ప గింజలు భద్రాచలంలో 210 క్వింటాళ్లు, ఏటూరునాగారంలో 120 క్వింటాళ్లు గోదాముల్లోనే మూలుగుతున్నాయి.

విషముష్టి గింజలు, బంక పరిస్థితీ అంతే..

విషముష్టి గింజలు, జిగురు/బంక వంటి ఇతర ఉత్పత్తుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఏటూరునాగారంలోనే 400 క్వింటాళ్లకుపైగా విషముష్టి గింజలు నిల్వ ఉన్నాయి. భద్రాలచలంలో ఏళ్లుగా నిల్వ ఉన్న ఈ గింజలు పాడైపోయాయి. కిలో రూ.75కిపైగా ఉన్న వీటి ధరను రూ.45కు తగ్గించినా పాడైపోవడంతో కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకురావటం లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రం వాటాగా వచ్చిన జిగురు/బంకను హైదరాబాద్ సమీపంలోని గోదాముల్లో నిల్వ చేశారు. అప్పట్లో కిలో బంక రూ.240 చొప్పున కొనుగోలు చేయగా.. ప్రస్తుతం రూ.60 కంటే తక్కువ ధర నిర్ణయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ గోదాములపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యమైన బంకను కిందిస్థాయి అధికారులు ఇతర ప్రాంతాల్లో అమ్మేసి.. నాసిరకం బంకను కొనుగోలు చేసి గోదాములో నిల్వ ఉంచారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. చింతపండు కూడా ఏటూరునాగారంలో 650 క్వింటాళ్లకుపైగా నిల్వ ఉంది. ఎక్కువ రోజులు నిల్వ ఉంటే తినడానికి పనికిరాదని తెలిసినా.. అధికారులు అలాగే ఉంచారు. కరక్కాయలు, చిల్ల గింజలు, నల్ల జీడిపిక్కలు, కుంకుడుకాయలు, అడవి చీపుర్లు కూడా ఏళ్లతరబడి గోదాముల్లోనే మూలుగుతున్నాయి. నిర్మల్ గోదాములోని తేనెను చాలారోజులుగా సరైన పద్ధతిలో నిల్వ చేయకపోవటంతో గడ్డకట్టి వాసన వస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు నాణ్యమైన తేనెను గుట్టుచప్పుడుకాకుండా బయట అమ్మేసి.. నాసిరకం సరుకును తెచ్చి కల్తీ చేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

గిరిజనుల జీవనోపాధికి కోలుకోలేని దెబ్బ..

గోదాముల్లో పాత సరుకు ఉండటాన్ని కారణంగా చూపుతూ జీసీసీ అధికారులు కొత్తగా అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లను నిలిపివేశారు. దీంతో గిరిజనుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడింది. భద్రాచలం, ఏటూరునాగారం, ఉట్నూరు ప్రాంతాల్లో రెండేళ్లుగా గిరిజనుల నుంచి ఇప్పపువ్వు కొనుగోలు చేయటం లేదు. కుంకుడు కాయలకు మంచి డిమాండ్ ఉన్నప్పటికీ 30 క్వింటాళ్లు మాత్రమే సేకరించారు. చీపుర్లు, నల్లబంక, పెంజారి గింజలు వంటి కీలక ఉత్పత్తుల సేకరణ పూర్తిగా నిలిపేశారు. గిరిజనులకు అటవీ ఉత్పత్తుల సేకరణే ప్రధాన జీవనాధారం. జీసీసీ కొనుగోళ్లు నిలిపివేయడంతో వారు తమ సరుకును అమ్ముకోవడానికి ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అవకాశంగా ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి అడవి బిడ్డల పొట్ట కొడుతున్నారు. సేకరించిన సరుకును సకాలంలో మార్కెటింగ్ చేయడంలో, నిల్వ సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో జీసీసీ అధికారుల ఘోరంగా విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సరైన ధర రావట్లేదు..

అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేయాలన్నా.. సేకరించినవి విక్రయించాలన్నా గిరిజన సంక్షేమశాఖ ఎండీదే తుది నిర్ణయం. ఇందులో నా ప్రమేయం ఏమీ లేదు. ఫైల్స్ పంపడం వరకు మాత్రమే నా బాధ్యత. టెండర్లు పిలుస్తున్నా.. సరైన ధర రాకపోవడం వల్ల పలుమార్లు వాయిదా వేశాం. దీంతో ఎక్కువ రోజులు నిల్వ ఉంచాల్సి వస్తోంది. -సీతారాం నాయక్, జీఎం, జీసీసీ

గల్ఫ్ ఎయిర్ విమానానికి బాంబు బెదిరింపు

శంషాబాద్ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బహ్రెయిన్ నుంచి వస్తున్న విమానాన్ని పేల్చేస్తామంటూ గుర్తు తెలియని దుండగులు ఆదివారం జీఎంఆర్ కస్టమర్ సపోర్టుకు మెయిల్ పంపడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. 154 మంది ప్రయాణికులతో బహ్రెయిన్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న గల్ఫ్ ఎయిర్ 274 విమానాన్ని ముంబైకి దారి మళ్లించారు. అక్కడ డాగ్, బాంబు స్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహించాక బాంబు లేదని తేల్చారు. తిరిగి విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఉదయం 11.30 గంటలకు దిగింది. కాగా 15 రోజుల్లో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు దాదాపు ఏడెనిమిదిసార్లు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి.

ఉప్పలపాటి సతీష్ కస్టడీకి పోలీసుల పిటిషన్

హైదరాబాద్ సిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్స్ పోలీసుల నుంచి తప్పించుకొని, సీసీఎస్ పోలీసులను ముప్పుతిప్పలు పెట్టిన ఆర్థిక నేరగాడు ఉప్పలపాటి సతీష్, అతని సతీమణి శిల్పా బండను పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. పెట్టుబడుల పేరుతో రూ. కోట్లు కొల్లగొట్టిన నిందితులిద్దరినీ లోతుగా విచారించడానికి పోలీస్ కస్టడీకి ఇవ్వాల్సిందిగా సీసీఎస్ పోలీసులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం న్యాయస్థానంలో విచారణ జరగనుంది. ఇరువర్గాల వాదనలు విన్న అనంతరం నిందితులను పోలీస్ కస్టడీకి ఇచ్చే అవకాశం ఉందని సీసీఎస్ పోలీసులు తెలిపారు

అర్షమొలల వైద్యం వికటించి యువకుడి మృతి

▸ ఆస్పత్రి ముందు మృతదేహంతో కుటుంబసభ్యుల ధర్నా

హయత్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అర్షమొలల (పైల్స్) వైద్యం వికటించి ఓ యువకుడు మృతి చెందాడు. వైద్యుడి నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు మరణించాడంటూ యువకుడి మృతదేహంతో అతడి కుటుంబసభ్యులు ఆసుపత్రి ముందు ఆందోళన చేశారు. ఈ ఘటన హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో శనివారం రాత్రి జరిగింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మల్లాపూర్‌కు చెందిన ఇంటర్ విద్యార్థి చెమ్మ రవితేజ (17) కొంతకాలంగా మొలల వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో అతడి కుటుంబసభ్యులు హయత్‌నగర్‌లోని సైదా పైల్స్ క్లినిక్‌కు నవంబరు 11న తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యుడు సాహెల్ అదేరోజు శస్త్ర చికిత్స చేసి మరుసటి రోజు డిశ్చార్జి చేశారు. మరుసటి రోజు నుంచి రవితేజకు రక్తస్రావం అవుతుండడంతో 20వ తేదీ వరకు ప్రతిరోజు ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించేవారు. 21న రవితేజకు తీవ్ర జ్వరం రావడంతో పరిశీలించిన డాక్టర్ సాహెల్ పరిస్థితి విషమంగా ఉందని చైతన్యపురిలోని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అక్కడా పరిస్థితి కుదుటపడకపోవడంతో రవితేజను ఎల్‌బీనగర్‌లోని రష్ కేర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్లు నిమ్స్‌కు తీసుకువెళ్లాలని సూచించడంతో శనివారం రాత్రి నిమ్స్‌కు తరలించగా, అప్పటికే రవితేజ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వైద్యం రాని సాహెల్ వల్లే తమ కుమారుడు మృతి చెందాడంటూ కుటుంబసభ్యులు శనివారం రాత్రి రవితేజ మృతదేహంతో హయత్‌నగర్‌లోని సైదా క్లినిక్ ముందు ధర్నా చేశారు. అతడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు డాక్టర్ సాహెల్‌పై కేసు నమోదు చేశారు.



సరూర్ నగర్ సభలో మాట్లాడుతున్న చెన్నయ్య

ఎస్సీ వర్గీకరణను పక్కాగా అడ్డుకుంటాం

▸ రోస్టర్ విధానంతో మాలలకు అన్యాయం: చెన్నయ్య

మన్సూరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు సూచనకు విరుద్ధంగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని చూస్తే ఊరుకోబోమని, మాలలకు అన్యాయం చేసే ఎస్సీ వర్గీకరణను ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకుంటామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య పేర్కొన్నారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన మాలల రణభేరి మహాసభలో చెన్నయ్య మాట్లాడారు. చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం ప్రస్తుత జనాభాకు అనుగుణంగా ఎస్సీల రిజర్వేషన్ల శాతం పెంపు, పెండింగ్‌లో ఉన్న ఎస్సీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో 99, రోస్టర్ పాయింట్ల విధానంతో రాష్ట్రంలోని 40 లక్షల మంది మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు.

దట్టమైన పొగ మంచుతో ప్రమాదం సుమా!

▸ వాహనదారులకు పోలీసుల సూచనలు

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చలికాలంలో దట్టమైన పొగ మంచు కురుస్తున్నందున వాహనాలను జాగ్రత్తగా నడపాలని వాహన దారులకు పోలీసు శాఖ హితవు పలికింది. పొగ మంచుతో రోడ్డుపై ఎదురుగా వస్తున్న వాహనాలు, జంతువులు, సిగ్నల్స్ కన్పించవని, ముందు ఉన్న వాహనం, ఆగి ఉన్న వాహనం ఎంత దూరంలో ఉందో అంచనా వేయడం కష్టమని పోలీసుశాఖ పేర్కొంది. చలికాలంలో నిర్ణీత సమయానికి ముందుగానే బయలుదేరాలని, తొందరపాటు లేకుంటే డ్రైవింగ్‌పై ఏకాగ్రత పెరుగుతుందని వివరించింది.

జగన్ చుట్టూ కోటరీ వల్లే రాజకీయాలకు దూరమయ్యా

▸ అవసరమైనప్పుడు రాజకీయాల్లోకి: విజయసాయి

అమరావతి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చుట్టూ కోటరీ ఉన్నందునే తాను రాజకీయాలకు దూరమయ్యానని రాజ్యసభ మాజీ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి అన్నారు. జగన్ చుట్టూ ఉన్న కోటరీ ఆయన్ను డైవర్ట్ చేస్తున్నందునే తాను వైసీపీని వీడానని స్పష్టం చేశారు. ఆదివారం ఆయన ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ.. అవసరమైనప్పుడు తాను రాజకీయాల్లోకి వస్తానని ప్రకటించారు. ప్రస్తుతానికి తనకు రాజకీయ పార్టీ పెట్టే ఉద్దేశం కానీ, ఇతర పార్టీల్లో చేరాలన్న ఆలోచన కానీ లేదని వెల్లడించారు.

నల్లకొండ నీడలో అనువాదాల పండగ

అమెరికాలో ఎక్కడికైనా వెళ్లడం వేరు, అరిజోనాలోని టూసన్ (Tucson) అనే నగరానికి వెళ్లడం వేరు. మరీ తెలియని భాషలో అసలేమీ తెలియని రచయిత రాసిన పుస్తకం ఏదో చదువుతున్నట్టే అనిపించింది. ఎయిర్ పోర్టులో దిగగానే ఎంతో ఎత్తయిన బలిష్ఠమైన కొండ బ్రహ్మజెముడు వృక్షాలు చూపుని కట్టిపడేస్తాయి. చుట్టూ వున్న ఎడారిని ధిక్కరించి నిలబడే ఈ వృక్షాలు వాటికవే శిల్పాల్లా కనిపించాయి. ఎయిర్ పోర్టు నుంచి అరిజోనా యూనివర్సిటీకి తీసుకెళ్లిన డ్రైవర్ అహ్మద్‌కి ఈ వూరంటే మహా ఇష్టం. ఎప్పుడో ముప్ఫయేళ్ల కిందట ఆఫ్గన్ దేశం నుంచి తిన్నగా ఇక్కడికే చేరుకున్నాడు అహ్మద్. "అప్పుడు ఇదంతా ఇంకా కొంత ఎడారిలానే వుండేది," అని అతను వచ్చీ రాని ఉర్దూలో అఫ్గానీ యాసలో చెప్తున్నాడు. అప్పటికే ఈ వూరు గురించి కొంత చదివాను కాబట్టి, నాకు వెంటనే అరిజోనా కవి డాన్ హిగిన్స్ కవిత గుర్తొచ్చింది. 'టూసన్' అంటే నల్ల కొండ పాదాల కింది ఊరు అనే అర్థం వుందట. చుట్టూ నల్లగా ఎత్తయిన కోటగోడల్లా నిలబడి వున్న కొండల్ని చూస్తే అలాగే అనిపించింది.

దిగంతంలోకి సూర్యాస్తమయం
కొంత నెత్తురోడుతుంది.
టూసన్, నువ్వు ఎడారి కలల కాన్వాస్ కదా,
బ్రహ్మజెముడు వృక్షాలు నిటారుగా నిలబడే వుంటాయి
పురాతన కాలాల సైనికుల్లా
వాటి ముళ్ళ దేహాలు
గాలితో ఏదో గుసగుసలాడుతూ వుంటాయి ఎప్పుడూ

నేను కవిత్వాన్ని తలచుకుంటున్నప్పుడు రోజువారీ జీవితంలోని సంఘర్షణ ఏదో చెప్పుకొస్తున్నాడు డ్రైవర్ అహ్మద్.



"నేను వచ్చినప్పటి నుంచీ ఇప్పటిదాకా చాలా మారిపోయాయి. తప్పదు కానీ, వ్యత్యాసాలు బాగా పెరిగాయి" అంటున్నాడు. పేదరికం ఎక్కువగా వుండే ఫిలాడేల్ఫియా నగరం నుంచి వచ్చిన వాణ్ని కాబట్టి అదేమీ విశేషంగా అనిపించలేదు. చూస్తూ వుండగానే మాకు బస ఏర్పాటు చేసిన యూనివర్సిటీ కాంపస్ లోని హోటల్ వచ్చేసింది.

అప్పటికే అక్కడొక మేళా జరుగుతున్నంత సందడి వుంది. పండగ వాతావరణమే అంతా నిజానికి అక్కడ వున్న మూడు రోజులూ, ఆ తరవాత అనువాద సభల రెండో భాగం జరిగిన చికాగో యూనివర్సిటీ కాంపస్‌లో వున్న మూడు రోజులూ అదే పండగ వాతావరణం. దేశాదేశాల రచయితలు ఈ అమెరికా అనువాద ఉత్సవాలకి వచ్చారని వాళ్ళ వాళ్ళ ముఖాలు చూస్తేనో, భాషలు వింటేనో తెలుస్తూనే వుంది. ఇన్ని దేశాలూ, భాషల మధ్య 'తెలుగు' అంటే ఏమిటన్న ప్రశ్న ఎప్పటిలానే నన్ను నిలదీస్తోంది.

2

దాదాపు యాభై యేళ్లుగా ఎక్కడా ఆగకుండా అనువాదాల మీద పనిచేస్తున్న సంస్థ – అమెరికన్ లిటరరీ ట్రాన్స్‌లెటర్స్ అసోసియేషన్ (అల్టా). ఈ ఏడాది మొట్టమొదటిసారి వాళ్ళు వాళ్ళ భాషల జాబితాలో తెలుగుని కలిపారు. అనువాదకులు మాత్రమే కాకుండా, యూనివర్సిటీ స్థాయిలో అనువాదాల చుట్టూ కోర్సులు చెప్తున్న వాళ్ళని నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ రెండింటిలోనూ నా పాత్ర పరిమితమే.





ఆ విషయమే నిర్వాహకులకు చెప్పాను. "మా దృష్టిలో మీరే వున్నారు. రావాల్సిందే" అని వాళ్ళు ఏర్పాట్లు చేశారు.

టూసన్‌లో జరిగిన సదస్సుల్లో ఎక్కువ భాగం యూరోపియన్ భాషలే. దక్షిణాసియా నుంచో, ఇండియా నుంచో వచ్చిన వాళ్ళని వేళ్ళ మీద లెక్కపెట్టాల్సిందే. ఆ కొద్ది మంది కూడా బంగ్లాదేశ్ లేదా పాకిస్తాన్. ఇండియా నుంచి వచ్చిన వాళ్ళలో కన్నడ నుంచి వివేక్ షాన్ బాగ్ అనువాదాలు చేసిన శ్రీనాథ్ పేరూర్, కాశ్మీరీ రచయిత అజర్ వాని, తెలుగు నుంచి నేను మాత్రమే వున్నాం. ఒకరు బంగ్లా నుంచి, మరొకరు పాకిస్తాన్ నుంచి, హిందీ భాష కోసం ప్రసిద్ధ అనువాదకురాలు డైసీ రాక్ వెల్ వున్నారు. అందువల్ల, మూడు రోజుల పాటు జరిగిన ప్రతి సెషన్ లోనూ ఎంతో కొంత మాట్లాడక తప్పలేదు. తెలుగు మాత్రమే కాకుండా, దక్షిణాసియా సాహిత్య పాఠాలు చెప్పే అధ్యాపకుడిగా హిందీ, ఉర్దూ భాషల అనువాదాల ప్రాముఖ్యాన్ని కూడా చెప్పాలని నిర్వాహకులు ముందే చెప్పారు. ఇది అంత తేలిక కాదు కానీ, చాలా మటుకు తెలుగు కేంద్రంగానే ఎక్కువ మాట్లాడాను.

3

ఈ వారం రోజుల సభల్లో నా మొదటి ప్రతిపాదన: లిఖిత సాహిత్యాల మీద వున్న శ్రద్ధ మౌఖిక సాహిత్యాల మీద లేనే లేదని! ఇదేమీ కొత్తది కాదు కానీ, అక్కడ వున్న ఎక్కువ మందికి ఆ విషయం అంత బలంగా చెప్పడం నచ్చినట్టుంది. కీలకోపన్యాసాలిచ్చిన ఇద్దరు ముగ్గురు ప్రసిద్ధులు వాళ్ళ వాళ్ళ ప్రసంగాల్లో నా ప్రతిపాదనని హాయిగా ప్రస్తావించడమే కాకుండా, ఈ మూడు రోజులూ నేను ఎక్కడ కనిపిస్తే అక్కడ చాలా సేపు మాటల్లోకి దింపారు. నా అభిప్రాయాల్లోంచి చాలా శ్రద్ధగా తీసుకున్న నోట్సులు చూపిస్తూ, ఒక్కో విషయం ఆరాతీశారు. తెలుగుకి సంబంధించినంత వరకూ తెలంగాణ సాయుధ పోరాటం తరవాత మౌఖిక సాహిత్యాల మీద పెరిగిన ఆసక్తి గురించి వివరంగా చెప్పాల్సి వచ్చింది. అలాగే, రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాల్లో వివిధ స్థానిక ఉద్యమాల చరిత్రలో ఈ మౌఖిక సాహిత్యం ఎలా భాగమైందో కూడా చెప్పుకొచ్చాను.

సాహిత్య సృజనలో వుండే అనేక భాషల జమిలి (హైబ్రిడ్) తత్వాన్ని అనువాదాల్లోకి తీసుకురావాల్సిన అవసరం వుందన్నది నా రెండో ప్రతిపాదన. ఇది కూడా మంచి చర్చకి తావిచ్చింది. శ్రోతలు దీనికొక ఉదాహరణ అడిగినప్పుడు తెలుగు దఖనీ ఉర్దూతో పాటు, రాయలసీమలో తెలుగూ, కన్నడ భాషల హైబ్రిడ్ సృజనలోంచి కొంత వివరించాను.

ఇక మూడో ముఖ్యమైన ప్రతిపాదన: ప్రపంచ భాషల పటంలో తెలుగు కానీ, దఖనీ కానీ ఎక్కడ నిలుస్తాయో, కలుస్తాయో చెప్పడం! మొదటి నించీ ఈ రెండు భాషలకూ ఒక అంతర్జాతీయ నెట్‌వర్క్ వుందని నా వాదన. సంస్కృతం నుంచి విడివడ్డాక తెలుగులో, అలాగే పర్షియన్ నుంచి విడివడ్డాక దక్షిణాది ఉర్దూలో ఇది బలంగా కనిపిస్తుంది. సాహిత్య సంస్కృతికి ప్రపంచం అనే ఇరుసు కాకుండా, స్థానికత అనే కేంద్రం నుంచి చూసినప్పుడే ఈ ప్రాపంచికత అర్థమవుతుంది. ఆ దృష్టి నుంచి చూస్తే ప్రపంచ భాషల నుంచి అనువాదాలు ఎంత అవసరమో, మరీ స్థానిక భాషల నుంచి ఇంగ్లీషులోకి, ఇతర పెద్ద యూరోపియన్ భాషల్లోకి కూడా అనువాదాలు వెళ్ళాల్సిందే.

ఈ అనువాదాల్లోంచి టూసన్ లాంటి కొత్త ప్రదేశమైనా, అఫ్గన్ లాంటి ఇతర భాష అయినా చిరపరిచితమయ్యే కొత్త పుస్తకాలే అవుతాయి. ముఖ్యంగా చికాగో యూనివర్సిటీ కాంపస్‌లో జరిగిన సదస్సుకి ముగింపు మాటలు చెప్పే అవకాశం నాకు దొరికింది. "సాహిత్యంలో సృజన ఎంత ముఖ్యమో, అనువాద సృజన అంతే ముఖ్యం. అప్పుడు సరిహద్దుల మధ్య గోడలు కూలిపోతాయి. భాషల మధ్య వంతెనలు గట్టిగా నిలబడతాయి."

■ అఫ్సర్



సోఫాలో పడుకుని ఉన్నావు నువ్వు. మునుపు ఎన్నడో, ఎన్నేళ్ల క్రితమో పగిలిన పాత కిటికీ అద్దంలోంచి వెలుతురు, దుమ్ము పట్టి పాలిపోయిన కాగితంలాగా! సోఫాలో, ఎవరో ఉండగా చేసి విసిరి కొట్టిన ఆదే కాగితంలాగా, ముడతలు పడి ఉన్నావు నువ్వు! లొట్టపోయి స్ప్రింగులు బయట పడుతున్న, దుప్పటి లేని ఆ మురికి సోఫాలో దగ్గరగా ముడుచుకుని, గుప్పెడంత ఎముకల పోగులాగా, తడిచిన గోడల అరలలో మగ్గిపోయిన పుస్తకాల వాసనలాగా, ఎన్నో ఏళ్లుగా మార్చని కర్టెన్స్ లాగా, పాలిపోయిన వాటి రంగుల్లాగా, ఆ గదుల్లో తిరుగాడే నల్లని నిశ్శబ్దం లాగా. తుడవని పాత ఫొటోలాగా. మసి పట్టిన స్టవ్ లాగా, వంట గదిలోనే ఒక అరలో నూనె మరకలతో నువ్వు ఇక పూజించని వెలసిపోయిన దేవుని పటంలాగా

మరి ఎప్పుడైనా నేను ఆ కాగితపు ఉండను విప్పితే, లోపల వంకర టింకరగా పిల్లలు దిద్దుకున్న చిన్న అక్షరాలు ఏవో. వాళ్ళు వేసుకున్న పెన్సిల్ బొమ్మలు ఏవో: తెల్లగా, నల్లగా! ఇల్లు, చెట్టు, గూడూ, పిట్టలూ. వాటి అన్నిటి మధ్యగా ఒక ముద్దలాగా, ఎండిన ఇంకు. దాని మరక! నీ చేయే తొణికి ఇంకు బుడ్డీ జారిందో, లేక నీ హృదయమే నేల రాలి, చిట్లి, ముక్కలయి నెత్తురు ముద్దగా చిందిందో కానీ, నీలో నల్లగా కమిలిన ఆ ఇంకు మరక! పోదు అది! నువ్వు కాలి, పట పటా నీ బొమికలు విరిగి, చివరికి నిన్ను బూడిదగా మిగిల్చిన ఆ ప్రేమ మరక. పోదు అది, బాల్యంలో అమ్మవారు వస్తే పోడానికి, నీ నుదిటిన వాళ్ళు కాల్చిన మచ్చలాగా: అది! పోదు అది, నిన్ను స్థబ్దుగా మార్చిన ఆ పచ్చి గాయం మరక! ప్రేమ మరక –

+++

సోఫాలోనే పడుకుని ఉన్నావు నువ్వు. పగిలిన నీ శరీరంలోంచి చిన్నగా మసక వెలుతురు. ఈదురు గాలి: ఈలలాగా. మరి ఎక్కడో రెక్కలు కొట్టుకునే సవ్వడి. కొట్టుకునే రెక్కలు విరిగి, విలవిలలాడి, ఇక అవి నెమ్మదిగా ఆగిపోయే చప్పుడు. ఆనక నిశ్శబ్దం. చీకటే గదులుగా మారి ఉన్న ఆ ఇంట్లో, అనంతమైన నీ ఒంటరితనంలో, ఇటువంటి వృద్ధాప్యంలో నీలో ఒక మూలుగు, అప్పుడు! "అమ్మా" అని అన్నావా? ఏదో గొణుగుతావు: "నానీ" అని పిలిచావా? "నీళ్లు" అని అడిగావా? నీ చేతిని చాచావా? సోఫా పక్కగా, పల్చటి శాలువాలోంచి నిస్సత్తువతో ఎముకలు బయటపడిన నీ చేయి! ఎవరినో పిలుస్తున్నట్టు, ఎవరినో ఉండమన్నట్టుగా... ఆ చేయి... "ముట్టుకో" అని చిన్నగా గుసగుసగా అన్నట్టుగా! అన్నావా లేక నేనే భ్రమ పడ్డానా? నువ్వు నాకు తెలుసు అనీ, నిన్ను అర్థం చేసుకున్నాననీ...

సోఫాలోనే ఇంకా పడుకుని నువ్వు: అట్లా. ఇన్నాళ్లూ తిన్నావో లేదో, పడుకున్నావో లేదో ఎవరికీ తెలియదు. అన్నీ మరొకరికే అయ్యి, అన్నీ మరొకరికే చేసి – నిన్ను నువ్వు మరచి – చివరికి ఎవరూ లేక ఒక్కదానివే అయ్యి, ఏ చేతి లోంచో – విసిరి వేయబడో, లేక క్రమేణా చేజారిపోయో, నీలోంచి నువ్వే తప్పిపోయి, ప్రేమ ఉందని కడ దాకా నమ్మీ నమ్మీ, ఏమీ లేకుండా, ఎవరికీ ఏమీ కాకుండా చివరికి ఇలా చివికిపోయి మిగిలి, నిద్ర మాత్రలతో, diabetic మందులతో, నిరంతరం నీతో ఉంచుకునే జండూ బామ్‌తో, పోగా మిగిలిన ఒక కన్నుతో, ఏదీ సరిగ్గా చూడలేక, ఏదీ పూర్తిగా వినలేక, రాత్రిలో రాత్రై, చీకట్లోని ఏడుపై, లీలగా వినిపించే వెక్కిళ్ళై, ఈ డెబ్బై అయిదేళ్ల వయస్సులో – గాలికి ఎటో కొట్టుకుపోయే, ఎంతో ఇష్టంతో నువ్వే రాసుకుని, బొమ్మలు వేసుకుని, ఎందుకో ఏడుపు దిగమింగుకుని చించి ఉండ కట్టి చీకట్లోకి గాలిలోకి విసిరేసుకున్న కాగితానివై, చివరికి ఇలా... చివరికి ఇలాగే, చివరికి ఇలాగే నీలాగే చచ్చిపోతానా నేను?

చివరికి ఇలాగే, నీలాగే?

■ శ్రీకాంత్ కె

సోమవారం 24 నవంబరు 2025

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

అందెశ్రీ సంస్మరణ సభ

జాతీయ సంగీత కళాకారుల సంఘం, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త నిర్వహణలో అందెశ్రీ సంస్మరణ సభ నవంబరు 27 సా.5గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో ఏనుగు నరసింహారెడ్డి, కె. శ్రీనివాస్, ఎం. ప్రభాకర్, నాళేశ్వరం శంకరం, సిద్ధార్థ తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 98492 45137.

ఎల్. వి. చెన్నారావు

'అభిరుచి' సాహిత్య వ్యాసాలు

తెలంగాణ రచయితల సంఘం, జంటనగరాలు – సోమవారం కవి సమ్మేళనం ఆధ్వర్యంలో కొండపల్లి నీహారిణి సాహిత్య వ్యాసాల పుస్తకం 'అభిరుచి' ఆవిష్కరణ సభ నవంబరు 24 రాత్రి 7.30 నుంచి ఇంటర్నెట్ జూమ్ మీటింగ్‌లో జరుగుతుంది. ఇందులో ఏనుగు నరసింహారెడ్డి, రూప్ కుమార్ డబ్బీకార్, నెల్లుట్ల రమాదేవి, బెల్లంకొండ సంపత్ కుమార్ తదితరులు పాల్గొంటారు.

కందుకూరి శ్రీరాములు


ఈ తరానికి హిచ్‌కాక్


ఎక్కడో లండన్‌లో పుట్టి, హాలీవుడ్‌లో మెరిసి సినీ ప్రపంచాన్ని మురిపించిన హిచ్‌కాక్ 125వ జయంతి సందర్భంగా తెలుగులో ఒక పుస్తకం వచ్చింది. ఇద్దరు కలిసి, ఎందరిచేతో రాయించి తీసుకొచ్చిన బృహత్తర ప్రాజెక్టు 'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్: హిచ్‌కాక్'. జర్నలిస్ట్ – సినీ రైటర్ – నంది అవార్డు విన్నర్ పులగం చిన్నారాయణ, ఐ.ఆర్.టి.ఎస్. అధికారి రవి పాడి చేసిన ఈ ప్రయత్నం గురించి వారితో చిరు సంభాషణ ఇది.

ఇంటర్వ్యూ ■ వడ్డి ఓంప్రకాశ్ నారాయణ

వరల్డ్ ఫేమస్ డైరెక్టర్ హిచ్ కాక్‌పై భారతీయ భాషల్లోనే తొలి ప్రయోగం అంటూ ఈ పుస్తకం తెచ్చారు. ఈ ఆలోచన ఎలా వచ్చింది?

పులగం: కోవిడ్ కాలం – బోలెడంత ఖాళీ సమయాన్ని ఇచ్చింది. అంతేకాదు, బోలెడన్ని ఖాళీల్ని నింపుకునే సమయాన్ని కూడా ఇచ్చింది. చాలా పుస్తకాల్ని చదివే తీరికనిచ్చింది. ఎన్నెన్నో సినిమాలు చూసే ఓపికనిచ్చింది. ఏవో దొరికిన సినిమాలు చూసేయడం కాకుండా, ఒక పర్సనాలిటీకి సంబంధించి మొత్తం కలెక్షన్ అంతా గేదర్ చేసి, ఆ వ్యక్తి తాలూకు సృజనాత్మక ప్రపంచంలోకి చొచ్చుకుపోయే ప్రయత్నంలో నాకు హిచ్‌కాక్ దొరికాడు. ఆయనవి మొత్తం 53 సినిమాలు (9 మూకీలు, 45 టాకీలు). ప్రతి దాంట్లోనూ హిచ్‌కాక్ సిగ్నేచర్ స్పష్టంగా కనిపిస్తుంది. ఆ రోజుల్లో తక్కువ లొకేషన్లలో, లోబడ్జెట్‌లో అంత అవుట్‌పుట్ ఎలా ఇచ్చాడా అని ఆశ్చర్యం వేసింది. కోవిడ్ తర్వాత ఫిల్మ్‌మేకింగ్ స్టయిల్ మారిపోతుందేమో, తక్కువ బడ్జెట్‌లో తక్కువ లొకేషన్లలో సినిమాలు తీయాల్సి వస్తుందేమో అనిపించింది నాకు. అందుకే హిచ్‌కాక్ సినిమాల్ని ఈ తరానికి మళ్లీ పరిచయం చేయాలనిపించింది. ఒక్కో సినిమాని ఒక్కో సినీ ప్రముఖుని పాయింట్ ఆఫ్ వ్యూలో ప్రెజెంట్ చేస్తే బావుంటుందనిపించింది. మొదట సుప్రసిద్ధ దర్శకులు సింగీతం గారికి ఈ ఐడియా చెబితే, 'ప్రొసీడ్' అని, వారంలోపే 'రియర్ విండో' సినిమా మీద ఒక ఆర్టికల్ రాసి పంపించారు. దర్శకుడు వంశీ కూడా ఫుల్ సపోర్ట్ చేశారు. ఆయన ఇంటి నిండా హిచ్‌కాక్ పోస్టర్‌లే! ఓ రకంగా హిచ్‌కాక్ పట్ల క్యూరియాసిటీ కలగడానికి కారకుడు, ప్రేరకుడు వంశీ గారే. ఈ ప్రాజెక్టు గురించి రోజూ రవి పాడి గారితో ఫోన్‌లో చర్చిస్తుంటే, ఆయన అలవోకగా ఆయా సినిమాల తెర వెనుక ముచ్చట్లు చెప్పేస్తుండేవారు. ఈ ప్రాజెక్టుకి పరిపూర్ణత రావాలంటే ఆయన భాగస్వామ్యమూ ఉండాలనిపించింది. అలా ఇద్దరం కలిసి ఈ పుస్తకాన్ని తీసుకొచ్చాం.





పులగం చిన్నారాయణ, రవి పాడి

నలభై ఐదు మంది దర్శకులు, ఏడుగురు రచయితలు, పదిమంది జర్నలిస్టులతో మొత్తం 62 వ్యాసాలు... ఇవి రాయించడం కష్టం కాలేదా?

పులగం: ఇంతమందితో ఎక్కడా రిపిటిషన్ లేకుండా ఆర్టికల్స్ రాయించడమంటే చాలా భారమైన వ్యవహారమే. నాకు తెలిసిన దర్శక రచయితలందర్నీ సంప్రదించాను. కొంతమంది మధ్యలో చేతులెత్తేశారు. అయినా ఏం భయపడలేదు. దీన్ని ఎవరు పబ్లిష్ చేస్తారు, పుస్తకాన్ని ఎలా తీసుకురావాలి, ఎన్ని కాపీలు అమ్ముడవుతాయి లాంటి ఆలోచనలు ఏనాడూ పెట్టుకోలేదు. ఓ కొత్త ప్రయత్నం చేస్తున్నాం, ప్రకృతి సహకరిస్తుందనే ధీమా. చివరకు నేనే 'అక్షౌహిణి మీడియా' పేరుతో పబ్లిష్ చేశాను. వారం రోజులకే ఫస్ట్ ఎడిషన్ కాపీలు అమ్మగాలిగాం. హిచ్‌కాక్‌కి ఇంకా డిమాండ్ ఉందని అర్థమైంది.

ఏ సమాచారమైనా వికీపీడియాలో, ఇంటర్‌నెట్‌లో దొరికే ఈ కాలంలో ఈ పుస్తకం ప్రత్యేకత ఏమిటి?

రవి పాడి: ఇందులో దర్శకులు, రచయితలు, జర్నలిస్టులు రాసిన సినిమా సమీక్షల్లో ప్రస్తావనకు రాని అంశాలను, తెర వెనుక ముచ్చట్లను చాలా ఇచ్చాం. ఇవేవీ వికీపీడియాలో దొరకవని ఖచ్చితంగా చెప్పగలను. వి.ఎ.కె. రంగారావు, యండమూరి, మల్లాది, సుకుమార్ వంటి ప్రముఖుల ప్రశంసలు అందుకోవడానికి కారణం అదే కారణం. ప్రముఖ రచయిత సత్యానంద్ అయితే ఈ పుస్తకాన్ని తప్పనిసరిగా ఇంగ్లిష్‌లో విడుదల చేయమని సూచించారు. ఆ ప్రయత్నంలో ఉన్నాం.

ఇంకే దర్శకుడు గురించైనా ఇలాంటి ప్రయత్నం చేస్తున్నారా?

రవి పాడి: వంశీ గారు, మల్లాది గారు కొంతమంది ప్రసిద్ధ హాలీవుడ్ దర్శకుల పేర్లు చెప్పి, పుస్తకాలు తీసుకొస్తే బావుంటుందని సూచించారు. స్టీవెన్ స్పీల్‌బర్గ్ పుస్తకం వరుసలో ఉంది. 'ప్రపంచ సినిమా పరిమళం' పేరుతో ఇంకో పుస్తకం సిద్ధమవుతోంది.

పరిశోధనలు విమర్శ కానేరవు!

'ప్రమాణాల్లేని నేటి విమర్శ' పేరుతో సుంకర గోపాలయ్య రాసిన వ్యాసానికి (03.11.2025) సమాధానంగా 'బహుళ స్వరాల నేటి విమర్శ' పేరుతో వెంకట రామయ్య వ్యాసం రాసారు (10.11.2025). ఈ వ్యాసంలో వెంకట రామయ్య– "ఆధునిక (?) విమర్శలో... 'విశ్లేషకుడు' లేదా 'వ్యాఖ్యాత' పాత్ర బలపడింది. ఇది పతనం కాదు, పరిణామం" అన్నారు. విశ్లేషణా, వ్యాఖ్యానము రెండూ ఈనాటివి కాదు గానీ, నాకిక్కడ ఆయన విమర్శా ప్రక్రియను పరిణత రూపంగా చూడకపోవడమే ఆశ్చర్యం కలిగించింది. సుంకర గోపాలయ్య కొత్త పరికరాలు, నిర్దిష్టమైన నిరూపణలు లేని విమర్శ ప్రబలిపోతోందని వాపోయాడు. విమర్శకు ఉండే ఎటువంటి మౌలిక లక్షణానికయినా ప్రమాదం ఏర్పడుతుందన్న భయం కలిగినప్పుడు ఇటువంటి ఆక్రోశం సహజం. రామయ్య కొత్త సిద్ధాంతాలు ఆకాశం నుండి ఊడిపడవన్నారు గానీ ఆయన కూడా నవీన సిద్ధాంతాలను వేటినీ ఉటంకించలేదు. కొంతమంది పేర్లు ప్రస్తావించి విషయాత్మక చర్చను కాస్తా వ్యక్తిగతం చేసేశారు. సిద్ధాంత అన్వయాలు సిద్ధాంతాలు కానట్టే పరిశోధనలు విమర్శ కానేరవన్న సంగతి తెలుసుకోవాలి.

"పరిశోధన వ్యాసంలో ఒక వినూత్న సిద్ధాంతం గాని, సమన్వయం గాని, విశ్లేషణం గాని ప్రతిపాదించబడుతుంది. విమర్శ వ్యాసంలో ఒక వినూత్న వివేచనం గాని, దృక్పథం గాని సప్రమాణంగా సమర్పించబడుతుంది" అని జీవీ సుబ్రమణ్యం చెప్పారు. ఆయనే కొత్తదనం ప్రయోగం కావచ్చు గానీ, ప్రయోగానికీ విప్లవానికీ తేడా ఉందని అన్నారు కూడా. కనుక Narrative (వివరణాత్మక), Descriptive (వర్ణనాత్మక), Participative (భాగస్వామ్యత), Application (అనువర్తిత)... వంటివి ప్రక్రియా (Genre) విమర్శలో భాగాలే కానీ కొత్త సిద్ధాంతాలు కావు. అలా అయినప్పుడు వ్యాసకర్త ఉదహరించిన పుస్తకాల కన్నా పెద్ద జాబితానే తయారు చేయవచ్చు. ముందుమాటలు, పుస్తక సమీక్షలు, సదస్సుల్లో సమర్పించిన పరిశోధనా వ్యాసాలను గుదిగుచ్చి విమర్శ పేరుతో సంకలనాలు తెచ్చినంత మాత్రాన అవి సాహిత్య విమర్శ అనిపించుకోవు. ఆయా సమీక్షకులను, పరిశోధకులను విమర్శకులుగా గుర్తించడంలో మనకు మరింత పర్యాలోచన, సంయమనం అవసరం.



> వర్తమాన సాహిత్య విమర్శకు కొత్త సిద్ధాంతాల అవసరం ఉందన్నది ఎంత నిజమో, అసలు అటువంటి ప్రమేయమే మన్నించలేని ఒక వింత కాలంలోకి మనం నడచి వెళ్తున్నామన్నది అంతే నిజం. అదే ఇక్కడ అతి ముఖ్యమైన ప్రమాణ చర్చ.

వర్తమాన విమర్శ అభిరుచి స్థాయిలోనే ఉండిపోతోందన్న గోపాలయ్య మనసులో మాటను రామయ్య తెలుసుకోలేక పోయారు. అందుకు గోపాలయ్య వాడిన "గత పదిహేను సంవత్సరాల" అన్న తొందరపాటు ప్రస్తావన కారణం కావచ్చు. అయితే ఇద్దరూ సాహిత్య విమర్శలో అంబేడ్కర్, బౌద్ధం వంటి సిద్ధాంతాల ప్రవేశాన్ని, గణనీయ ప్రభావాన్నీ విస్మరించారు. వర్తమాన సాహిత్య విమర్శకు కొత్త సిద్ధాంతాల అవసరం ఉందన్నది ఎంత నిజమో, అసలు అటువంటి ప్రమేయమే మన్నించలేని ఒక వింత కాలంలోకి మనం నడచి వెళ్తున్నామన్నది అంతే నిజం. అదే ఇక్కడ అతి ముఖ్యమైన ప్రమాణ చర్చ. ప్రస్తుతం తెలుగు సాహిత్యంలో, ముఖ్యంగా విమర్శలో అంతటి స్తబ్ధత కొనసాగుతోందన్న బాధగానే గోపాలయ్య వ్యాసం నాకు అర్థమయ్యింది.

సామాజిక మాధ్యమాలను ఎంత శక్తివంతంగా వాడుకోవచ్చో 'కవిసంగమం' వంటి ప్రయోగాలు నిరూపించినప్పటికీ– ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో వస్తున్న అన్ని వ్యాసాలనూ లోతైన చర్చలుగా భావించినట్లైతే తెలుగునాట విమర్శకులు లేరని దిగులు చెందవలసిన పని లేదు. గోపాలయ్య కలతపడ్డ ప్రమాణాలు అవి కాదు, పత్రికల్లో వచ్చే సమీక్షలు కూడా కాదు. విమర్శలో కోల్పోతున్న సృజనాత్మక విలువల గురించి ఆయన రాశారు. రామయ్య పరిశోధనకూ లంకె వేశారు గనుక ఇప్పుడు 'మరొకమారు' దాని ఉపజ్ఞత గురించి కూడా అని భావించాలి. విమర్శకు ఆలంబన దృక్పథమే.


రామయ్య "బహుళ ప్రమాణాల వైపు పరిణామం" అన్న మాటను చాలా ఆలోచించే వాడారు. ఆధునికోత్తరవాద (పోస్ట్ మాడర్నిజం) ప్రస్తావన కూడా తెచ్చారు. కానీ గోపాలయ్య గోసపడ్డ అప్రమాణికత ఏకత్వమో, బహుళత్వమో కాదు. అధ్యయనశీలత, ప్రాసంగిక స్వభావము మాత్రమే. అయినప్పటికీ Heterogeneity (వైధర్మ్యము), Hybridity (మిశ్రితత్వం), Multiplicity (బహుళత్వము) వంటి ధోరణులు ప్రక్రియకుండే శాస్త్ర మూలాన్ని మార్చలేవు. వర్తమాన సాహిత్యంలో ఈ బహుళ తాత్వికత వరమా శాపమా ఇంకా తేలవలసి ఉంది. కొప్పర్తి, బి. తిరుపతి రావు, సుంకిరెడ్డి, జిలుకర శ్రీనివాస్, అఫ్సర్ వంటివారు ఆ దిశగా ఎంతో కృషి చేస్తున్నారు కూడా. అయితే గతాన్ని ఆదర్శీకరిస్తున్నారని తేలిగ్గా తీసిపారేస్తున్నారు గానీ కట్టమంచి, రాళ్ళపల్లి, రారా, టీఎమ్మెస్ వంటి వారికి తెలుగు సాహిత్య విమర్శలో క్లాసిక్ స్థానం ఇవ్వడం సముచితమే. వీళ్ళే కాదు విమర్శకున్న ప్రయోగశీలతను, దార్శనికతను, విలక్షణతను నిలబెట్టిన మహానుభావులెందరినో ఈ తరం స్ఫూర్తిగా తీసుకోని అధ్యయనం చేయాలి.

■ శ్రీరామ్ పుప్పాల

✆ 99634 82597

తొలిజాడలు

నా పూర్వీకులు నడిచిన దారుల్ని
వెతుకుతూ పోతాను...
రాతిపై అతుక్కుపోయిన రక్తపు మరకల్ని
గుర్తుపట్టి మృదువుగా హత్తుకుంటాను.
గరుకుపాదాలు హృదయాన్ని వెచ్చగా తాకాయి...
నా పూర్వీకులు విడిచిపెట్టిన
గ్రామాల్ని చేరుకుంటాను.
భూమిలో ఇంకిపోయిన కన్నీటి మడుగులు,
మట్టిలో నిద్రిస్తున్న మరణించిన వారి స్వప్నాలు...
ద్రిమ్మరులై, ముసాఫిరులై ఏ కొండలపైకో,
ఏ నదీ తీరాలవైపో సాగిపోతూ...
పచ్చిక బయళ్ళలో ఆలమందలను,
బోడగుట్టల్లో గొర్రెపిల్లలను
అక్కున చేర్చుకుని ఉంటారు.
నా పూర్వీకుల పాటలు వింటాను
పాటల్లో ప్రవహించిన దుఃఖం,
పాటల్లో గాయపడిన జీవితం,
రాగాల్లో తాండవమాడిన ఆనందం...
అవి పాడుతూ, వింటూ,
వారి గుండెల్ని హత్తుకుంటాను.
పాటలనిండా పర్చుకున్న
విస్తార జీవితాన్ని దర్శిస్తాను.



నా పూర్వీకులు చెప్పుకున్న కథలు వింటాను..
అన్నం మెతుక్కోసం యుద్ధాలు ఎలా చేశారు,
ఆత్మాభిమానం కోసం
ప్రాణాల్ని ఎట్లా సమర్పించుకున్నారు,
మనిషిగా చూడలేని రాజ్యంలో ఆయుధాలుగా
ఎట్లా మారారో వింటాను.
వారి కథలే చరిత్రగా,
వారి పోరాటమే యుద్ధాలుగా,
వారి పనితనమే నాగరికతగా,
వారి సమూహ సంస్కృతియే వారసత్వంగా
ఎట్లా వర్ధిల్లిందో తెలుసుకుని పులకించిపోతాను.
యోధులు నడిచిన కాలి బాటలే రహదారులని...
అడుగుల్లో అడుగులు వేస్తాను.
నా పూర్వీకుల మాటలు వింటాను..
శ్రమలో, చెమటలో, నిప్పును రాజేయడంలో,
మట్టిని పిసకడంలో పుట్టిన శబ్దాలు...
పదాలుగా కలబోసుకుని భాషగా మారడం,
అవి కావ్యాలై, నాటకాలై, ఇతిహాసాలై
భూమిమీద పలుకు సుగంధాలై
ఎట్లా పరవశించాయో విని ఆనందిస్తాను.
నా పూర్వీకుల దారుల్లో
ఒక మొక్క నాటి, ఒక శిల భద్రపరిచి,
నేను ఒకనాడు వారిలో కలిసిపోతాను!

■ తుమ్మల దేవరావ్

కథాసంపుటిపై చర్చ

జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి కథాసంపుటి 'నాగేటి సాళ్లలో'పై చర్చా కార్యక్రమం నవంబర్ 30న పలమనేరులోని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కళామందిరంలో జరుగుతుంది. సభలో టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి, మాధవరెడ్డి, పలమనేరు బాలాజీ, కవితశ్రీ, పల్లిపట్టు నాగరాజు, పుష్ప తదితరులు పాల్గొంటారు.

పి. తులసినాథం నాయుడు

రాయలసీమ మహాకవిసమ్మేళనం

రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో డల్లాస్ ఏరియా రాయలసీమ అసోషియేషన్ సౌజన్యంతో తొమ్మిదవ రాయలసీమ మహాకవి సమ్మేళనం నవంబర్ 30న డి.పి.ఆర్.సి జిల్లాపరిషత్ హాల్ అనంతపురంలో జరుగుతుంది. రాయలసీమ ప్రసిద్ధ ప్రదేశాలపై 175 మంది కవులు కవితాగానం చేస్తారు. వివరాలకు: 99639 17187.

అప్పిరెడ్డి హరినాథరెడ్డి



మారథాన్‌లో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే నాయిని

- క్రీడలపై ప్రతి ఒక్కరూ ఆసక్తి పెంచుకోవాలి
- యువజన, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- నగరంలో ఉత్సాహంగా హాఫ్ మారథాన్

6

ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం


'హాఫ్ మారథాన్'లో భాగంగా హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో వ్యాయామం చేస్తున్న దృశ్యం

ఆశలపై నీళ్లు

- కాంగ్రెస్ అధిష్ఠానం ఝలక్‌తో అసంతృప్తి
- సామాజిక సమీకరణల పేరుతో సీనియర్లకు దక్కని పగ్గాలు
- జిల్లా అధ్యక్ష పదవులకు అనూహ్యంగా ఎంపికైన నేతలు
- వరంగల్, జనగామ, మహబూబాబాద్ జిల్లా నేతల్లో అసంతృప్తి
- హనుమకొండ జిల్లాలో మూడు దశాబ్దాలుగా రెడ్డి సామాజిక వర్గానికే పీఠం
- భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో మంత్రులదే పైచేయి
- డీసీసీ అధ్యక్షుల నియామకంపై కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు

ఆశావహులకు దక్కని డీసీసీ అధ్యక్ష పదవులు



■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవులపై కన్నేసిన ఆశావహులకు అధిష్ఠానం ఝలక్ ఇచ్చింది. సామాజిక సమీకరణల పేరుతో ఊహించని వ్యక్తులకు పగ్గాలు అప్పగించింది. దీంతో పదవి ఆశించిన సీనియర్లు, గతంలో ఎమ్మెల్యే టికెట్లు త్యాగం చేసిన నేతల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. వరంగల్, జనగామ, మహబూబాబాద్ డీసీసీ అధ్యక్షుల నియామకం ఆశాహులకు ఝలక్ ఇవ్వగా, భూపాలపల్లి, ములుగు జిల్లాలో మాత్రం మంత్రులు తమ అనుచరులకు పీఠం దక్కించుకున్నారు.

ఇక మూడు దశాబ్దాలుగా హనుమకొండ డీసీసీ పదవి రెడ్డి సామాజిక వర్గాన్నే వరిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. కాగా, సీనియర్ నేతలకు నామినేటెడ్ పోస్టులు దక్కక.. ఆశించిన పార్టీ పదవులు రాకపోవటంతో నైరాశ్యంలోకి వెళుతున్నారు.

ఆశ, నిరాశ..

డీసీసీ అధ్యక్ష పదవులపై ఎన్నో ఆశలు పెట్టుకున్న నేతలకు నిరాశే మిగిలింది. ప్రధానంగా హనుమకొండ జిల్లా అధ్యక్ష పదవిపై బీసీ, ఎస్సీ సామాజికవర్గం నేతలు భారీగా ఆశలు పెట్టుకున్నారు. సుమారు మూడు దశాబ్దాలుగా రెడ్డి సామాజికవర్గానికి చెందిన నేతలకే డీసీసీ పీఠం దక్కుతోంది. ఈ క్రమంలో ఈసారి బీసీలకు పదవి దక్కుతుందనే ఆశతో మార్క విజయ్‌కుమార్, ఈవీ శ్రీనివాస్‌రావు, కట్ల శ్రీనివాస్ తదితరులు డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్నారు. అయితే అనుహ్యంగా అధిష్ఠానం ఈసారి కూడా రెడ్డి సామాజికవర్గానికి చెందిన కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డికి పదవిని కట్టబెట్టింది. దీంతో బీసీ సామాజిక వర్గం నేతలు నిరాశకు గురయ్యారు. అలాగే సీనియర్ నేత దొమ్మాటి సాంబయ్యకు సైతం డీసీసీ పీఠం దక్కుతుందనే ప్రచారం కూడా ఉత్తదేనని తేలిపోయింది. ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డితో పాటు పింగిళి వెంకట్రామ నర్సింహారెడ్డి, బి.అశోక్‌రెడ్డి, తదితరులు హస్తం పగ్గాల కోసం చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి.

ఇక వరంగల్ డీసీసీ అధ్యక్ష పదవిని మరోసారి చేపట్టాలని ఆశించిన ఎర్రబెల్లి స్వర్ణకు కూడా అధిష్ఠానం ఝలక్ ఇచ్చింది. ఊహించని విధంగా కాంగ్రెస్ అధ్యక్ష పదవిని మైనారిటీ నేత ఆయూబ్‌ను వరించింది. మంత్రి కొండా సురేఖ సూచించిన గోపాల్ నవీన్‌రాజు, మీసాల ప్రకాష్‌ను కాదని అధిష్ఠానం ఆయూబ్ వైపు మొగ్గు చూపటం చర్చనీయాంశంగా మారింది.

జనగామ డీసీసీ పీఠం కూడా అనుహ్యంగా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ ధన్వంతికి దక్కటం కాంగ్రెస్ నేతల్లో హాట్‌టాపిక్‌గా మారింది. జనగామ డీసీసీ ప్రెసిడెంట్ పదవి కోసం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అత్త ఝాన్సీరెడ్డి ప్రయత్నాలు చేశారు. జనగామ జిల్లా రాజకీయాలకే తాను పరిమితం అవుతానని, తనకు టీపీసీసీ ఉపాధ్యక్ష పదవి కంటే డీసీసీ ప్రెసిడెంట్

(మిగతా 7లో..)

అధ్యక్ష పీఠంపై ఆశతో..

కాంగ్రెస్ పార్టీ పదేళ్ల తరువాత అధికారంలోకి వచ్చింది. రేపోమాపో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో జిల్లా అధ్యక్ష పదవులకు డిమాండ్ పెరిగింది. అధికారంలో ఉండటంతో అధికారుల వద్ద, ఎమ్మెల్యే, ఎంపీల వద్ద డీసీసీ ప్రెసిడెంట్ హోదాలో పలుకుబడి పెరుగుతుందని ఆశావహులు ఆశ పడ్డారు. ఈ నేపథ్యంలో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్ ఆదేశాలతో అక్టోబరు 11వతేదీ నుంచి 18వ తేదీ వరకు ఏఐసీసీ, టీపీసీసీ పరిశీలకులు ఉమ్మడి జిల్లాలో పర్యటించారు. డీసీసీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్న నేతల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఉమ్మడి జిల్లా నుంచి 161 మంది అధ్యక్ష పదవిని ఆశిస్తు దరఖాస్తులు చేసుకున్నారు. అయితే జిల్లా నుంచి నలుగురు ఆశావహుల పేర్లను టీపీసీసీ అధిష్ఠానానికి పంపించింది. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ ఎన్నికలు రావటం డీసీసీల ప్రకటన కాస్తంత ఆలస్యమైంది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు వస్తుండటంతో కాంగ్రెస్ అధిష్ఠానం డీసీసీ ప్రెసిడెంట్‌లను ఖరారు చేస్తూ శనివారం రాత్రి జాబితా విడుదల చేసింది. దీంతో డీసీసీ పీఠంపై ఎన్నో ఆశలు.. మరెన్నో కలలు కన్న నేతలకు అధిష్ఠానం సామాజిక సమీకరణల పేరుతో ఝలక్ ఇచ్చింది. దీంతో పార్టీ పదవిపై ఎంతో ఆశతో ఉన్న సీనియర్ నేతల ఉత్సాహంపై అధిష్ఠానం నీళ్ల చల్లిందనే చర్చ జరుగుతోంది.

సర్పంచ్ రిజర్వేషన్లు ఖరారు

- హనుమకొండ జిల్లాలో మొత్తం 205 పంచాయతీలు
- ఎస్సీలకు 52, ఎస్టీలకు 3, బీసీలకు 45...
- మహిళలకు 49, జనరల్ కేటగిరీకి 56...
- 2011 జనాభా దామాషా ప్రకారం కేటాయింపు
- కలెక్టర్ వద్దకు చేరిన జాబితా
- గెజెట్‌లో ప్రకటనకు రంగం సిద్ధం



హనుమకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ ముగిసింది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన సర్వే (ఎస్ఈఈఈపీసీ)-2024 ప్రకారం డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రాతిపదికగా, అలాగే బీసీల విషయంలో సుప్రీం కోర్టు, హైకోర్టు తీర్పులను అనుసరించి 50శాతం మించకుండా సర్పంచ్, వార్డు స్థానాల రిజర్వేషన్ల ఖరారు చేశారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లను కూడా రాజకీయ పార్టీల సమక్షంలో లక్కీ డ్రా ద్వారా నిర్ణయించారు. 2011 జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను ఖరారు చేశారు.

రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ శనివారం రాత్రి పొద్దు పోయేవరకు కొనసాగింది. ఆదివారం అన్ని మండలాల నుంచి వాటి పరిధిలోని పంచాయతీల రిజర్వేషన్ల జాబితాలు ఆయా జిల్లా కలెక్టర్ కార్యాలయాలకు చేరుకున్నాయి. వీటిని అడిషనల్ కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లా పంచాయతీ అధికారి, జడ్పీ సీఈవోలు పునఃపరిశీలన జరిపారు. ప్రభుత్వ మార్గదర్శక సూత్రాల ప్రకారం రిజర్వేషన్ల ఖరారు జరిగిందీ లేనిది క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పరిశీలన అనంతరం కలెక్టర్లకు అందజేశారు. కలెక్టర్లు వీటిని మరోసారి పరిశీలించిన అంతా సవ్యంగా ఉందన్న నిర్ధారణకు వచ్చిన తర్వాత పంచాయతీ రాజ్ కమిషనర్‌కు పంపారు. కమిషనర్ ఆమోదం అనంతరం సోమవారం రిజర్వేషన్లను అధికారికంగా ప్రకటిస్తూ గెజెట్‌ను విడుదల చేస్తారు. లేదంటే ఎన్నికల షెడ్యూల్ జారీ రోజున విడుదల చేయవచ్చునని తెలుస్తోంది.

అనధికారికంగా అందిన సమాచారం మేరకు ఏ గ్రామ

(మిగతా 6లో..)


ఎల్కతుర్తిలో చీరలను అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

ఆడబిడ్డల అభివృద్ధే ధ్యేయం

ప్రభుత్వాన్ని ఆశీర్వదించి ఆదరించండి : మంత్రి పొన్నం ప్రభాకర్

ఎల్కతుర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని, ప్రభుత్వాన్ని ఆశీర్వదించి ఆదరించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సూచించారు. ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లోని ఇందిరా మహిళా శక్తి కార్యాలయాల్లో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరై మహిళలకు బొట్టు పెట్టి చీరలను అందజేశారు. అనంతరం మహిళలను ద్దేశించి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం తరఫున 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకు సారెగా చీరలను అందజేయడం జరుగుతుందన్నారు. హుస్నాబాద్ నియోజక వర్గంలో ప్రతీ మండలానికి

(మిగతా 6లో..)

మేడారంలో భక్తుల సందడి

- మహాజాతరకు ముందే మొక్కుల జోరు
- ఆదివారం కావడంతో పెద్దసంఖ్యలో రాక
- గద్దెల విస్తరణ పనులతో దర్శనానికి ఇబ్బందులు
- అందుబాటులోకి రాని కనీస సౌకర్యాలు


వనదేవతలకు మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు





తాడ్వాయి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతలు సమ్మక్క-సారలమ్మలను దర్శించుకొనేందుకు భక్తులు ఆదివారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. మహాజాతర నేపథ్యంలో ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించుకున్నారు. సమ్మక్క- సారలమ్మల నామస్మరణలతో ఎత్తు బంగారం మొసుకొని అమ్మవార్ల గద్దెలకు చేరుకున్నారు. దేవతల గద్దెల వద్ద పూజలు చేసి పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీర, సారె, కొబ్బరికాయలు, యాటలతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం విడిది గృహాలు, అటవీ ప్రాంతాలు, గ్రామ పరిసర చెట్ల కింద వంటలు చేసుకొని వనదేవతలకు నైవేద్యాలు సమర్పించారు. అదేవిధంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి విందు బోజనాలు ఆరగించారు. సుమారు 20వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవస్థానం అధికారులు తెలిపారు.

తల్లుల గద్దెకు ఒకే దారి..

మేడారం సమ్మక్క- సారలమ్మల దేవస్థానం పునరుద్ధరణ పనుల్లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులతో వనదేవతల గద్దెలకు భక్తులు వెల్లడానికి ఒకే దారిని అధికారులు ఏర్పాటు చేశారు. ఆదివారం వారాంతపు సెలవు కావడంతో వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ క్రమంలో భక్తులు గద్దెకు వెళ్లి వచ్చే సమయంలో ఎదురెదురుగా రావాల్సి వచ్చింది. దీంతో గద్దె వద్ద భక్తుల రద్దీ అధికమైంది.


తల్లులను దర్శించుకొని..

మేడారం తరలివచ్చిన భక్తులు జరుగుతున్న అభివృద్ధి పనులతో కలిగిన ఇబ్బందులను పట్టించుకోకుండా వేచి ఉండి సమ్మక్క సారలమ్మలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెల పనులు త్వరగతిన పూర్తిచేయాలని కోరుతున్నారు. జాతర సమయం దగ్గర పడుతున్న కొద్దీ భక్తుల సంఖ్య పెరుగుతోందని అన్నారు. అభివృద్ధిపనులతో రహదారులు, దేవస్థానం భక్తులకు అసౌకర్యంగా మారాయి. అయితే ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి వస్తున్న వేలాది మంది భక్తులకు ఇబ్బందులు కుంగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గద్దెల వద్ద, భక్తులు వచ్చే దారిలో ఉంటూ సలహాలు, సూచనలు చేశారు. రహదారుల వెంబండి పెట్రోలింగ్ చేసూ రోడ్లపై వాహనాలు నిలుపకుండా ట్రాఫిక్‌ను నియంత్రించారు.

ఇంకా వీడని నిర్లక్ష్యం

మేడారం పనుల నేపథ్యంలో భక్తులు వచ్చే దారిలో ఎక్కడా తాగునీరు సౌకర్యాన్ని కల్పించలేదు. దీంతో వృద్ధులు, పిల్లలు, మహిళలకు, వికలాంగులు ఇబ్బంది పడ్డారు. అంతేకాకుండా దేవస్థానం పరిసరాల్లో అధికారుల జాడ కనిపించడం లేదని భక్తులు అంటున్నారు. వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరుగుతున్న క్రమంలో స్థానికంగా ఉండకపోవడాన్ని తప్పుపడుతున్నారు.

లెక్క ఇక పక్కా



- నేటి నుంచి చిన్న నీటివనరుల గణన
- ఐదేళ్లకోసారి నిర్వహణ
- ఈ సారి రెండు రకాల సర్వే
- గణన కోసం సిబ్బందికి ప్రత్యేక శిక్షణ
- ఉమ్మడి జిల్లాలో 4,92,042 జలవనరులు

హనుమకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో సూక్ష్మ నీటిపారుదల - జలవనరుల గణన కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభం కానున్నది. పక్షం రోజుల పాటు ఈ గణన కొనసాగుతుంది. గణన నిర్వహణకు సంబంధించి సిబ్బందికి శిక్షణ ఇవ్వడం కూడా పూర్తయింది. వీరంతా సోమవారం నుంచి వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని చెరువులు, కుంటలు, బావులు, బోర్లతో సహా అన్ని జలవనరులను లెక్కించే ప్రక్రియను చేపడతారు. జలవనరుల గణనను 1986-87లో తొలిసారి చేపట్టారు. అప్పటినుంచి ఐదేళ్లకోసారి గణనను నిర్వహిస్తారు. వివరాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తారు.

శిక్షణ

గ్రామ స్థాయిలో జీపీవోలు, ఏఈవోలు, టీఏలు అలాగే ఫీల్డ్ అసిస్టెంట్లు ఎన్యూమరేటర్లుగా పని చేస్తారు. మండల స్థాయిలో విద్యుత్ శాఖ ఏఈ, నీటిపారుదల శాఖ ఏఈ, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు, వ్యవసాయ శాఖ ఏవోలు, ఎంపీడీవోలు పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తారు. అన్ని రెవెన్యూ గ్రామాల్లో చిన్ననీటి వనరుల గణన కోసం అవసరమైతే ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లను కూడా ఎన్యూమరేటర్లుగా వినియోగించుకుంటారు. గణన ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి ఎన్యూమరేటర్లకు జిల్లా, మండలస్థాయిలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. మొబైల్ యాప్ వినియోగం, క్షేత్రస్థాయిలో సమాచారం సేకరణ వంటి అంశాల్లో స్పష్టమైన అవగాహన కల్పించారు.

మండల పరిధిలో చార్జి ఆఫీసర్లు అయిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు మండల స్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహించి అవసరమైన సమాచారాన్ని సేకరించి గణన పనులను సమన్వయం చేస్తారు. ఉమ్మడి జిల్లాలోని ప్రతీ నీటి వనరు భవిష్యత్ సాగు నీటి ప్రణాళికలకు, నీటి సంరక్షణ చర్యలకు ముఖ్య ఆధారమని, అందువల్ల ప్రతీ అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి గణనను కచ్చితమైన సమాచారం, నిర్ణీతకాలం వ్యవధిలో పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ఆయా జిల్లాల కలెక్టర్లు అధికారులకు స్పష్టం చేశారు. ఈసారి రెండురకాల సర్వేలు చేపట్టనున్నారు. ఇందులో ఒకటి చిన్ననీటి వనరుల సర్వే కాగా, రెండోది జలవనరుల రెండో గణన. చిన్న నీటి వనరుల సర్వేలో బావులు, బోరు బావుల వివరాలను లెక్కిస్తారు. జలవనరుల రెండో గణన సర్వేలో చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు, పర్కొలేషన్ ట్యాంకుల వివరాలను నమోదు చేస్తారు. ఈ రెండింటినీ ఒకే యాప్‌లో నమోదు చేస్తారు. మండల స్థాయిలో తహసీల్దార్ అధికారిగా వ్యవహరిస్తారు.

అన్ని వనరుల గణన

రెండు వేల హెక్టార్లలోపు భూమికి సాగునీరు అందించే చెరువుల నుంచి చిన్న చేదబావి వరకు అన్నింటి వివరాలను సర్వే సిబ్బంది క్షేత్ర స్థాయికి వెళ్లి నమోదు చేస్తారు. ఆయా నీటివనరుల చిత్రాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ప్రతీ నీటి వనరుల వద్దకు వెళ్లి ఫొటో తీయాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా సీపీవోలు వ్యవహరిస్తారు. జల వనరుల గణన అంటే నీటి వనరుల సంఖ్య, రకాలు, యాజమాన్యం, వినియోగాన్ని లెక్కించడం. దీనిలో ఉపరిత జలాలైన నదులు,

(మిగతా 6లో..)

జల వనరులు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 4,92,042 జల వనరులు ఉన్నాయి. 1708 గ్రామాల్లో మొత్తం చెరువులు 3063, కుంటలు 74,187, బావులు 9414, లోతులేని బావులు 5550, మధ్యస్థాయి బావులు 2,51,418, ఎక్కువ లోతున్న బావులు 1,48,410, చెక్‌డ్యామ్‌లు 678, పెర్కొలేషన్ ట్యాంకులు 820 ఉన్నాయి. ఇవి అయిదేళ్ల కిందట నిర్వహించిన గణన ద్వారా సేకరించిన వివరాలు. ఈ ఐదేళ్ల కాలంలో బావులు, బోరుబావుల సంఖ్య మరింతగా పెరిగి ఉండవచ్చునని అంచనా. కబ్జాల వల్ల చిన్నతరహా కుంటలు కనుమరుగై ఉండవచ్చునని భావిస్తున్నారు. జనగామ, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో బోరుబావుల సంఖ్య ఎక్కువగా ఉంది.

వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలి



మంత్రి శ్రీహరికి వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలని తెలంగాణ పీఆర్టీయూ అధ్యక్షుడు మన్నె చంద్రయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం హనుమకొండకు వచ్చిన రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పున్నం చందర్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రాచర్ల శ్రీనివాస్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు బోడ రాంజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌సర్వీస్ టీచర్స్‌ను టెట్ నుంచి మినహాయించాలి



మట్టెవాడ ప్రభుత్వ పాఠశాలలో
నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నేతలు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తొంట సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం మట్టెవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంఘం వరంగల్ జిల్లా శాఖ సమావేశం జిల్లా అధ్యక్షుడు పర్కాల పరశురాం అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సత్యనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఉపాధ్యాయులను కలవరపెడుతున్న టెట్ నుంచి ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను మినహాయించాలన్నారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను విడుదల చేయాలని, కొత్త పీఆర్సీని వెంటనే అమలు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల ప్రమోషన్లకు అడ్డంకిగా ఉన్న అడిక్వసీని వెంటనే రద్దు చేయాలన్నారు. జీవో నెంబరు 342 అమలు విషయంలో అడ్డంకులను తొలగించాలన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంట అంజయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ చాగంటి ప్రభాకర్, నాయకులు నర్సయ్య, కుమార్, నవీన్‌కుమార్, అనిల్, విజయ్‌కుమార్, వెంకన్న, ప్రభాకర్, దయాకర్, రాములు, కుమారస్వామి, వీరస్వామి, నీలయ్య, వరలక్ష్మి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

లెక్క పక్కా

(5వ పేజీ తరువాయి)

సరస్సులను మినహాయిస్తే భూగర్భ జలాలు అయిన బావులు, బోరుబావులు, వర్షపునీరు, కృత్రిమ జలాలను నిల్వ చేసే చెరువులు, చెడ్‌డ్యాంలువంటి వాటిని గణనలో పరిగణలోకి తీసుకుంటారు. ఈ గణన నీటి నిర్వహణ, సంరక్షణ, నీటిపారుదల వంటి కార్యక్రమాలకు దోహదపడుతుంది.

ఉద్దేశం

ఉమ్మడి జిల్లాలోని నీటి వనరులకు సంబంధించిన సమగ్ర డేటాబేస్‌ను తయారు చేయడం, నీటి వనరుల నిర్వహణ, ప్రణాళిక కోసం కచ్చితమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచడం, నీటి వనరుల సంరక్షణ, పునరుద్ధరణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ సమాచారాన్ని వాడుకోవడం ఈ జలవనరుల గణన ప్రధాన ఉద్దేశం. ముందుగా ఒక గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని నమూనా గణన పూర్తిచేసిన అనంతరం మిగతా గ్రామాల్లో గణన కొనసాగిస్తారు.

ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

- క్రీడలపై ప్రతి ఒక్కరూ ఆసక్తి పెంచుకోవాలి
- యువజన, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- నగరంలో ఉత్సాహంగా హాఫ్ మారథాన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర పశుసంవర్ధక, యువజన క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

హనుమకొండటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా స్పోర్ట్స్ పాలసీని ప్రభుత్వం తీసుకువచ్చిందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమ, యువజన, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం వద్ద వరంగల్ ట్రైసీటీ, నాయిని విశాల్ ఫౌండేషన్, క్రెడాయ్ వరంగల్, కియాన్ ఇన్‌ఫ్రా సంయుక్త ఆధ్వర్యంలో హాఫ్ మారథాన్-2025 పోటీలను రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డిలతో కలిసి మంత్రి పోటీలను ప్రారంభించారు.

ఈసందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీని తీసుకువచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడల పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తి పెంచుకుని క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. మారథాన్-2025 పోటీ నిర్వహణతో హనుమకొండ జిల్లాకు దేశవ్యాప్తంగా ఖ్యాతి మరింత వ్యాప్తి చేకూరుతుందన్నారు. 5కే మారథాన్‌ను మంత్రి వాకిటి శ్రీహరి జెండా ఊపి ప్రారంభించగా, పరుగులో మంత్రి, ఎమ్మెల్యేలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ డెయిరీ పూర్వవైభవం కోసం రూ.35కోట్ల నిధులు మంజూరుచేసి అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, క్రెడాయి ప్రతినిధులు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అథ్లెట్లు 5, 10, 21కే రన్ మారథాన్‌లో పాల్గొన్నారు.







మారథాన్‌లో పాల్గొన్న అధికారులు, యువత



పోతననగర్‌లో తనిఖీ చేస్తున్న మేయర్

చెత్త తొలగింపు పనుల్లో నిర్లక్ష్యం తగదు

- మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చెత్త తొలగింపు పనుల్లో నిరక్ష్యం తగదని మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఆదివారం మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 29వ డివిజన్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహం ప్రాంతంతో పాటు పోతననగర్‌లోని సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెత్త నిర్వహణ తీరును పరిశీలించి సమర్థవంతంగా చేపట్టేందుకు సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పారిశుధ్య సిబ్బంది చెత్తను ఎప్పటికప్పుడు తరలించడమే కాకుండా తడి, పొడి చెత్తను వేరుగా అందించేలా ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు. అనంతరం పోతననగర్‌లో నిర్వహిస్తున్న సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను క్షేత్ర స్థాయిలో సందర్శించి చెత్త నిర్వహణ తీరును పరిశీలించారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఆడబిడ్డల అభివృద్ధే ధ్యేయం

(5వ పేజీ తరువాయి)

మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా వారికి వైద్యం అందించడానికి హైదరాబాద్‌లో ప్రత్యేకంగా వ్యక్తిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు సైతం త్వరలో నిర్వహించనున్నట్లు తెలిపారు. భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలకు సెరీకల్చర్ హబ్‌గా ఉండేలా మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, డీఆర్‌డీవో మేన శ్రీను, మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజీ, వైస్ చైర్మన్ స్రవంతి, తహసీల్దార్‌లు ప్రసాద్‌రావు, రాజేష్, ఎంపీడీవోలు విజయ్‌కుమార్, వీరేశం, కాంగ్రెస్ నాయకులు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, వీరమల్ల రంజిత్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు బాపురావు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు జీడబ్ల్యూఎంసీలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతీవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు గ్రేటర్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ తెలిపారు.

రేపు గర్భిణులకు వైద్య శిబిరం

బాలసముద్రం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): హనుమకొండ శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో గర్భిణులకు శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు సేవాసమితి అధ్యక్షుడు కటంగూరి సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గర్భిణులు, బాలింతలకు నిష్ణాతులైన డాక్టర్లతో సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆర్య జనని ఆధ్యాత్మిక ట్రస్టు ఆధ్వర్యంలో గర్భిణులకు సాముహిక సీమంతం నిర్వహించారు. ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ అనుపమ, శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు దీనిని సద్వినియోగించుకోవాలని కోరారు.

వామపక్ష నేత చింతా రామనారాయణ మృతి



నివాళులర్పిస్తున్న సీపీఐ నేత నేదునూరి జ్యోతి

హసన్‌పర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వామపక్ష నేత చింతా రామనారాయణ హసన్‌పర్తి మండలం జయగిరిలో అనారోగ్యంతో మృతి చెందారు. సీపీఐ పార్టీలో ఆయన ఎనలేని సేవలు చేశారు. సమాజంలో అసమానతలు, వివక్షత, దోపిడి నశించాలని సీపీఐ నిరంతరం క్రియాశీల పోరాటాలు నిర్వహిస్తున్న సందర్భంలో జయగిరిలో చింతా రామనారాయణ 1980లో చేరారు. పార్టీ నిర్వహించే కార్యక్రమాల్లో క్రియాశీల నాయకుడిగా ఎదిగారు. గౌడ సంఘం నాయకుడిగా, సీపీఐ పార్టీ నాయకులుగా ఎదిగి 1987 నుంచి 1994 వరకు గ్రామ సర్పంచ్‌గా ప్రజలకు నిస్వార్థంగా, నిజాయితీగా సేవలందించారు. రామాయణ పార్థీవదేహంపై పార్టీ నాయకులు ఎర్ర జెండా కప్పి నివాళులర్పించారు. అనంతరం ఊరు శివారులో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, సీపీఐ సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, నేదునూరి రాజమౌళి, మెట్టు శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు గడ్డం చంద్రమౌళి, రామనారాయణ కుటుంబసభ్యులు స్వామి, మధు, తిరుపతి, కూతురు స్వరూప, భార్య శకుంతల, పల్లె కుమారస్వామి, కొంగంటి కుమాస్వామి, మోటపోతుల రాజు, తాళ్ళపలిల సాగర్, తాళ్ళపెల్లి చిరంజీవి, పూజ రాజయ్య, పిట్టల రవి, సదానందం, యాటకాల కుమారస్వామి, మల్లేశం, తాళ్ళపల్లి కుమారస్వామి, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఐఎంఏ నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్షుడిగా పి.మన్మోహన్‌రాజు
- జనరల్ సెక్రటరీగా ఎస్.శిరీష్‌కుమార్
- ఎలెక్ట్ ప్రెసిడెంట్‌గా పి.ప్రవీణ్‌కుమార్



మన్మోహన్‌రాజు (ప్రెసిడెంట్) | శెంకేసి శిరీష్ (జనరల్ సెక్రటరీ) | నరేశ్ కుమార్ (ట్రెజరర్) | పి.ప్రవీణ్‌కుమార్ (ఎలెక్ట్ ప్రెసిడెంట్)

వరంగల్ మెడికల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : 2025-26 సంవత్సరానికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) వరంగల్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు వరంగల్‌లోని ఐఎంఏ హాల్‌లో ఆదివారం నూతన కార్యవర్గాన్ని రిటర్నింగ్ ఆఫీసర్ డాక్టర్ మహ్మద్ అన్వర్, కో రిటర్నింగ్ ఆఫీసర్ డాక్టర్ బందెల మోహన్‌రావు, డాక్టర్ ఆనంద్ బోకరే ప్రకటించారు.

అధ్యక్షుడిగా డాక్టర్ పి.మన్మోహన్‌రాజు, 2026-27 సంవత్సరానికి ఎలెక్ట్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ పి.ప్రవీణ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ రాజారెడ్డి(అర్బన్), డాక్టర్ రంజిత్‌కుమార్(రూరల్), మహిళా ప్రెసిడెంట్‌గా డాక్టర్ కూరపాటి రాధిక, జనరల్ సెక్రటరీగా డాక్టర్ శెంకేసి శిరీష్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ(అర్బన్)గా డాక్టర్ షఫీ, జాయింట్ సెక్రెటరీ(రూరల్)గా డాక్టర్ డి.ప్రసన్నకుమార్, జాయింట్ సెక్రటరీ(మహిళ)గా డాక్టర్ స్వప్నలత, ట్రెజరర్‌గా డాక్టర్ వి.నరేశ్‌కుమార్ ఎన్నికయ్యారు.

స్టేట్ కౌన్సిల్ మెంబర్స్‌గా డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ నాగేందర్, డాక్టర్ సి.అశ్రిత్‌రెడ్డి, డాక్టర్ రవికిరణ్‌రెడ్డి, డాక్టర్ రమేశ్, డాక్టర్ పి.ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ ఎ.రవీందర్‌రెడ్డి, డాక్టర్ శాంతన్, డాక్టర్ మహేందర్‌రెడ్డి, డాక్టర్ కె.నాగార్జున రెడ్డి, డాక్టర్ పి.లక్ష్మీనారాయణ, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ భాస్కర్, డాక్టర్ మధు, డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ వెంకన్న, డాక్టర్ శిరీష, డాక్టర్ భిక్షపతిరావు, డాక్టర్ టి.సనత్‌కుమార్, డాక్టర్ బాలాజీ, డాక్టర్ బి.శ్రీనివాస్, డాక్టర్ అజిత్ మహ్మద్, డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్, డాక్టర్ జి.చంద్రశేఖర్, డాక్టర్ కె.మల్లేశం, డాక్టర్ షేక్ అమీనుల్ల, డాక్టర్ అనిష బేగం, డాక్టర్ ఆయేశ పర్వీన్ ఎన్నికయ్యారు.

సర్పంచ్ రిజర్వేషన్లు ఖరారు

(5వ పేజీ తరువాయి)

పంచాయతీ దేనికి రిజర్వు అయింది తెలిసిపోవడంతో గ్రామాల్లో సందడి నెలకొన్నది. అప్పుడే ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. తమకు అనుకూలంగా రిజర్వేషన్లు ఖరారైన ఆశావహులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సంబరాలు చేసుకుంటున్నారు. పోటీకి సిద్ధమవుతున్నారు. గ్రామాల్లో ఇప్పటికే అధికార పార్టీ ముఖ్య నాయకులు సందడి చేస్తూ ప్రభుత్వ పథకాలు అందుతున్నవారిని కలుస్తూ మద్దతు కూడగట్టే ప్రయత్నంలో ఉన్నారు. సర్పంచ్ స్థానాలకు పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు ఎమ్మెల్యేను కలిసి తమ మనసులోని మాటచెప్పి మద్దతు కోరుతున్నారు. వారిని ప్రసన్నం చేసుకోవడం ద్వారా సీటును ఖరారు చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు.పార్టీ గుర్తులతో ఎన్నికలు లేకపోయినప్పటికీ మెజారిటీ అభ్యర్థులు పార్టీల మద్దతులో బరిలో దిగుతారు కనుక ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో ఎమ్మెల్యేలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.అనధికారిక సమాచారం ప్రకారం హనుమకొండ జిల్లాలో మొత్తం 205 పంచాయతీల్లో ఎస్సీలకు 52, ఎస్టీలకు 3, బీసీలకు 45 రిజర్వు కాగా, మిగిలిన 105 అన్‌రిజర్వుడు స్థానాల్లో మహిళలకు 49, మహిళలు, పురుషులకు 56 రిజర్వు చేశారు.

మండలాల వారీగా రిజర్వేషన్లు ఇలా..

- ఆత్మకూరు మండలంలోని 16 పంచాయతీల్లో ఎస్సీలకు 4, ఎస్టీలకు-0, బీసీలకు 4, అన్‌రిజర్వుడు స్థానాల్లో మహిళలకు 4, మహిళలు, పురుషులకు 4 రిజర్వు అయ్యాయి.
- భీమదేవరపల్లి మండలంలోని మొత్తం 24 పంచాయతీల్లో ఎస్సీలకు 5, ఎస్టీలకు 2, బీసీలకు 5, అన్ రిజర్వు స్థానాల్లో మహిళలకు 6, మహిళలు, పురుషులకు 7.
- దామెర మండలంలోని 14 పంచాయతీల్లో ఎస్సీలకు 4, ఎస్టీలకు-0, బీసీలకు 3, అన్‌రిజర్వుడు స్థానాల్లో మహిళలకు 3, మహిళలు, పురుషులకు 4.
- ధర్మసాగర్ మండలంలోని 19 పంచాయతీల్లో ఎస్సీలకు 5, ఎస్టీలకు-0, బీసీలకు 4, అన్‌రిజర్వుడులో మహిళలకు 5, మహిళలు, పురుషులకు 5.
- ఎల్కతుర్తి మండలంలోని 20 పంచాయతీల్లో ఎస్సీలకు 6, ఎస్టీలకు -0, బీసీలకు 4, అన్‌రిజర్వేడులో మహిళలకు 5, మహిళలు, పురుషులకు 5.
- హసన్‌పర్తి మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో ఎస్సీలకు 4, ఎస్టీలకు -0, బీసీలకు 3, అన్‌రిజర్వుడులో మహిళలకు 3, మహిళలు, పురుషులకు 4.
- ఐనవోలు మండలంలోని 17 పంచాయతీల్లో ఎస్సీలకు 5, ఎస్టీలకు -0, బీసీలకు 3, అన్‌రిజర్వేడులో మహిళలకు 4, మహిళలు, పురుషులకు 5.
- కమలాపూర్ మండలంలోని 24 పంచాయతీల్లో ఎస్సీలకు 5, ఎస్టీలకు-0, బీసీలకు 7, అన్ రిజర్వుడు మహిళలకు 6, మహిళలు, పురుషులకు 6.
- నడికూడ మండలంలోని 14 పంచాయతీల్లో ఎస్సీలకు 4, ఎస్టీలకు-0, బీసీలకు 3, అన్‌రిజర్వుడులో మహిళలకు 3, మహిళలు, పురుషులకు 4.
- పరకాల మండలంలోని 10 పంచాయతీల్లో ఎస్సీలకు 3, ఎస్టీలకు -0, బీసీలకు 5, అన్‌రిజర్వుడులో మహిళలకు 6, మహిళలు, పురుషులకు 6.
- శాయంపేట మండలంలోని 23 పంచాయతీల్లో ఎస్సీలకు 5, ఎస్టీలకు 1, బీసీలకు 5, అన్ రిజర్వుడులో మహిళలకు 6, మహిళలు, పురుషులకు 6.
- వేలేరు మండలంలో 9 పంచాయతీల్లో ఎస్సీలకు 2, ఎస్టీలకు -0, బీసీలకు 2, అన్‌రిజర్వుడులో మహిళలకు 2, మహిళలు, పురుషులకు 3.

వేగవంతంగా మాడవీధుల పనులు

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భద్రకాళి ఆలయం సమీపంలోని మాడవీధుల పనులను వేగవంతం చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. ఆదివారం హనుమకొండ కుడా కార్యాలయంలో భద్రకాళి మాడవీధుల నిర్మాణ పనులు, వాటి పురోగతి, సుందరీకరణ పనులతోపాటు రోప్‌వే, గ్లాస్ బ్రిడ్జివే ఏర్పాటుపై కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భద్రకాళి ఆలయం మాడవీధుల విస్తరణ పనులకు ఉన్న అడ్డంకులను తొలగించి పనులు పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో హనుమకొండ ఆర్‌డీవో రాథోడ్ రమేష్, కుడా సీపీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు, హనుమకొండ తహసీల్దార్ రవీందర్‌రెడ్డితోపాటు ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మోషన్ టాలెంట్ టెస్టుకు విశేష స్పందన

హనుమకొండ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ నయీంనగర్‌లోని మోషన్ ఐఐటీ అండ్ నీట్ జూనియర్ కాలేజీలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆదివారం మోషన్ టాలెంట్ టెస్టు పరీక్షలు నిర్వహించినట్లు మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. ఈ పరీక్షకు 800 మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. దేశంలోనే ఐఐటీ, నీట్ కోచింగ్‌కు అగ్రగామి విద్యాసంస్థ కోటా రాజాస్థాన్ మోషన్.. దేశవ్యాప్తంగా టాలెంట్ టెస్టు నిర్వహించినట్లు తెలిపారు. హనుమకొండ సెంటర్ నుంచి మెరిట్ సాధించిన 10 మంది విద్యార్థులకు ఉచిత విద్యతోపాటు మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి ల్యాప్‌టాప్, రెండో ర్యాంకు సాధించిన విద్యార్థికి ఐపాడ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్ష ఫలితాలు డిసెంబరు 1న ప్రకటించనున్నట్లు వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మోషన్ కాలేజీ బ్రాంచ్ హెడ్ ముత్యాల సురేష్, కోటా అధ్యాపకులు అనుజ్‌కపూర్, పాఠక్, సురేందర్, మిథున్, కాలేజీ సిబ్బంది రాజు,రమేష్, లక్ష్మణ్, సుమన్, మౌనిక, ఉమ, కుమార్, నాగరాజు, మనోహర్, వెంకట్, రంజిత్, అనిల్, సంతోష్, రవీందర్‌పాల్గొన్నారు.



మోషన్ టాలెంట్ టెస్టు పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఘనంగా సత్యసాయి బాబా శత జయంతి



కలెక్టరేట్‌లో సత్య సాయిబాబా శత జయంతి వేడుకలను ప్రారంభిస్తున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీ సత్య సాయిబాబా జయంతి పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేసిన ఉత్సవాలను కలెక్టర్ సత్యశారద ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం కలెక్టరేట్‌లో సత్యసాయి బాబా చిత్రపటానికి కలెక్టర్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి పూలమాలలు వేసి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. శ్రీ సత్యసాయి బాబా సేవా స్ఫూర్తి, ఆయన బోధించిన మానవతా విలువలను స్మరించుకుంటూ జిల్లాలో విద్యార్థులను సన్మార్గంలో నడిపించుటకు స్ఫూర్తి అనే కార్యక్రమాన్ని రిటైర్డ్ ఉద్యోగస్తులు, జిల్లా అధికారులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో సత్యసాయి భగవాన్ ట్రస్ట్ సభ్యులు పాల్గొని పిల్లలకు సన్మార్గాన్ని బోధించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొండెక్కిన కోడి గుడ్డు

- ఒకటి 8 రూపాయలు
- నెల క్రితం రూ.5.50
- తగ్గిన ఉత్పత్తితో పెరిగిన ధర

కేసముద్రం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పేద, మధ్య తరగతి వర్గాలకు అందుబాటులో ఉన్న ప్రధాన పౌష్టికాహారమైన కోడిగుడ్డు ధర ఈ చలికాలంలో మండుతోంది. గత నెలలో ఇదే రోజున 30 గుడ్ల కేస్ ధర రూ.165 ఉండగా, తాజాగా రూ.210కి పెరిగింది. వారం, పది రోజులుగా హోల్‌సేల్‌లో కేస్ ధర రూ.180 నుంచి ప్రతిరోజూ రూ.1 నుంచి రూ.2 వరకు పెరుగుతోంది. దీంతో 15 రోజుల క్రితం వరకు రిటైల్‌లో రూ.6లు విక్రయించిన గుడ్డును తాజాగా రూ.8లకు అమ్ముతున్నారు. అధిక ధరతో మధ్యాహ్న భోజనం, ఇతర ప్రభుత్వ హాస్టళ్లలో గుడ్డు వడ్డించడం నిర్వాహకులకు ఆర్థిక భారం పడుతోంది. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని కొన్ని దుకాణాల్లో మాత్రం వినియోగదారులకు రూ.9 చొప్పున అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. సాధారణంగా చలికాలంలో గుడ్లు 20 నుంచి 30 రోజుల వరకు ఎలాంటి ఫ్రీజర్లు అవసరం లేకుండా నిల్వ ఉంటాయి. దీంతో కోడిగుడ్లను ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు చల్లని వాతావరణం అనుకూలంగా ఉంటుంది.

ఉత్పత్తి తగ్గి.. ధర పెరిగి..

సాధారణంగా ప్రతీ ఏటా కోళ్ల ఫారాల్లో చలి పెరగడంతో గుడ్ల ఉత్పత్తి 60 శాతానికి పడిపోతుంది. దీంతో పాటు గత సీజన్‌లో ఫారాల్లో ఉన్న కోళ్ల బ్యాచ్‌లను చాలామంది నిర్వాహకులు తొలగించడంతో గుడ్ల ఉత్పత్తి గణనీయంగా పడిపోయిందని కేసముద్రంలో ఫారం నిర్వాహకుడు బొబ్బాల యాకూబ్ రెడ్డి తెలిపారు. ఫామ్‌లలో కోళ్లు లేక, ఉన్నచోట చలికారణంగా గుడ్ల ఉత్పత్తి బాగా తగ్గింది. దీంతో సాధారణ డిమాండ్‌కు అనుగుణంగా కోడిగుడ్ల సప్లయ్ లేక ధర అమాంతం పెరుగుతున్నట్లు ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు రాబోయే డిసెంబర్‌లో క్రిస్మస్, కొత్త సంవత్సర వేడుకల్లో దేశవ్యాప్తంగా లక్షల క్వింటాళ్ల కేకులను తయారు చేస్తారు. ఈ కేకుల తయారీ కోసం కోడిగుడ్లను అధికంగా వినియోగిస్తుంటారు. ఈ క్రమంలో రాబోయే రోజుల్లో మరింత ధర పెరిగే అవకాశం ఉన్నట్లు పలువురు హోల్‌సేల్ విక్రయదారులు తెలిపారు.



మేడారంలో జోరుగా అభివృద్ధి పనులు

తాడ్వాయి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఊరట్టం క్రాస్ స్థూపం నుంచి తాడ్వాయి రోడ్డు మీదుగా ఆర్టీసీ వైజంక్షన్ వరకు, మేడారం, పరిసర గ్రామాల్లో లింక్ రోడ్లు, గ్రామాల్లో అంతర్గత రోడ్ల విస్తరణ పనులు సాగుతున్నాయి. అంతేకాకుండా డ్రెయినేజీ, విద్యుత్ మరమ్మతులు, ప్రధాన కూడళ్ల అభివృద్ధి, దేవస్థానంలో ప్రాకారం, గద్దెల మార్పు, నూతన క్యూలైన్ల ఏర్పాటు, నీడ షెడ్లు వంటి కొన్ని పనులు వేగంగా జరుగుతున్నాయి. రోడ్ల విస్తరణ పనులకు డిసెంబరు 22, దేవస్థానం పనులకు డిసెంబరు 30, మహాజాతరలో భక్తుల సౌకర్యాల పనులు జనవరి 15లోగా పూర్తి కావాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయి.



మేడారంలో పనులు చేస్తున్న కూలీలు



జంపన్న వాగులో పనులు చేస్తున్న దృశ్యం

పగిడిద్దరాజు గద్దెను కదిలించిన పూజారులు

మేడారం వనదేవతలు పగిడిద్దరాజు గద్దెను పూజారులు ఆదివారం కదిలించారు. దేవస్థానం మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల స్థల మార్పు, పునర్ ప్రతిష్ఠాపన పనులు చేపట్టాల్సి ఉంది. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం సమ్మక్క- సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలకు పూజారులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పగిడిద్దరాజు గద్దెను కదిలించారు. ఈ సందర్భంగా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు మాట్లాడుతూ పునుగొండ్లకు చెందిన పెనుక వంశీయులు ముహూర్తం చేసుకొని పగిడిద్దరాజు గద్దె కదిలింపు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పనులు పూర్తయిన వెంటనే గద్దెపై తిరిగి ప్రతిష్ఠిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పూజారులు కాక సారయ్య, కృష్ణయ్య, మునీందర్, అరుణ్, కిరణ్ మహేష్, స్వామి, గోవర్ధన్, బుచ్చిరాములు, రమేష్, జనార్దన్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

లీగల్ మెట్రాలజీ పరిధిలోకి 18 యంత్రాలు

- వినియోగదారుల రాష్ట్ర అధ్యక్షుడు ఎం. సుదర్శన్
- శివనగర్‌లో శిక్షణ

ఖిలావరంగల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల రక్షణలో భాగంగా కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ లీగల్ మెట్రాలజీ రూల్స్ 2025 సంవత్సరంలో తమ పరిధిలోకి వచ్చే 18 యంత్రాలను చేర్చిందని వినియోగదారుల రాష్ట్ర అధ్యక్షుడు, దక్షిణాది రాష్ట్రాల సెక్రటరీ జనరల్ మొగిలిచర్ల సుదర్శన్ అన్నారు. ఆదివారం శివనగర్‌లోని సమాఖ్య కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మురారి కార్తీక్ అధ్యక్షతన తెలంగాణ ఉమ్మడి జిల్లా వినియోగదారుల శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా భారత వినియోగదారుల మంత్రిత్వ శాఖను సీసీసీ దక్షిణాది రాష్ట్రాల కమిటీ కోరిన విధంగా కొన్ని ముఖ్యమైన కొలతల ప్రామాణిక యంత్రాల ధ్రువీకరణ, అమలు అధికారాలను లీగల్ మెట్రాలజీ శాఖ పరిధిలోకి 18 యంత్రాలను చేర్చిందన్నారు. అందులో ముఖ్యంగా వాటర్ మీటర్స్, ఎనర్జీ మీటర్స్, గ్యాస్ మీటర్స్, మాయిశ్చర్ మీటర్స్ డ్రంకెన్‌డ్రైవ్, ఐడెంటిటీకి వాడే బ్రీత్ అనలైజర్స్, వీటి ధ్రువీకరణ, పరిశీలన లీగల్ సెల్ మెట్రాలజీ పరిధిలో ఉంటుందన్నారు. అందులో లీగల్ సెల్ మెట్రాలజీ చట్ట సవరణ త్వరలో చేయబోతుందని తెలిపారు. రహదారి భద్రత చట్టం ప్రకారం రోడ్డు రవాణాశాఖ పరిధిలో అమలవ్వాల్సిన బ్రీత్ ఎనలైజర్ టెస్టు ప్రస్తుతం పోలీసు శాఖ వారు నిర్వహిస్తున్నారన్నారు. అలాగే ఎనర్జీ మీటర్స్ విషయంలో కూడా వినియోగదారుల్లో అనేక అనుమానాలు, వివాదాలు ఉన్న విషయం మనకు తెలిసిందేనన్నారు. కావున రాష్ట్రంలోని జిల్లాల బాధ్యులు తమ జిల్లాల్లో ఈ వివరాలను వివరిస్తూ వినియోగదారులను చైతన్యం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది సీసీఐ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మురారిశెట్టి యశ్వంత్‌కుమార్, ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి రావుల రంజిత్‌కుమార్, న్యాయ సలహా సభ్యులు రంగరాజు ఆనందరావు, రాయబారపు భిక్షపతి, బండి అనిల్‌కుమార్ శ్రాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆశలపై నీళ్లు

(5వ పేజీ తరువాయి)

పోస్టే కావాలని అధిష్ఠానం వద్ద విజ్ఞప్తి చేసింది. అలాగే ప్రస్తుత అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో పాటు ఆయన కుమారుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. అయితే ప్రశాంత్‌రెడ్డికి అధిష్ఠానం హామీ ఇచ్చిందనే ప్రచారం జరిగింది. అయినప్పటికీ అనూహ్యంగా ధన్వంతికి డీసీసీ పగ్గాలు చేజిక్కటం చర్చనీయాంశంగా మారింది.

మహబూబాబాద్ డీసీసీ పీఠం పక్కాగా వెన్నం శ్రీకాంత్‌రెడ్డికే దక్కుతుందనే ప్రచారం జరిగింది. జిల్లా అధ్యక్ష పదవికోసం 46 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రధానంగా శ్రీకాంత్‌రెడ్డితో పాటు ప్రస్తుత అధ్యక్షుడు భరత్‌చంద్రారెడ్డి, ఘణపురం అంజయ్య, నునావాత్ రాధ పేర్లు ప్రముఖంగా వినిపించాయి. అయితే అధిష్ఠానం అందరికీ ఝలక్ ఇస్తూ మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ సతీమణి, మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ భూక్య ఉమకు ప్రెసిడెంట్ పదవిని అప్పగించారు. దీంతో సీనియర్ నేతలు, ఆశావహుల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది.

ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో మహబూబాబాద్, జనగామ జిల్లాల అధ్యక్ష పదవులు ఎస్టీ మహిళలకే కేటాయించటం చర్చనీయాంశంగా మారింది.

ములుగు పాత కాపుకే.. భూపాలపల్లి పీఠం దుద్దిళ్ల శ్రీధర్‌బాబే డిసైడ్

ప్రస్తుత డీసీసీ అధ్యక్ష పదవులకు ఉమ్మడి జిల్లాల్లో ములుగు మినహా ఎవరికీ కూడా మరోసారి పదవి దక్కలేదు. అయితే ములుగు జిల్లాలో మాత్రం మంత్రి సీతక్క చక్రం తిప్పి తన అనుచరుడికి మూడోసారి డీసీసీ ప్రెసిడెంట్ పదవి దక్కించుకున్నారనే చర్చ జరుగుతోంది. పైడాకుల అశోక్ ఇప్పటికే రెండు సార్లు డీసీసీ ప్రెసిడెంట్‌గా పని చేశారు. పార్టీ నిబంధనల్లో మూడోసారి చాన్స్ లేదని పేర్కొన్నప్పటికీ అనుహ్యంగా పైడాకులకు చాన్స్ రావటం కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వరంగల్ అధ్యక్ష పదవిని ఎర్రబెల్లి స్వర్ణకు మూడోసారి ఇవ్వకుండా అశోక్‌కు అప్పగించటం వెనుక మంత్రి ఒత్తిడి ఉండొచ్చనే చర్చ ఉంది.

భూపాలపల్లి జిల్లా నుంచి డీసీసీ ప్రెసిడెంట్ పదవి కోసం సుమారు వందమంది వరకు ఆశించారు. అయితే అధిష్ఠానం ఐదేళ్ల సభ్యత్వం, మూడోసారి నోచాన్స్ లాంటి నిబంధనలతో చాలా మంది వెనక్కి తగ్గారు. అయితే ఈ నిబంధనలేవి పార్టీ పాటించలేదని తెలుస్తోంది. భూపాలపల్లి డీసీసీ అధ్యక్ష పదవిని గాజర్ల అశోక్, అప్పం కిషన్, చల్లూరి మధుతో పాటు అనేక మంది కీలక నేతలు ఆశించారు. అనూహ్యంగా భట్టు కర్ణాకర్‌ను వరించింది. 2009 నుంచి కాంగ్రెస్ పార్టీ క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న కర్ణాకర్ వైపు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మొగ్గు చూపారనే చర్చ ఉంది. దీంతో హేమాహేమీలు డీసీసీ పీఠం కోసం పోటీ పడినప్పటికీ ఎమ్మెల్యేను ఒప్పించి, కరుణాకర్‌కే పదవి అప్పగించారనే చర్చ ఉంది. మొత్తానికి కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించిన డీసీసీ అధ్యక్ష పదవులు కొందరికి సంతోషాన్ని ఇస్తుంటే.. మరికొందరు మాత్రం అంతర్గతంగా అసంతృప్తితో ఉన్నారు.

హిడ్మా ఫ్లెక్సీకి నివాళులర్పించిన వ్యక్తులకు బెయిల్

వేలేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అగ్రనేత హిడ్మా ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ అనేకమంది సోషల్ మీడియాలో పలు రకాల పోస్టులు పెట్టారు. వేలేరు మండలం సోడాషపల్లి గ్రామానికి చెందిన కొయ్యడ సురేష్, మ్యాక బుచ్చయ్య హిడ్మాతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. దీనిపై వేలేరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. దీంతో హనుమకొండ నాలుగో అదనపు మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా న్యాయవాది వారి తరఫున వాదన వినిపించి నిందితులకు బెయిల్ మంజూరు చేయించారు.

ఆదాయమే తప్ప పట్టింపేది ?

- అమ్మవారి వాహనాలన్నీ ఆలయంలోనే..
- కానరాని పరిసరాల పరిశుభ్రత

వరంగల్ కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులతో నిత్యం రద్దీగా ఉండే వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారి దేవాలయం సమస్యలకు నిలయంగా మారింది. రోజు రోజుకు భక్తుల సంఖ్యతో పాటు అమ్మవారి హుండీ ఆదాయం కూడా పెరుగుతోంది. కానీ పెరుగుతున్న భక్తులకు అనుగుణంగా ఆలయ అధికారులు సౌక ర్యాలు కల్పించడంలేదు. గతంలో అమ్మవారి ఆలయం పక్కనే ఈవో కార్యాలయం ఉండడంతో పర్యవేక్షణ ఉండేది. ప్రస్తుతం ఆలయానికి ఈవో కార్యాలయానికి మధ్య దూరం పెరగడంతో ఆలయంలో ఏం జరుగుతుందనేది తెలియడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

భద్రకాళి అమ్మవారికి ఏడాదిలో 4 సార్లు నవరాత్రోత్సవాలు జరుగుతాయి. అందులో ప్రధానమైనవి శాకంబరీ, దసరా శరన్నవరాత్రోత్సవాలు. ఈ ఉత్సవాల్లో అమ్మవారి ఉత్సవమూర్తిని ఉదయం, సాయంత్రం ఆ రోజు అలంకరణ ఏ వాహన సేవ నిర్వహించాలో ఆ సేవలను నిర్వహిస్తారు. ఈ సేవలకు నిర్వహించే వాహనాలు ఉత్సవాల అనంతరం ఆలయంలో ఇష్టారీతిగా పక్కకు పెడుతున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా అమ్మవారి స్తపన మండపంలో ఉత్సవమూర్తికి పూజలు, ప్రముఖులు వస్తే ఆశీర్వచనం ఉంటుంది. ఆ ప్రాంతంతో పాటు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వెనుకాల ఆంజనేయస్వామి ఆలయం పక్కకు, శివాలయం పక్కకు వాహనాలను పెట్టారు. దీంతో స్థలాభావంతో భక్తులకు ఇబ్బందిగా మారింది. వాహనాలు తుప్పు పట్టే అవకాశం ఉందని ఉత్సవాల్లో వినియోగించే వాహనాలను అధికారులు వేరో చోటికి తరలించాలని భక్తులు కోరుతున్నారు.



ఆలయంలోనే ఉన్న అమ్మవారి వాహనాలు

అమ్మవారి చీరల కౌంటర్ ఏర్పాటు చేయాలి

అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు అమ్మవారికి చీరల వస్త్ర సమర్పణ జరుగడం ఆ వస్త్రాలను వెంటనే చీరల కౌంటర్‌కు తరలించడం జరుగుతుంది. భక్తితో అమ్మవారికి చీరలను కట్టించాలని ఎంతో భక్తితో తెచ్చే భక్తులు ఆ వస్త్రాలను అర్చకులకు ఇవ్వగా అర్చకులు అమ్మవారి ఆలయం బయటనే టేబుల్ పై ఉత్సవమూర్తి వద్ద పెట్టడం, అర్చకుల వెనుక స్వీపర్లు వెంటనే ఆ చీరలను చీరల కాంట్రాక్టర్ వద్దకు తీసుకెళ్లడం జరుగుతోంది. ఈ సన్నివేశాలను చూసిన భక్తులు నొచ్చుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఆలయ ప్రాంగణంలో ఈ చీరల కౌంటర్ ఇబ్బందికరంగా మారింది. ఓ పక్క అమ్మవారి వాహనాలు మరో పక్క చీరల కౌంటర్లు వలన హోమం నిర్వహించలేకపోతున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం భక్తులు కూర్చోవడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు.

పడకేసిన పారిశుధ్యం

అమ్మవారి దేవాలయంలో ఎక్కడ చూసిన చెత్తనే కనిపించడం ఆలయ ప్రాంగణంలో, గర్భాలయంలో చీపుర్లు పట్టుకొని తిరగడం, దర్శనానికి వచ్చే భక్తులకు చీపుర్లు తాకడం వంటి సంఘటనలు జరుగుతున్నాయని భక్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అలయ అధికారులు స్పందించి భక్తులకు సరిపడా సౌకర్యాలు కల్పించాలని, ఆలయంలో పరిశుభ్రత దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు. అదే విధంగా వాహనాల కోసం షెడ్ నిర్మాణం, చీరలకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



గుడిలోనే ఏర్పాటు చేసిన చీరల కౌంటర్

ఏ పూలు తేవాలి నీ పూజకు..

సిద్ధేశ్వరాలయ అర్చకుడి పూలంగి సేవ

హనుమకొండ కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆయన ఎలాంటి ఆడంబరం లేకుండా గత ఆరు సంవత్సరాలుగా నిర్విరామంగా పూలంగి (పూల) సేవ చేస్తున్నారు. హనుమకొండ బ్రాహ్మణవాడలోని అన్ని ఆలయాల్లో నిత్యం జరిగే పూజా కార్యక్రమాల్లో ఆయన అందించే పువ్వులతో మూలవిరాట్‌లకు అలంకరిస్తున్నారు. అంతేగాక ఉత్సవ సమయాల్లోనూ ఈయన వరంగల్, హైదరాబాద్, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి తెప్పించిన పూలనే వినియోగించడం విశేషం.

హనుమకొండ బ్రాహ్మణవాడలోని స్వయంభువు సిద్ధేశ్వరాలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న సిద్ధేశుని రవికుమార్ ఆరేళ్లుగా పూలతో దైవ సేవ చేస్తున్నారు. మొదటగా తన నివాసానికి సమీపంలో ఉన్న దొప్ప లక్ష్మీనర్సింహ స్వామి వారు ఆరేళ్ల క్రితం కలలోకి వచ్చి ఆయనకు పూల సేవ చేయాలని కోరారని, అప్పటి నుంచి తన సేవ మొదలైందని చెప్పారు. అలా మొదలైన సేవ క్రమేపీ కొద్ది నెలల్లోనే ఇదే ప్రాంతంలోని హనుమద్గిరి రంగనాథస్వామి ఆలయం, పెద్ద కోవెల, దత్తాత్రేయ స్వామి ఆలయానికి ఇక్కడే ఉన్న పంచరామ ఆలయంతో పాటు తాను పనిచేస్తున్న సిద్ధేశ్వరాలయాలకు విస్తరించింది.

ఎంత లేదన్నా నెలకు రూ. 50 వేల నుంచి రూ. 60 వేలు, వీటితో పాటు ఉత్సవ సమయాల్లో ఇంకా ఎక్కువ డబ్బులు వెచ్చించి ఆయన పలు రకాల పువ్వులను తెప్పించి ఆలయాలకు అందజేసి సంతృప్తి చెందుతున్నారు. ఎప్పుడు చూసినా రెండు చేతుల్లో సంచుల్లో పూలతో ఆలయాల వైపు నడుచుకుంటూ వెళ్లే రవికుమార్ తన జీవితకాలం ఈ పూలంగి సేవ చేస్తానని తెలిపారు. కార్తీకమాసం లో ప్రతీ సోమవారం సిద్ధేశ్వరాలయంలో, హనుమకొండ విక్కీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన గజానన మండలి వేడుకలప్పుడు రెండుసార్లు అన్నదానాలు చేపడుతున్నట్లు చెప్పారు.



పూలతో ఆలయానికి వస్తున్న పూజారి రవికుమార్



రవి కుమార్ తెచ్చిన పూల అలంకరణలో పెద్ద కోవెలలోని స్వామివారు

దివ్యాంగులకూ స్వయం సహాయక సంఘాలు

- ఈ సంఘాల్లో స్త్రీలతో పాటు పురుషులూ సభ్యులు
- ఉమ్మడి జిల్లాలో 556 దివ్యాంగ సంఘాల ఏర్పాటు
- వృద్ధులు, కిశోర బాలికలకు ఎస్‌హెచ్‌జీలు
- డీఆర్‌డీవో, మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు

హనుమకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) అంటే మహిళలకే అనుకుంటాం కదా..! ఆ భావన మారింది. ఇప్పటి వరకు మహిళల భాగస్వామ్యంతో ఏర్పాటైన సంఘాలకే బ్యాంకు లికేజీ, స్త్రీ నిధి రుణాలు ఇస్తూ వచ్చారు. ఆ పరిస్థితి మారింది. మహిళలకు మాత్రమే కాదు.. ఎస్‌హెచ్‌జీలను దివ్యాంగులకు, వృద్ధులకు, కిశోర బాలికలకూ అందుబాటులోకి ప్రభుత్వం తీసుకువచ్చింది. వీరు కూడా ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి, స్వావలంబన సాధించడానికి, మహిళా సంఘాలను స్ఫూర్తిగా తీసుకోవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దివ్యాంగ స్వయం సహాయక సంఘాలు (పీడబ్ల్యుడీఎస్)ల్లో మహిళలతో పాటు పురుషులు కూడా సభ్యులుగా ఉంటారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ, పురపాలక సంఘాల్లో మెప్మా పీడీలకు దివ్యాంగులతో యుద్ధ ప్రాతిపదికన స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని డీఆర్‌డీవో, పురపాలక సంఘాలు ఇప్పటికే చాలా వరకు ఏర్పాటు చేశాయి. వీటన్నిటినీ ఆన్‌లైన్‌లో సైతం నమోదు చేశాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా దివ్యాంగ ఎస్‌హెచ్‌జీలతోపాటు వృద్ధులు, కిశోర బాలికల స్వయం సహాయక సంఘాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇవి కూడా మహిళా ఎస్‌హెచ్‌జీల మాదిరిగానే పని చేస్తాయి. వీటికి కూడా ఈ సంఘాల మాదిరిగానే బ్యాంకులు రుణాలను అందజేస్తాయి. ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందుతాయి. ఇతరత్రా ప్రయోజనాలు వర్తిస్తాయి.



స్వయం సహాయక సంఘాల్లో సభ్యులైన వృద్ధులు

556 దివ్యాంగ సంఘాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,442 దివ్యాంగ ఎస్‌హెచ్‌జీలు ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం కాగా, ఇప్పటివరకు 556 దివ్యాంగుల ఎస్‌హెచ్‌జీలు ఏర్పాటు చేశారు. హనుమకొండ జిల్లాలో 345 సంఘాలే ఏర్పాటు చేయాల్సి ఉండగా, 210 వరకు ఏర్పాటు చేశారు. వరంగల్ జిల్లాలో 272 ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం కాగా, 56 ఏర్పాటయ్యాయి. జనగామ జిల్లాలో 283కు గాను 68, మహబూబాబాద్ జిల్లాలో 332కు గాను 145, ములుగు జిల్లాలో 112కు గాను 52, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 98కిగాను 25 సంఘాలు ఏర్పాటయ్యాయి. త్వరలో మరిన్ని సంఘాలను ఏర్పాటు చేసే దిశగా కసరత్తు జరుగుతోంది. క్షేత్రస్థాయి సిబ్బంది దివ్యాంగుల వద్దకు వెళ్లి వారికి స్వయం సహాయక సంఘాల ఏర్పాటు ఆవశ్యకత, వాటి వల్ల ఒకగూరే ప్రయోజనాలను వివరించడం ద్వారా సంఘాలుగా ఏర్పాటు అయ్యేట్లు ప్రోత్సహిస్తున్నారు. దివ్యాంగులు ఇప్పుడిప్పుడే ముందుకు వస్తున్నారు.

హనుమకొండ టాప్

దివ్యాంగ స్వయం సహాయ సంఘాల ఏర్పాటులో హనుమకొండ జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. రెండోస్థానంలో కరీంనగర్ జిల్లా ఉంది. జిల్లాలో సదరమ్ శిబిరాల ద్వారా దివ్యాంగులుగా ధృవీకరణ పొందిన వారు 27,290 మంది ఉన్నారు. వీరిలో 13,540 మంది పింఛన్ తీసుకుంటున్నారు. హనుమకొండ జిల్లాలోనే దివ్యాంగులు అధిక సంఖలో ఉన్నారు. వీరి సంఖ్యను బట్టి సుమారు వెయ్యి సంఘాల వరకు ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంది. దీనితో ఈ జిల్లాలో వీరితో వీలైనన్ని ఎక్కువ ఎస్‌హెచ్‌జీలను ఏర్పాటు చేసేందుకు డీఆర్‌డీఏ క్షేత్రస్థాయి సిబ్బంది జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అర్హులైన దివ్యాంగులను గుర్తించి వారు ఎస్‌హెచ్‌జీలో సభ్యులుగా చేరేట్టు చర్యలు తీసుకుంటున్నారు. దివ్యాంగులతోపాటు జిల్లాలో 189 వృద్ధుల స్వయం సహాయక సంఘాలను, 192 కిశోర బాలిక స్వయం సహాయక సంఘాలను ఇప్పటి వరకు ఏర్పాటు చేశారు.

వెయ్యి సంఘాల ఏర్పాటు లక్ష్యం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డీఆర్‌డీవో, మెప్మా క్షేత్రస్థాయి అధికారులు దివ్యాంగ స్వయం సహాయక సంఘాల ఏర్పాటును వేగవంతం చేశారు. పది నుంచి పదిహేను మందితో గ్రూప్ ఏర్పాటు చేసి దివ్యాంగ మహిళను అధ్యక్షురాలిగా చేసి బ్యాంకు ఖాతాలు తెరిపిస్తున్నారు. ఈ సంఘాలకు రుణం ఇవ్వడంతో పాటు సభ్యులకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తారు. శిక్షణలో ప్రతిభ చూపేవారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. ఒక్కో జిల్లాలో డీఆర్‌డీవో పరిధిలో వెయ్యి సంఘాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది.

ప్రయోజనాలు

దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలలో చేరిన వారికి దివ్యాంగు చట్టంపై అవగాహన, వారి భద్రత, హక్కులు, సమకూర్చబడే సదుపాయాలు, సభ్యులకు మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు నిపుణులతో కౌన్సెలింగ్, అసెస్‌మెంట్, ట్రీట్‌మెంట్, పునరావాసం సేవలు అందిస్తారు. నైబర్‌హుడ్ సెంటర్లు ఏర్పాటు చేస్తారు. జీవనోపాదుల శిక్షణ ఇస్తారు. ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు రుణసదుపాయం అందజేస్తారు. ప్రభుత్వం ద్వారా ఒక్కో సంఘానికి రూ.15వేలు రివాల్వింగ్ ఫండ్ అందజేస్తారు. వీఆర్‌ఎఫ్, సీఐఎఫ్, లోన్‌బీమా, ప్రమాదబీమా పెన్షన్ మంజూరు వంటి సదుపాయాలు కల్పిస్తారు. వృద్ధ మహిళా సంఘాల్లో సభ్యులైన వారికి సామాజిక భద్రత, వారి హక్కుల రక్షణ, వృద్ధాప్యంలో వచ్చే ఆరోగ్య సమస్యలకు చికిత్స, మానసిక సమస్యలపై అవగాహన కల్పిస్తారు. వారిలో మానసిక స్థైర్యాన్ని నింపుతారు. ప్రభుత్వం ద్వారా ఒక్కో సంఘానికి రూ.15వేల రివాల్వింగ్ ఫండ్ అందజేస్తారు. కిశోర బాలికల స్వయం సహాయక సంఘాల విషయంలో ప్రత్యేక మార్గదర్శకాలు త్వరలో జారీ అవుతాయి.



ఎన్నికైన టీజీటీఈఏఎం రాష్ట్ర కార్యవర్గం

టీజీటీఈఏఎం రాష్ట్ర అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్

వడ్డెపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ టీచర్స్ అండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ మోడల్ స్కూల్స్(టీజీ-టీఈఏఎం) రాష్ట్ర కార్యవర్గ సర్వసభ్య సమావేశం ఆదివారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీజీ-టీఈఏఎం రాష్ట్ర అధ్యక్షుడిగా రేచవేణి కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కట్కూరి మహేందర్, కోశాధికారిగా ఎడ్ల రమేష్, అధికార ప్రతినిధిగా మహ్మద్ అన్వర్‌పాషా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా గోపగాని విక్రమ్, రుద్రమదేవి, శశికుమారితో పాటు 14 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

హసన్‌పర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం చెల్లించి రైతులకు న్యాయం చేయాలని సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు మంద సుచెందర్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల కురిసిన అనూహ్య వర్షాలతో వడ్లు, పత్తి సహా అనేక పంటలు పూర్తిగా నష్టపోయి రైతులు తీవ్రమైన సంక్షోభంలోకి వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టాలతో రైతుల పరిస్థితి దయనీయంగా మారినా ప్రభుత్వం మాత్రం సమస్యపై కనీస స్పందన చూపకపోవడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే రైతుల హక్కుల కోసం సీపీఐ(ఎం) ఉగ్ర ఉద్యమాలకు సిద్ధమవుతుందని ఆయన హెచ్చరించారు. రైతుల సమస్యల పరిష్కారానికి పార్టీ నిరంతరం పోరాడుతుందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గుమ్మడిరాజుల రాములు, మండల కమిటీ సభ్యులు వేణు రజిత, పుల్ల అశోక్, వేలు సుమన్, నాంపల్లి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

వేయిస్తంభాల గుడిలో క్లీన్ అండ్ గ్రీన్


ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న దృశ్యం

హనుమకొండ కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్న చారిత్రక వేయిస్తంభాల ఆలయ ప్రాంగణంలో ఆదివారం వరల్డ్ హెరిటేజ్ వీక్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత అభియ క్లీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్ర సాంస్కృతికశాఖ ఆదేశాల నేపథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్ర మంలో వేయిస్తంభాల ఆలయ ప్రాంగణంలో పురావస్తుశాఖ జిల్లా అధికారి అజిత్, కోఆర్డినేటర్ నిరంజన్, దేవాదాయ శాఖ ఆలయ ఈవో అనిల్ కుమార్, ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మతో పాటు దేవాదాలయ శాఖ సిబ్బంది, పురావస్తు శాఖ సిబ్బంది, విద్యార్థులు స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొని ఆలయ ప్రాంగణాన్ని పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరితో హెరిటేజ్ ప్రతిజ్ఞ చేయించారు.

ఎమ్మెల్యే నాయిని ఇంటిని ముట్టడిస్తాం..

» బీఆర్ఎస్ నాయకులు
» గులాబీ నేతలపై చేసిన వ్యాఖ్యలపై మండిపాటు

కాజీపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, టి.హరీష్‌రావు, టి.రాజయ్యపై అనుచిత వాఖ్యలు చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలని, లేకుంటే ఎమ్మెల్యే నాయిని ఇంటిని ముట్టడిస్తామని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నాయకులు డిమాండ్ చేశారు. కాజీపేట 61వ డివిజన్‌లో ఆదివారం బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నాయకులు మీడియా సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులపై తీవ్ర ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. నాయిని రాజేందర్ రెడ్డి 24 గంటల్లో క్షమాపణలు చెప్పకుంటే లక్ష డప్పులతో దండోరా వేయించి ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో 61వ డివిజన్ అధ్యక్షులు కుమ్మరి కోటిలింగం, గాదెపాక రమేశ్, కందుకూరి లక్ష్మీనారాయణ, జి.వెంకటలక్ష్మి, బి.రాజేశ్వరీ, డి.సీత, రమ తోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దళితులకు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్

హనుమకొండ టౌన్ : వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దళితులను వ్యక్తిగతంగా దూషించి అవమానించారని తక్షణమే తాటికొండ రాజయ్యకు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ దళిత నాయకులు మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, కంజర్ల మనోజ్ కుమార్ ఆదివారం వేరు వేరు ప్రకటనలో డిమాండ్ చేశారు. 24 గంటల్లో ఎమ్మెల్యే స్పందించకపోతే డప్పులతో ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పున్నం చందర్, పండుగ, విద్యాసాగర్, ముల ప్రభాకర్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.


కాజీపేటలో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

దళితులు తిరగబడతారు..

బీఆర్ఎస్ రాష్ట్ర మహిళా నాయకురాలు లోహిత

వడ్డెపల్లి : కాంగ్రెస్ పార్టీ నేతలు బీఆర్ఎస్ దళిత నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తిరగబడక తప్పదని బీఆర్ఎస్ రాష్ట్ర మహిళా నేత, 58వ డివిజన్ కార్పొరేటర్ ఇమ్మడి లోహితరాజు అన్నారు. ఆదివారం హనుమకొండ వడ్డెపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తదితరులు మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్‌లపై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే దళిత పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం వేలాది మంది డప్పులతో నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి సుదర్శన్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు జన్ను విజయలక్ష్మి, నాయకులు తాళ్లపల్లి జైపాల్, రడపాక ఆండాళ్‌రాజ్, యెడ్ల కిషన్, తాళ్లపల్లి కిరణ్, ఇమ్మడి అవినాష్, హనుమకొండ స్నేహిత్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి

వరంగల్ కలర్చల్ నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన భద్రకాళి దేవాస్థానాన్ని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖామాత్యులు వాకిటి శ్రీహరి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజులు ఆదివారం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు ఓరుగంటి పూర్ణచందర్, భద్రకాళీశేషు, వేద పండితులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. ముందుగా ఆదిశంకరాచార్యులు, వల్లభగణపతి, దర్శించుకొని అనంతరం అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ అనంతరం ఆలయ మండలంలో అర్చకులు, వేదపండితులు మహాదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేష వస్త్రములు బహూకరించారు. వారివెంట కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, తహసీల్దార్ రవీందర్, మట్వాడ సీ.ఐ. కరుణాకర్ తదితరులున్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

మంత్రి వాకిటి శ్రీహరికి వినతిపత్రం


మంత్రి శ్రీహరికి వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేయూలో నెలకొన్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ, యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వ శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఆరెగంటి నాగరాజు గౌడ్ విన్నవించారు. ఆదివారం కేయూ జేఏసీ నేతృత్వంలో కేయూ గ్రౌండ్‌లో 11వ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిష్ 2025-26 ప్రారంభోత్సవాలకు విచ్చేసిన మంత్రి శ్రీహరిని కలిసి వినతిపత్రాన్ని అందచేసి మాట్లాడారు. ఓయూ తరహాలో కేయూలో విద్యార్థులు వ్యాయమం చేసుకునేలా సింథటిక్ ట్రాక్, ఓపెన్‌జిమ్, స్విమ్మింగ్ పూల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. వర్సిటీ గ్రౌండ్‌కు ఇరువైపులా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. స్పోర్ట్స్ హాస్టల్ విద్యార్థులకు నూతన హాస్టల్ భవనాన్ని నిర్మించేందుకు నిధులు ఇప్పించాలని కోరారు. దీనికి మంత్రి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుల సానుకూలంగా స్పందించినట్లు జేఏసీ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కోఆర్డినేటర్ డి.తిరుపతి, కన్వీనర్ కందికొండ తిరుపతి, వైస్‌చైర్మన్ కేతపాక ప్రసాద్, జేఏసీ నాయకులు అన్వేశ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

రాష్ట్రవ్యాప్తంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరెగంటి నాగరాజుగౌడ్ కోరారు. ఆదివారం రాష్ట్ర మంత్రి వాకాటి శ్రీహరిని కలిసి బీసీ రిజర్వేషన్లపై వినతి పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్క ఆకును వెంటనే తొలగించాలి

వడ్డెపల్లి : హనుమకొండ పట్టణ పరిధిలోని వడ్డెపల్లి చెరువులో ఏపుగా పెరిగిన గుర్రపు డెక్క ఆకులను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలని మంత్రి వాకిటి శ్రీహరిని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్, ఫిషర్‌మెన్ కాంగ్రెస్ స్టేట్ డైరెక్టర్ మండల సమ్మయ్య ముదిరాజ్ తదితరులు కోరారు. హనుమకొండ రాంనగర్‌లోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో ఆదివారం మంత్రి శ్రీహరిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డెపల్లి చెరువులో గుర్రపు డెక్క ఆకు పెరిగిపోవడం వల్ల చెరువులోని నీరు కలుషితమై చేపలు ఎదగకపోవడంతో పాటు మృత్యువాత పడుతున్నాయని, దీంతో మత్స్య వృత్తిపై ఆధార పడిన మత్స్యకారులు ఉపాధి కోల్పో తున్నారని అన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి గుర్రపు డెక్క ఆకును తొలగించడంతో పాటు మత్స్యకారులకు అధునాతన పరికరాలు అందించాలని కోరారు. మంత్రికి వినతిపత్రం సమర్పించినవారిలో మెపా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పులి రాజేశ్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం నేతలు పొన్నం రాజు, మట్టపల్లి సాంబయ్య, కేశబోయిన కోటేశ్వర్‌రావు, సదయ్య, సారయ్య, శంకర్, సాధినేని శివాజీ ముదిరాజ్‌లు ఉన్నారు.

చెరువుల పరిరక్షణ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న దశరథం

వడ్డెపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ మండలంలోని చెరువుల పరిరక్షణ కోసం కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ప్రముఖ పర్యావరణవేత్త తుపాకుల దశరథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండ 56వ డివిజన్ వివేక్ నగర్‌కాలనీలో ఆదివారం కాలనీ అధ్యక్షుడు మర్రి ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అక్టోబరు 30న వచ్చిన వరదల విధ్వంసంతో గోపాలపూర్ ఊర చెరువు వరదతో పరిసరాల్లోని పది కాలనీలు దెబ్బతిన్నాయన్నారు. గోపాల్‌పూర్ చెరువు మత్తడి ప్రాంతంలో నిర్మించిన డక్ట్‌కు అమర్చిన భారీ గేట్లను తుఫాన్ సందర్భంగా ఎత్తివేయలేదని పేర్కొన్నారు. దీంతో వరద ఉధృతి పెరిగి చెరువు కట్ట తెగిపోయి వివేక్‌నగర్, అమరావతి నగర్, టీఎన్‌జీవోస్ కాలనీ, సమ్మయ్యనగర్, టీవీ టవర్‌కాలనీ, ప్రగతినగర్ కాలనీ, ద్వారక సాయికాలనీ, జవహర్‌కాలనీ ప్రాంతాలు నీట మునిగి ప్రజలు భారీ మొత్తంలో నష్టపోయారని ఆరోపించారు. లేక్ ప్రొటక్షన్ కమిటీ కన్వీనర్ అయిన జీడబ్ల్యుఎంసీ కమిషనర్ ఈ వరద విధ్వంసానికి బాధ్యత వహించాలని దశరథం డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివేక్‌నగర్ కాలనీ కార్యదర్శి మీసాల రమేష్, వివిధ కాలనీల ప్రతినిధులు లింగంపల్లి వేణుగోపాలరావు, బుర్ర విజయపాల్, బత్తిని సుదర్శన్ గౌడ్, బూరనారాయణ, పింగిళి అశోక్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

జన్మదిన వేడుకలు

హనుమకొండ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలను ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కార్పొరేటర్ సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్ మేకల బాబురావు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సోదా కిరణ్ మాట్లాడుతూ.. ఐపీఎస్ అధికారిగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పోలీస్ విభాగం ద్వారా రాష్ట్రానికి ఎంతో సేవ చేశారని అన్నారు. కేసీఆర్ హయాంలో గురుకులాల అభివృద్ధికి విశేషమైన కృషి చేశారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి వెన్నెముకగా ఉండి ప్రజల సమస్యలపై పార్టీ తరపున పోరాడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌లు కుసుమ లక్ష్మీనారాయణ, జోరిక రమేష్, సల్వాజీ రవీందర్‌రావు, ఆర్‌కే నరేంద్ర, సూరాసి మహేష్ తదితరులు పాల్గొన్నారు.


అన్నం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సొసైటీ సభ్యులు

సత్యసాయిబాబా జయంతి వేడుకలు

కాజీపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు ఆదివారం కాజీపేటలో ఘనంగా జరిగాయి. సత్యసాయి ఫ్రెండ్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కేక్‌కట్ చేశారు. పేదలకు దుప్పట్లు, ఆహార ప్యాకెట్లు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పి.సూర్యారావు, ఎస్. వెంకటమ్మ, టి. సురేశ్, డి. దేవ ప్రియ, జి.కేశవ, టి.శ్రీధర్, ఎ.వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హాఫ్ మారథాన్‌లో కూరపాటి వైద్యులు

వరంగల్ మెడికల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ట్రై సిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన హాఫ్ మారథాన్‌లో కూరపాటి హాస్పిటల్ అధినేత డాక్టర్ కూరపాటి రమేశ్, వైద్యుల బృందం పాల్గొంది. ఈ సందర్భంగా డాక్టర్ రమేశ్ మాట్లాడుతూ.. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచడమే ప్రధాన లక్ష్యంగా ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ ట్రైసిటీ మారథాన్‌ను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.



మారథాన్‌లో పాల్గొన్న డాక్టర్ కూరపాటి రమేశ్ తదితరులు

మూతపడ్డ ఈత కొలను

» పూర్తికాని సుందరీకరణ పనులు
» నత్తనడకన కొనసా..గుతున్న మరమ్మతులు
» కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనుల్లో జాప్యం
» ఇబ్బందులు పడుతున్న స్విమ్మర్లు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్విమ్మింగ్‌పూల్ సుందరీకరణ, మరమ్మతు పనులు నత్తనడకన కొనసా..గుతున్నాయి. హైదరాబాద్ తరహాలో అత్యంత అధునాతన హంగులు కలిగిన ఇక్కడి డీఎస్ఏ స్విమ్మింగ్‌పూల్.. చాలా కాలంగా మూత పడిఉండడంతో నగర ప్రజలు నిర్వాహకుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హనుమకొండ బాలసముద్రంలో రాష్ట్ర, జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల నిర్వహణకు అనుకూలంగా ఉండే పూల్ అధికారుల నిర్లక్ష్యంతో ఎవ్వరికీ కాకుండా పోతోంది. నగర ప్రజలు, ప్రొఫెషనల్ స్విమ్మర్లు నిత్యం సాధన చేసే స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులు ఎవ్వరికీ పట్టనట్టు వ్యవహరిస్తుండడంతో క్రీడాకారులకు శాపంగా మారింది. ఇక్కడి బేబీపూల్, మినీ బేబీపూల్, బిగ్‌పూల్‌లు స్విమ్మర్లకు అందుబాటులో ఉండే విధంగా కేటాయించారు. కొంత కాలంగా మినీ బేబీపూల్, బిగ్‌పూల్ మాత్రమే స్విమ్మర్లకు అందుబాటులో ఉన్నాయి. మినీ బేబీ పూల్ నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకొని చెత్త చెదారంతో నిండిపోయింది.

పూల్‌కు ప్రత్యేక ఆదరణ

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పలు ప్రైవేటు స్విమ్మింగ్‌పూల్‌లు ఉన్నప్పటికీ డీఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ స్విమ్మింగ్‌పూల్‌కు పెద్ద ఎత్తున ఆదరణ ఉంది. వేసవికాలం వచ్చిందంటే చిన్నా పెద్ద, అనే భేదం లేకుండా స్విమ్మింగ్ చేయడానికి బారులు తీరుతారు. అయితే పూల్‌లో పేరుకుపోయిన సమస్యలను సీనియర్, వెటరన్ స్విమ్మర్లు గతంలో ఇక్కడ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన ప్రావీణ్య దృష్టికి తీసుకుపోయారు. దీంతో ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి పూల్ మరమ్మతు పనుల కోసం టెండర్లను అహ్వానించమని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఏప్రిల్ నెలలో డీఏఎస్ఏ నిధులు నుంచి రూ.41లక్షల అంచనా వ్యయంతో స్విమ్మింగ్‌పూల్ మరమ్మతు, ఇతర అభివృద్ధి పనులకు టెండర్లను పిలిచారు. టీజీడబ్ల్యూఐడీసీ శాఖ, ఇంజనీరింగ్ అధికారులు టెండర్ల ద్వారా గత ఏప్రిల్ నెలలో పలు అభివృద్ధి పనులు, సుందరీకరణ పూర్తి చేసేందుకు ఓ కాంట్రాక్టర్‌కు టెండరు అప్పగించారు. రెండు మూడు నెలల్లో మరమ్మతులు, ఇతర వసతులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే సుందరీకరణ పనులు చేపట్టి ఏడు నెలల గడుస్తున్నా.. పూర్తిచేయకపోవడంతో స్విమ్మర్లు ఇబ్బందులు పడుతున్నారు. స్విమ్మింగ్‌పూల్‌కు కొందరు ఈత ప్రేమికులు పే అండ్ ప్లే పద్ధతిన డీఎస్ఏకు డబ్బులు చెల్లిస్తూ రోజువారిగా సాధన చేస్తుంటారు. ప్రస్తుతం స్విమ్మింగ్ పూల్ పనులు పూర్తి కాకపోవడంతో డీఎస్ఏకు ఫీజులు రూపంలో అందాల్సిన డబ్బులు ఆగిపోయాయి.


చెత్తా చెదారంతో నిండి ఉన్న బేబి స్విమ్మింగ్ పూల్

ఎమ్మెల్యే, అధికారుల ఆదేశాలు బేఖాతరు

గతంలో స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్విమ్మింగ్‌పూల్ మరమ్మతు పనులను పర్యవేక్షించి కాంట్రాక్టర్‌తో పాటు సంబంధిత అధికారులను పనులను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే మాటలను బేఖాతరు చేసి పనుల్లో అలసత్వం వహిస్తున్న కాంట్రాక్టర్‌ను అధికారులు అప్రమత్తం చేయాల్సి ఉంది. ఇప్పటికైనా స్విమ్మింగ్‌పూల్ మరమ్మతు పనులను త్వరితగతి పూర్తి చేసి పూల్ అందుబాటులోకి తీసుకురావాలని పలువురు స్విమ్మర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.


అస్తవ్యస్తంగా ఉన్న ఈత కొలనుకు వెళ్లే ప్రధాన ద్వారం

స్విమ్మింగ్‌పూల్ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

ప్రతాపగిరి బద్రినాథ్, సీనియర్ స్విమ్మర్ వరంగల్



బాలసముద్రంలో స్విమ్మింగ్‌పూల్ ప్రారంభమైన రోజు నుంచి 20 ఏళ్లుగా స్విమ్మింగ్‌కు వస్తున్నా. స్విమ్మింగ్‌పూల్‌లో సమస్యలు ఉన్నాయని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకపోగా.. స్పందించిన అధికారులు మరమ్మతు పనులను గత ఏప్రిల్‌లో కాంట్రాక్టర్‌కు అప్పగించారు. 2, 3 నెలల్లో మరమ్మతు పనులు పూర్తి చేయాల్సిన కాంట్రాక్టర్.. పనులు చేపట్టకపోవడంతో స్విమ్మింగ్‌పూల్ అందుబాటులోకి రాక స్విమ్మర్లు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పూల్‌ను సందర్శించి అభివృద్ధి పనుల్లో వేగం పెంచేలా చర్యలు చేపట్టాలి.

నాజిల్స్ అందుబాటులో లేక జాప్యం

రవీందర్, టీజీఈడబ్ల్యూఐడీసీ డీఈ హనుమకొండ

స్విమ్మింగ్‌పూల్ సుందరీకరణలో భాగంగా నూతనంగా మోటార్లు, పైప్‌లైన్ల నిర్మాణంతో పాటు సివిల్ పనులు ఇప్పటికే పూర్తి చేశాం. పూల్‌కు ఉపయోగించే బోర్ నీటిని ఫిల్టర్ ద్వారా శుద్ధి చేసి స్వచ్ఛమైన నీరుగా మార్చే (నాజిల్స్) పరికరాలు హైదరాబాద్ నుంచి తెప్పించే క్రమంలో జాప్యం జరుగుతోంది. ఇది డీఎస్ఏ అధికారులు, స్విమ్మింగ్ పూల్ టెక్నీషియన్ల పర్యవేక్షణలో అమర్చాలి. ఇతర చిన్న చిన్న సమస్యలుంటే వాటిని సరిచేసి, నాజిల్స్ బిగించిన వారంలోగా స్విమ్మింగ్‌పూల్‌ను అందుబాటులోకి తీసుకువస్తాం.

నవ్య
కుటుంబ కదంబం
సోమవారం
24 నవంబరు 2025



అమ్మలు ఒక్కటై బడి కట్టారు

బాలభారతి... వేల మంది మహిళల శ్రమ ఫలితం. కార్పొరేట్ బడుల్లో పిల్లలను చదివించే స్థోమతలేని తల్లులు చిన్నస్థాయిలో ప్రారంభించిన ఈ పాఠశాల... నేడు ఏడు ఎకరాల్లో, మూడు అంతస్తుల్లో, అధునాతన సౌకర్యాలతో పేద విద్యార్థుల్లో విజ్ఞాన జ్యోతులు వెలిగిస్తోంది. ఇది కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పొదుపు మహిళల విజయ గాథ. వారికి ఆ సంఘం గౌరవ సలహాదారు విజయభారతి అడుగడుగునా ప్రేరణగా నిలుస్తున్నారు.

అది 1995. నెల్లూరు జిల్లా ఉదయగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్న విజయభారతి...యూఎన్‌డీపీ ప్రాజెక్టు ఆఫీసరుగా కర్నూలు జిల్లా ఓర్వకల్లులో అడుగు పెట్టారు. దక్షిణాసియాలో పేదరిక నిర్మూలన కోసం ఐక్యరాజ్య సమితి చేపట్టిన ప్రాజెక్ట్‌లో భాగంగా అక్కడ కార్యక్రమాలు ప్రారంభించారు. ఆమె నేతృత్వంలో కాల్వ, ఉశేనాపురం గ్రామాల్లో మహిళా పొదుపు సంఘాలు ఏర్పడ్డాయి. వారు ఆర్థికంగా ఒక్కొక్క మెట్టు ఎదుగుతూ ఉండడంతో... ఆ స్ఫూర్తి మరో 25 గ్రామాలకు విస్తరించింది. ఆ సంఘాల సభ్యులు ఓ వైపు ఆర్థిక ప్రగతితో పాటు సంఘాలను బలోపేతం చేసుకోవడం, ఇతర సామాజిక అంశాల మీద దృష్టి పెట్టారు. 1998లో 'ఓర్వకల్లు మండలం పొదుపు లక్ష్మి ఐక్య సంఘం' ఏర్పాటు చేసుకున్నారు. దానికి ప్రభుత్వ కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్, యూఎన్‌డీపీ ప్రాజెక్టు సీడ్ క్యాపిటల్ కింద రూ.1.50 కోట్ల నిధి సమకూరింది. సంఘం సభ్యులే సొంతంగా మహిళా బ్యాంకును ఏర్పాటు చేసుకున్నారు. దానికి కేంద్ర ప్రభుత్వం నేషనల్ రిసోర్స్ ఆర్గనైజేషన్ (ఎన్ఆర్) హోదా కల్పించి వారికి మరింత చేయూత ఇచ్చింది. వారు ఆర్థికంగా ఎదుగుతున్నా.. రిసోర్స్ పర్సన్స్ (ఆర్‌పీ)గా రాష్ట్రాలు చుట్టేస్తున్నా... బ్యాంకులకు వెళ్లి నగదు జమ, విత్‌డ్రా చేయాలంటే ఫారాలు పూరించడానికి మరొకరి సాయం తీసుకోవాల్సి వచ్చేది. అందుకు ప్రధాన కారణం నిరక్షరాస్యతే. దాన్ని వారు అవమానంగా భావించారు. 'ఇదే పరిస్థితి మన పిల్లలకు ఎదురైతే?' అనే వేదన వారిని వేధించేది.

సందేహాలను దాటి...

ఆ ప్రాంతంలో పేద కుటుంబాలు పిల్లలను పొలం పనులకు పంపడంతో వారి భవిష్యత్తు నాశనమవుతోంది. ఈ అంశాన్ని ఐక్య సంఘం సమావేశంలో చర్చకు పెట్టారు విజయభారతి. "మన పిల్లలను మనమే చదివించుకుందాం" అని ప్రతిపాదన చేశారు. 'అది సాధ్యమయ్యే పనేనా?' అనే ప్రశ్నలు తలెత్తాయి. ఆమె వారిలో ఆత్మస్థైర్యం నింపారు. ముందుగా కాల్వబుగ్గ గ్రామ పాఠశాలలో వంద మంది పిల్లలతో 'సమ్మర్ క్యాంప్' నిర్వహించారు. దానికి గ్రామ మహిళలు స్వచ్ఛందంగా వంట సరుకులు, సామాగ్రి సమకూర్చారు. వంతులవారీగా పనులు చేశారు. ఆ సమయంలో ప్రపంచ బ్యాంక్ సౌత్ ఆసియా రీజియన్ వైస్ ప్రెసిడెంట్ అనంతపురానికి వెళుతూ... ఆ సమ్మర్ క్యాంప్ చూశారు. యూఎన్‌డీపీ కింద ప్రతి మండలంలో చైల్డ్ లేబర్ క్యాంపుల నిర్వహణకు నిధులు ఇవ్వాలని ఆమె చేసిన ప్రతిపాదనతో 'భవిత బాల కార్మికుల పాఠశాల' ఏర్పాటుకు పునాది పడింది. ఏడాదికి 200-300 మంది చొప్పున ఏడెనిమిదేళ్లలో రెండువేల మంది బాల కార్మికులను విద్యావంతులుగానే కాకుండా జీవితంలో స్థిరపడేలా తీర్చిదిద్దారు. సామాజిక స్ఫూర్తితో మహిళలు సాధించిన తొలి విజయం అది.

ఎందరో హేళన చేశారు...

ఈ క్రమంలోనే... తమ పిల్లల చదువు కోసం 2008లో ఓ చిన్న గదిలో 150 మంది విద్యార్థులతో సంఘం సభ్యులు పాఠశాల ప్రారంభించారు. పొదుపు మహిళలందరినీ ఏకతాటిపైకి తెచ్చి ప్రోత్సహించిన విజయభారతి పేరు వచ్చేలా 'బాల భారతి పాఠశాల' అని దానికి పేరు పెట్టారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా బడి భవనం నిర్మించాలని సంకల్పించారు. వరల్డ్ బ్యాంక్ కన్సల్టెంట్‌గా ఇతర దేశాలకు వెళ్లడం ద్వారా వచ్చిన పారితోషికంతో విజయభారతి నాలుగు ఎకరాలు, పొదుపు సంఘాల మహిళలు మూడు ఎకరాలు కొనుగోలు చేసి ఆ పాఠశాలకు ఇచ్చారు. ఏడు ఎకరాల్లో అధునాత సౌకర్యాలతో పాఠశాల నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వడ్డీల రూపంలో వచ్చిన డబ్బును, రిసోర్స్ పర్సన్లుగా ఇతర రాష్ట్రాలకు వెళ్లడం వల్ల వచ్చిన పారితోషికంలో కొంత వాటాను ఇచ్చి... అవసరమైన నిధులు సమకూర్చుకున్నారు. పొదుపు మహిళలే కూలీలుగా, మేస్త్రీలుగా మారిపోయారు. ఒక్క రూపాయి కూలీ ఆశించకుండా బడి స్థలంలోనే గుడారాలు వేసుకొని వంతులవారీగా శ్రమదానం చేశారు. ఒక దశలో మధ్యలో పనులు ఆగిపోతే... "ఆడవాళ్లేమిటి... స్కూల్ కట్టడమేమిటి? కోటీశ్వరులకే చేతకాలేదు. కార్పొరేట్ స్కూళ్లకు అమ్మేయండి. డబ్బులైనా వస్తాయి" అంటూ ఎందరో హేళన చేశారు. అయినా వారిలో ఆత్మస్థైర్యం సడలలేదు. పది వేల మందికిపైగా మహిళలు... దాదాపు పదేళ్లు శ్రమించారు. అత్యద్భుతమైన పాఠశాల భవనం నిర్మించుకున్నారు. 2017లో రెండు అంతస్తులు పూర్తి చేశారు. అప్పటి సీఎం చంద్రబాబునాయుడు దాన్ని ప్రారంభించారు.

వారి పట్టుదలకు నిదర్శనం...

సెమీ రెసిడెన్షియల్ స్కూల్ తరహాలో నడుస్తున్న ఈ పాఠశాలలో ప్రస్తుతం మూడు అంతస్తుల్లో 42 తరగతి గదులు, ఏడు హాల్స్ ఉన్నాయి. డిజిటల్ క్లాస్ రూమ్స్, లైబ్రరీ, కంప్యూటర్ శిక్షణ హాల్, సైన్స్ ల్యాబ్, కాన్ఫరెన్స్ హాల్ సహా ఆఫీసు, ప్రిన్సిపల్ గది, ఎంఎంఎస్ గది, స్పోర్ట్స్ రూమ్, ఉపాధ్యాయుల గదులు, సువిశాలమైన ఆట స్థలం, ఆట వస్తువులు... ఇలా అధునాతన, సాంకేతిక సదుపాయాలు సమకూర్చుకున్నారు. ఇక్కడ నర్సరీ నుంచి 10వ తరగతి వరకూ 1,070 మంది బాలబాలికలు విద్యాభ్యాసం చేస్తున్నారు. పాఠశాల నిర్వహణ బాధ్యతలు పూర్తిగా మహిళలే నిర్వహిస్తారు. గ్రామాఖ్య సంఘాలు, ఓర్వకల్లు మండల పొదుపు లక్ష్మి ఐక్య సంఘంలో చురుకుగా పని చేస్తున్న ఐదుగురు మహిళలను 'ఎడ్యుకేషన్ కమిటీ' సభ్యులుగా ఎన్నుకుంటారు. ఆ కమిటీ రెండేళ్లు పని చేస్తుంది. అలాగే 1,070 మంది విద్యార్థులకు శ్రీబాల ట్రస్ట్ వ్యవస్థాపకుడు శ్రీనివాసరావు సహకారంతో పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనం అదిస్తున్నారు. అలాగే 1,250 పొదుపు సంఘాలు సభ్యుల నేతృత్వంలో విద్యార్థులకు స్నాక్స్ సమకూరుస్తున్నారు. ఒకప్పుడు "మీకు ఇది సాధ్యం కాదు" అని హేళన చేసినవారే... తమ పిల్లల సీట్ల కోసం అభ్యర్థించే స్థాయికి ఈ పాఠశాలను తీసుకువెళ్లడం ఈ పొదుపు మహిళల కృషికి, పట్టుదలకు నిదర్శనం. వారిని విజయభారతి వెన్నంటి ఉండి నడిపిస్తున్నారు. అందరూ ఆమెను 'అమ్మ' అని ఆప్యాయంగా పిలుచుకుంటారు.

• గోరంట్ల కొండప్ప, కర్నూలు,
ఫొటోలు: ఎస్ఎండీ రఫీ

స్త్రీశక్తి సమష్టి విజయం



మా గురువుగారైన ఐఏఎస్ అధికారి రాజు నెల్లూరు కలెక్టర్‌గా పని చేసే సమయంలో... ఆయన ప్రేరణతోనే సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమం రిసోర్స్ పర్సన్‌గా వెళ్లాను. "డబ్బు లేకపోవడం ఒక్కటే పేదరికానికి కారణం కాదు. సామాజిక సమానత్వం వచ్చినప్పుడే పేదరిక నిర్మూలన సాధ్యం" అని ఆయన పదేపదే చెప్పేవారు. ఆ స్ఫూర్తితో పొదుపు ఉద్యమంలో మహిళలను భాగస్వామ్యం చేశాం. సామాజిక సమస్యలపై పోరాడే తత్వం వారిలో పెంచగలిగాం. ఆ ప్రేరణతో డ్వాక్రా మహిళలు తమ పిల్లల భవిష్యత్తు కోసం తామే కార్పొరేట్‌కు దీటుగా అద్భుతమైన ఓ పాఠశాలను నిర్మించడమే కాదు, నిర్వహించే స్థాయికి ఎదిగారు. పాఠశాల ఎడ్యుకేషన్ కమిటీ సారథులు అందరూ మహిళలే. వారిలో అక్షరం విలువ తెలిసిన నిరక్షరాస్యులు కూడా ఉన్నారు. స్త్రీశక్తి సాధించిన సమిష్టి విజయం ఇది. 1995లో ఓర్వకల్లు మండలంలో వలసలు, బాలకార్మికులు, బాల్యవివాహాలు, నిరాక్షరాస్యత, మహిళలపై హింస... ఇలాంటి సమస్యలు అధికంగా ఉండేవి. పదో తరగతి చదివిన మహిళలు 5 శాతం కూడా లేరు. తమ పిల్లలనైనా బడికి పంపి ఉన్నతంగా చదివించాలనే వారి ఆలోచనే అద్భుతమైన పాఠశాల నిర్మాణానికి బీజం వేసింది. తక్కువ ఫీజులతో వేలాది మంది పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం వెనుక మహిళల పదేళ్ల శ్రమ ఉంది.

\- బత్తుల విజయభారతి



ఇలా చేస్తే దురద తగ్గుతుంది..!

శీతాకాలంలో వీచే చల్లటి గాలుల వల్ల చర్మం పొడిబారి దురద మొదలవుతుంది. చిన్నపాటి జాగ్రత్తలతో ఈ సమస్యను నివారించుకోవచ్చు.

- చలిగా ఉందంటూ వేడివేడి నీళ్లతో స్నానం చేయకూడదు. స్నానానికి గోరువెచ్చని నీటిని మాత్రమే ఉపయోగించాలి. అలాగే గ్లిజరిన్ సోప్‌ను వాడితే ప్రయోజనం ఉంటుంది.
- చర్మం మీద పేరుకున్న మురికిని తొలగించడంలో ఓట్‌మీల్ ప్రభావవంతంగా పనిచేస్తుంది. స్నానం చేసే నీటిలో కొద్దిగా ఓట్‌మీల్ కలుపుకోవడం మంచిది. లేదంటే దురద అనిపించిన చోట కొద్దిగా ఓట్‌మీల్ పేస్ట్ రాసి ఆరిన తరువాత చేతి వేళ్లతో రుద్దితే సరిపోతుంది.
- స్నానం చేసిన తరువాత ఒళ్లంతా కొద్దిగా కొబ్బరినూనె లేదా బాదం నూనె రాసుకుంటే సమస్య తీరుతుంది. దురదగా అనిపించిన చోట కలబంద జెల్ లేదా షియా బటర్‌తో మసాజ్ చేసినా ఫలితం ఉంటుంది.
- చిన్న గిన్నెలో అయిదు చెంచాల కొబ్బరినూనె, మూడు చెంచాల మింట్ ఆయిల్(పుదీనా నూనె) వేసి బాగా కలపాలి. రాత్రి పడుకునేముందు ఒళ్లంతా ఈ నూనె రాసుకుని ఉదయాన్నే గోరువెచ్చని నీటితో స్నానం చేస్తే చర్మం తేమతో నిండి మృదువుగా మారుతుంది. దురద కూడా తగ్గుతుంది.
- చిన్న గిన్నెలో రెండు చెంచాల యాపిల్ సైడర్ వెనిగర్ వేసి ఒక చెంచా నీళ్ల చిలకరించి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని దురద ఎక్కువగా ఉన్నచోట రాసి పది నిమిషాల తరువాత నీటితో శుభ్రం చేసుకోవాలి. దురద వెంటనే తగ్గుతుంది.
- యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే బ్లూ బెర్రీ, టమాటా, కేరట్, బీన్స్, బఠానీలు, పప్పు దినుసులు, చేపలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. అల్లం, దాల్చినచెక్క, మిరియాలు లాంటి దినుసులతో తయారుచేసిన హెర్బల్ టీలు తాగడం వల్ల శరీరంలో రక్తప్రసరణ సజావుగా జరిగి దురద సమస్య తగ్గుతుంది.

జుట్టు పల్చబడుతోందా..?

మానసిక అశాంతి, అధిక ఒత్తిడి, పోషకాహార లోపం, హార్మోన్ల అసమతుల్యత, చుండ్రు లాంటి సమస్యల వల్ల జుట్టు పల్చబడుతుంది. జుట్టు రాలడం తగ్గి ఒత్తుగా పెరగడానికి పాటించాల్సిన ఇంటి చిట్కాలు ఇవే...

- చిన్న గిన్నెలో అయిదు చెంచాల భృంగరాజ్ తైలం తీసుకుని కొద్దిగా వేడి చేయాలి. అందులో మూడు చెంచాల ఉసిరి రసం లేదా ఉసిరి నూనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని రాత్రి పడుకునేముందు మాడుకు పట్టించి ఉదయాన్నే గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే జుట్టు రాలడం తగ్గుతుంది.



- ఒక గిన్నెలో షికాకాయ పేస్టు, కుంకుడుకాయ పేస్టులను సమపాళ్లలో తీసుకుని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని శిరోజాల కుదుళ్లకు పట్టించి అరగంటసేపు ఆరనివ్వాలి. తరువాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. తలస్నానానికి షాంపూ వాడకూడదు. ఇలా తరచూ చేస్తూ ఉంటే మంచి ఫలితం కనిపిస్తుంది.
- ఒక గ్లాసు నీటిలో నాలుగు చెంచాల మెంతులు వేసి రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే పేస్టులా చేయాలి. అందులో రెండు చెంచాల మందారం పూల పొడి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మాడుకు పట్టించి అరగంట తరువాత తలస్నానం చేస్తే జుట్టు ఆరోగ్యంగా ఒత్తుగా పెరుగుతుంది.
- రెండు గుప్పెళ్ల వేపాకులు, గుప్పెడు కరివేపాకును తీసుకుని కొన్ని నీళ్ల చిలకరించి మెత్తటి పేస్టులా చేయాలి. దీన్ని తలంతా పట్టించి అరగంట తరువాత తలస్నానం చేయాలి. వారానికి రెండుసార్లు ఇలా చేస్తూ ఉంటే జుట్టు చక్కగా పెరుగుతుంది.
- కలబంద గుజ్జులో ఓట్స్ పొడి, అరటి పండు గుజ్జులో పెరుగు, గంధం పొడిలో గులాబీ నీళ్ల కలిపిన మిశ్రమాల్లో ఒకదాన్ని శిరోజాల కుదుళ్లకు పట్టించి ఆపైన తలస్నానం చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.
- వారానికి రెండుసార్లు.. ఆముదం, కొబ్బరి నూనె, బాదం నూనె, టీ ట్రీ నూనె, ఆలివ్ నూనెల్లో ఒకదాన్ని తీసుకుని కొద్దిగా వేడిచేసి తలంతా మర్దన చేసినా సమస్య తీరుతుంది. ఉసిరి నూనె, మందారం నూనె, గోరింటాకు నూనెలను తరచూ తలకు రాసుకుంటూ ఉంటే జుట్టు కుదుళ్ల బలోపేతమవుతాయి.



ఒకప్పుడు భయంతో తరగతి గది దాటని అమ్మాయి... ఇప్పుడు వేదికలెక్కి ప్రసంగిస్తోంది. అంతర్జాలాన్నే అభ్యాస కేంద్రంగా మలుచుకొని... ఆ విజ్ఞానాన్ని తోటి విద్యార్థులకు పంచుతోంది. కేవలం పాఠ్యాంశాలకే పరిమితమైపోకుండా... అధునాతన సాంకేతికతపై అవగాహన కల్పిస్తోంది. సమష్టి స్ఫూర్తి నింపి... సృజనకు పదును పెట్టి... ఆత్మవిశ్వాసాన్ని నింపుతోంది. 'లీడ్' కార్యక్రమాల స్ఫూర్తితో అందుకోసం 'ఏక్ లక్ష్యా' పేరున సొంతంగా ఒక వేదిక సైతం రూపొందించిన పదో తరగతి విద్యార్థిని కుష్బూ జైన్... 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి.

ఒకటే లక్ష్యం మార్పు కోసం

"రోజూ బడికి వెళతాం. పాఠాలు వింటాం. మంచి మార్కులూ తెచ్చుకొంటాం. కానీ అంతటితో ఆగిపోతే జెట్ వేగంతో దూసుకుపోతున్న నేటి ప్రపంచంలో వెనకబడిపోతాం. సృజనాత్మకంగా ఆలోచించాలి. ఎవరికివారుగా కాకుండా జట్టుగా కలిసి పని చేయడం అలవర్చుకోవాలి. సాంకేతిక నైపుణ్యాన్ని పెంచుకోవాలి. నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలి. ఎందుకంటే బాల్యంలో బలమైన పునాది పడితేనే భవిష్యత్తులో ఆత్మవిశ్వాసంతో అడుగులు వేయగలుగుతాం. అనుకున్నది సాధించగలుగుతాం. ఆ ఉద్దేశంతోనే 'ఏక్ లక్ష్యా' అనే లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌ను తీసుకువచ్చాను. ఇది ఒక వెబ్‌సైట్. దీనిద్వారా విద్యార్థుల్లో ఉన్న భయాన్ని, బెరుకును పోగొట్టి, ఇరవై ఒకటో శతాబ్దపు నైపుణ్యాలను పరిచయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాను. నాకు ఈ ఆలోచన రావడానికి కారణం... మా పాఠశాలలో 'లీడ్ స్కూల్' నిర్వహించిన కార్యక్రమాలు. ప్రస్తుతం నేను కడప 'నాగార్జున మోడల్ స్కూల్'లో పదో తరగతి చదువుతున్నా. మాది రాజస్థాన్ అయినా నలభై ఏళ్ల కిందట మా తాతగారు ఇక్కడకు వచ్చి స్థిరపడ్డారు. మా నాన్నకు కడపలో ఎలక్ట్రికల్ షాపు ఉంది. అమ్మ గృహిణి. తనే నాకు మార్గదర్శి, స్ఫూర్తి.

మూస పద్ధతి నుంచి...

మొదట్లో నేను కూడా చాలా బిడియస్తురాలిని. తరగతి గదిలో సందేహాలు అడగాలన్నా, నలుగురిలో మాట్లాడాలన్నా, వేదికపైకి వెళ్లాలన్నా భయపడేదాన్ని. అయితే కరోనా తరువాత నా జీవితంలో ఊహించని మార్పులు చోటు చేసుకున్నాయి. నేను ఆరో తరగతిలో ఉండగా మా పాఠశాలకు 'లీడ్ స్కూల్'వారు వచ్చారు. వేదికపైకి పిలిచి నచ్చిన అంశంపై అందరి ముందూ మాట్లాడించారు. బృంద చర్చలు పెట్టారు. కలిసికట్టుగా ప్రాజెక్టులు చేయడం నేర్పించారు. మాలో ఆలోచనాశక్తి పెంచేలా ప్రయోగాలు చేయించారు. అప్పటివరకు మేం బోర్డు మీద చూసి నేర్చుకొనేవాళ్లం. కానీ 'లీడ్' తరువాత మా స్కూల్లో మూస పద్ధతి పోయింది. తొలిసారి విజువల్ లెర్నింగ్ ప్రారంభమైంది. నాలో బెరుకు పోయింది. నిర్భయంగా ఎక్కడైనా, ఎంత పెద్ద వేదిక మీద నుంచైనా మాట్లాడటం అలవాటైంది. పాఠాలే కాకుండా చుట్టూవున్న వాటి గురించి కూడా ఆలోచించడం మొదలైంది.



వారిని చూసి...

నేనే కాదు... నా స్నేహితులు చాలామందిలో కూడా ఇలాంటి మార్పే గమనించాను. అదేసమయంలో నాకు నీతి ఆయోగ్ 'అటల్ ఇన్నోవేషన్ మిషన్' నిర్వహించే 'టింకర్‌ప్రెన్యూర్' గురించి తెలిసింది. ఇది విద్యార్థులకు ఇరవై ఒకటో శతాబ్దపు డిజిటల్ స్కిల్స్ నేర్పించి, ఆవిష్కరణలు, వ్యవస్థాపకత వైపు ప్రోత్సహించే జాతీయ స్థాయి కార్యక్రమం. అందులో భాగంగా మనం ఒక ప్రాజెక్ట్ రూపొందించాలి. ఆ ప్రాజెక్ట్ వినూత్నంగా ఉండాలి. సమాజంపై సానుకూల ప్రభావం చూపాలి. నాకు ఎంతో ఆసక్తిగా అనిపించి, రిజిస్టర్ చేసుకున్నా. అప్పటివరకు మొబైల్ ఆపరేటింగ్ కూడా సరిగ్గా తెలియని నేను... ఇంటర్నెట్‌లో శోధించడం మొదలుపెట్టాను. ఏఐ, చాట్ జీపీటీల సాయంతో డిజిటల్ స్కిల్స్ నేర్చుకున్నా. అలాగని చదువును అశ్రద్ధ చేయలేదు. ఎప్పుడూ నేను టాప్‌లోనే ఉంటాను.

ఇంకా ఎన్నో...

ఒకప్పుడు భయంతో వెనకడుగు వేసిన నేను ఇప్పుడు బడిలో జరిగే ప్రతి కార్యక్రమంలో ముందుంటున్నాను. మా స్కూల్ వెబ్‌సైట్ డిజైనింగ్ చేస్తున్నా. మంత్లీ న్యూస్‌లెటర్స్ సిద్ధం చేస్తున్నా. నేను రాసిన కొన్ని పుస్తకాలు 'అటల్ ఇన్నోవేషన్'లో భాగంగా 'టింకర్‌చాంప్స్' కార్యక్రమం ద్వారా తోటి విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇస్తున్నా. 'సీఎస్ఐఆర్-ఎన్ఏఎల్' బెంగళూరులో నిర్వహించిన ఏరోఫెస్ట్‌లో మా టీమ్ రూపొందించిన ప్రాజెక్ట్‌కు మొదటి బహుమతి వచ్చింది. జాతీయ స్థాయిలో జరిగిన ఈ ఫెస్ట్‌లో మేం ఎయిర్‌క్రాఫ్ట్ ప్రొపల్షన్‌పై పేపర్స్ సమర్పించాం. అలాగే 2023లో 'లీడ్ గ్రూప్' నిర్వహించిన 'యంగ్ లీడర్స్ ప్రోగ్రామ్'లో సోషల్‌మీడియా ట్రెండ్స్‌పై అధ్యయనం చేసే అవకాశం లభించింది. నా లక్ష్యం ఒక్కటే... పారిశ్రామికవేత్తగా ఎదగాలని. అప్పుడైతేనే మరికొంతమందికి ఉద్యోగ అవకాశాలు ఇవ్వగలుగుతాం.

తొలి ప్రయత్నం విఫలమైనా...

'టింకర్‌ప్రెన్యూర్' కార్యక్రమంలో పాల్గొన్న వారు రూపొందించిన ప్రాజెక్టుల నుంచి జాతీయ స్థాయిలో టాప్ 100 ఎంపిక చేస్తారు. దానికోసం 2022లో 'డిస్క్యూ' అనే ప్రొడక్ట్ ఒకటి తయారు చేశాను.

కరోనా వస్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఇంట్లో వేరేవారికి వైరస్ సోకకుండా ఎలా చూసుకోవాలి? అందుబాటులో ఉన్న ఇంటి చిట్కాలు ఏమిటి? తదితర సమాచారంతో దాన్ని రూపొందించాను. అయితే నా ప్రాజెక్ట్‌కు టాప్100లో చోటు దక్కలేదు. నిరాశచెందలేదు. ఎంపికైన వాటిని పరిశీలించి, ఇంకా ఏఏ అంశాల్లో మెరుగు అవ్వాలో తెలుసుకున్నా.

అనుకున్నది నెరవేరింది...

తొలి ప్రయత్నం విఫలవడంతో మరింత పట్టుదలతో మరుసటి ఏడాది 'టింకర్‌ప్రెన్యూర్'కు సన్నద్ధమయ్యా. కిరణ్‌కుమార్ సర్ మార్గదర్శకత్వంలో 'ఏక్ లక్ష్యా' పేరుతో ఒక ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫామ్ రూపొందించాను. ఆ పేరు మా అమ్మ పెట్టింది. 'ఏక లక్ష్యా' అంటే హిందీలో 'ఒకటే లక్ష్యం' అని. ఇది ఒక ఆన్‌లైన్ స్టోర్. మొదట పది ఇ-బుక్స్ పెట్టాను. తోటి విద్యార్థుల్లో ఆధునిక సాంకేతికత నైపుణ్యాన్ని పెంచడం, కొత్తగా ఆలోచించి, కలిసికట్టుగా పని చేసేలా ప్రోత్సహించడం, తద్వారా సమాజంలో మార్పు తేవడం ఈ వేదిక లక్ష్యం. ఈసారి 'టింకర్‌ప్రెన్యూర్' జాతీయ స్థాయి టాప్100లో నా ప్రొడక్ట్ చోటు దక్కించుకుంది. టాప్7గా నిలిచింది. ఇది నాకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. ఆత్మస్థైర్యాన్ని పెంచింది. ఈ స్ఫూర్తితో 'ఏక్ లక్ష్యా'ను మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దాలని అనుకున్నాను. ఇంకా ఏమేం ఉంటే బాగుంటుందనే దానిపై స్నేహితులు, మెంటార్స్‌తో చర్చిస్తున్నాను. పదో తరగతి పరీక్షలు అవ్వగానే ఆ పనిలోనే ఉంటాను."

• హనుమా

తాజాగా ఇలా

అరటి పండ్లను నిల్వ చేయడం కొద్దిగా కష్టమే. తెచ్చిన రెండు రోజుల్లోనే బాగా పండి తరువాత పాడైపోతుంటాయి. చిన్న చిట్కాలు పాటించి అరటి పండ్లను ఎక్కువ రోజులు తాజాగా ఉండేలా నిల్వ చేసుకోవచ్చు.


- వెడల్పాటి గిన్నెలో సగానికి పైగా నీళ్ల పోసి అందులో రెండు సి విటమిన్ మాత్రలు వేసి కరిగించాలి. ఈ నీటిలో అరటి పండ్లను ముంచి తీస్తే అవి వారంపాటు తాజాగా ఉంటాయి. పండ్లపై కొద్దిగా నిమ్మరసం రాసినా ఫలితం ఉంటుంది.
- అరటి పండ్ల త్వరగా పండటానికి కారణం కాడల నుంచి వెలువడే ఎథిలిన్ వాయువు. కాడలను ప్లాస్టిక్ కవర్ లేదా అల్యూమినియం ఫాయిల్‌తో చుట్టేస్తే అయిదు రోజులపాటు అరటి పండ్ల తాజాగా ఉంటాయి.
- అరటి పండ్లను గుత్తిగా ఉంచినట్లయితే వాటిలో ఒకటి పండినా మిగిలినవన్నీ వెంటనే మెత్తబడతాయి. కాబట్టి అరటి పండ్లను తెచ్చిన వెంటనే గుత్తి నుంచి విడదీయాలి. పండినవాటిని వేరేగా ఉంచాలి.
- అరటి పండ్లను తాడు సహాయంతో హ్యాంగర్‌కు వేలాడదీస్తే చాలారోజుల వరకు పాడవకుండా తాజాగా ఉంటాయి.
- అరటి పండ్లను పేపర్ బ్యాగ్‌లో ఉంచి వెలుతురు తగలకుండా భద్రపరిస్తే వారానికి పైగా నిల్వ ఉంటాయి.



పోషకాల ఖజానా

తామరగింజలను సేకరించి ఎండబెట్టి వేయించి మఖానాను తయారుచేస్తారు. దీనిలో ఎన్నో పోషకాలు ఉంటాయి. చలికాలంలో తినదగ్గ చిరుతిండి.

- మఖానాలో పీచుపదార్థాలు ఎక్కువ. తరచూ మఖానాను తినడంవల్ల జీర్ణసమస్యలు దూరమవుతాయి. మలబద్ధకం, కడుపు ఉబ్బరం, కడుపులో ఆమ్లత్వం లాంటి సమస్యలు తొలగిపోతాయి.
- వీటిలోని ప్రొటీన్ జీవక్రియలను వేగవంతం చేస్తుంది. అతిగా తినాలనే భావన తగ్గిస్తుంది. దీనిలో కేలరీలు కూడా తక్కువగా ఉంటాయి కాబట్టి శరీరం బరువు పెరగకుండా నియంత్రణలో ఉంటుంది.
- అల్పాహారంలో మఖానాను చేర్చుకుంటే శరీరానికి కావాల్సిన కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, ఐరన్, ఫాస్ఫరస్ లభిస్తాయి. దీంతో శరీరంలోని ఎముకలు బలోపేతమవుతాయి. కీళ్ల, కండరాల సమస్యలు తీరుతాయి.
- మఖానాలో గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువ. కాబట్టి దీన్ని మధుమేహం ఉన్నవారు తింటే రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది.
- మఖానాలో ఫ్లవనాయిడ్స్, యాంటీ ఆక్సిడెంట్లు, అమైనో ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో హార్మోన్ల సమతుల్యతను కాపాడతాయి. మహిళల్లో ల్యుకోరియా, రుతు సమస్యలను నివారిస్తాయి.



దిక్సూచి

చదివిన కోర్సులో సాధించిన సీజీపీఏకు మించి విద్యార్థి ఏమి చేయగలడని హైరింగ్ కంపెనీలు చూస్తున్నాయి. కోర్సులో భాగంగా చేపట్టిన ప్రాజెక్టులు, సాధించిన వ్యక్తిగత నైపుణ్యాలకు ఇతోధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి.

- సాంకేతికంగా పురోగమిస్తున్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, క్లౌడ్ వంటి వాటిని త్వరితగతిన నేర్చుకునే సామర్థ్యం అభ్యర్థికి ఉండాలి.
- బట్టీపట్టి నేర్చుకోవడం కాదు, ప్రాబ్లెమ్ సాల్వింగ్, క్రిటికల్ థింకింగ్ సామర్థ్యాలు ఉండాలి. క్లిష్టమైన పరిస్థితిని విశ్లేషించి తార్కికంగా ఒక పరిష్కారాన్ని కనుగొనగలగాలి.

క్యాంపస్ నియామకాలు జోరందుకుంటున్నాయి. ఆకర్షణీయమైన వేతనాలతో విద్యార్థులు ఆఫర్లు అందుకుంటున్నట్టు వార్తలు వినవస్తున్నాయి. తొలగింపులే కాదు, ఈ ఏడాది నియామకాలు కూడా ఉంటాయని మెగా ఐటీ కంపెనీలు ప్రకటిస్తున్నాయి. ఈ నేపథ్యంలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్‌కు సంబంధించి ఇప్పుడు కొనసాగుతున్న ట్రెండ్స్‌ను పరిశీలిస్తే, అకడమిక మెరిట్‌కు తోడు ఇతర నైపుణ్యాల విషయంలో హైరింగ్ కంపెనీలు, అభ్యర్థిని సమగ్రంగా జల్లెడ పడుతున్నాయి. వాటి లోతుల్లోకి వెళితే.....



కోర్ ప్లస్ ఉంటేనే కొలువు

క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్

- కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్ ఉండాలి. ఆలోచనలో స్పష్టత, బృందాల్లో పనిచేయగలిగే చొరవ, సాంకేతిక కర్తవ్య నిర్వహణలోనూ తిరుగులేని వృత్తి నైపుణ్యం తప్పనిసరి.
- సానుకూల ధోరణికి తోడు శిక్షణతో నేర్చుకునే తత్వం ఉన్న అభ్యర్థులకు కంపెనీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. సానుకూల, క్రియాశీల, సహకార ధోరణి గల అభ్యర్థుల కోసం కంపెనీలు ఎదురుచూస్తున్నాయి.

సన్నద్ధతలో భాగంగా

క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ప్లేస్‌మెంట్ కోరుకునే అభ్యర్థి ఈ రోజుల్లో ముఖ్యంగా కోర్సు కాలవ్యవధినిబట్టి రెండో లేదంటే మూడో ఏడాదిలోనే సన్నద్ధం కావాలి. అందుకోసం...

- మొదటి రెండేళ్ళలో కనీసం 7.5 శాతం సీజీపీఏ సాధించి ఉండాలి. టాప్ కంపెనీలైతే 8.5కు మించి సీజీపీఏను కోరుకుంటున్నాయి. దీనికి తోడు చేయాలనుకుంటున్న వృత్తి - సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, డేటాసైన్స్, కోర్ ఇంజనీరింగ్, ఫైనాన్స్, మార్కెటింగ్‌ను బట్టి సంబంధిత ఆన్‌లైన్ కోర్సులు చేయాలి. లేదంటే కనీసం లోతుగా తెలుసుకుని ఉండాలి.
- ఐటీ లేదంటే ఐటీ ఎనేబుల్డ్ సర్వీసులైతే ప్రోగ్రామింగ్ లాంగ్వేజీలకు తోడు డేటా స్ట్రక్చర్స్ అండ్ అల్గోరిథమ్స్ తెలుసుకోవాలి. కోర్ బ్రాంచీలకు సంబంధిత సాఫ్ట్‌వేర్ టూల్స్(ఆటోకాడ్, ఎంఏటీల్యాబ్ వంటివి) తెలుసుకోవాలి. కాలేజీలో ఉండే వివిధ క్లబ్బుల్లో చేరి నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి.
- చివరి సంవత్సరాల్లో సాంకేతికంగా లోతైన పరిజ్ఞానాన్ని సముపార్జించాలి. టెక్నికల్ ప్లేస్‌మెంట్స్ కోసం లీట్‌కోడ్, గీక్స్‌ఫర్‌గీక్స్, హ్యాకర్‌ర్యాంక్, కోడ్‌చెఫ్ వంటి ప్లాట్‌ఫారాలపై ప్రాక్టీస్ చేయాలి. 250 నుంచి 400 వరకు నాణ్యమైన ప్రాబ్లెమ్స్‌ను సాల్వ్ చేయగలగాలి.
- ఐటీయేతర సబ్జెక్టులైతే కోర్ సబ్జెక్టుపై పట్టుకు తోడు ప్రాక్టికల్ ప్రాబ్లెమ్స్‌ను సాల్వ్ చేసి ఉండాలి. కేస్ స్టడీస్‌ని చేపట్టాలి. ప్రత్యేకత అంటే వెబ్ డెవలప్‌మెంట్ కోసం ఎంఈఆర్ఎన్ లేదా పైథాన్ లైబ్రరీలతో ఎంఎల్/ఏఐ లేదా ఆండ్రాయిడ్/ ఐఓఎస్ డెవలప్‌మెంట్ తెలుసుకోవాలి.
- కాలేజీ అసైన్‌మెంట్లు, టెక్నికల్ ప్రాజెక్టులు, రియల్ వరల్డ్ ప్రాబ్లెమ్ సాల్వింగ్, టెక్నికల్ బ్లాగ్ రూపకల్పన, గిట్‌హబ్ ఉపయోగించి టెక్నికల్ రెజ్యూమె రూపకల్పన తప్పనిసరి.
- కమ్యూనికేషన్ స్కిల్స్, పబ్లిక్ స్పీకింగ్, బిజినెస్ ఈమెయిల్ రైటింగ్, సొంత ఆలోచనలను స్పష్టంగా తెలియజేయగలగడం తప్పనిసరి. అడ్జాసెంట్ స్కిల్స్ అంటే ఉదాహరణకు మెకానికల్ ఇంజనీర్‌కు 3డి ప్రింటింగ్, డిజైన్ సాఫ్ట్‌వేర్ తెలియాలి.
- రెజ్యూమేను కస్టమైజ్ చేసుకోగలగాలి. ఉదాహరణకు ఎస్‌డీఈ అలాగే డేటా అనలిస్ట్ రెజ్యూమేలకు మధ్య తేడా ఉండాలి. ప్రతి పాయింట్‌కు స్టార్ మెథడ్‌ను అవలంబించాలి.
- ప్రామాణిక పుస్తకాలను ఉపయోగించుకుని క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, వెర్బల్ ఎబిలిటీపై పట్టు సాధించాలి. దాదాపుగా ప్రతి కంపెనీ వీటిపై ఒక టెస్ట్‌ను ఖాయంగా పెడుతోంది.
- హాజరవుతున్న కంపెనీ సమాచారాన్ని బేసిక్స్ నుంచి మరింత లోతుగా తెలుసుకుంటే ప్రయోజనకరం. ఒక కంపెనీలో చేరాలనుకుంటూ దాని గురించి తెలియకపోవడం మంచిది కాదు. కనీస అవగాహన ఉండితీరాలి.
- మాక్ ఇంటర్వ్యూలకు హాజరుకావడం తప్పనిసరి. హెచ్ఆర్ రౌండ్‌లో తమగురించి కనీసం ఒకటి నుంచి రెండు నిమిషాలు తడుముకోకుండా చెప్పుకోవాలి. బలాలు, బలహీనతలు, అయిదేళ్ళ తరవాత తమను తాము ఎలా చూసుకోవాలని అనుకుంటున్నారు వంటి వాటిపై పక్కాగా సన్నద్ధం కావాలి.
- ఇప్పటి మార్కెట్ అవసరాల విషయానికి వస్తే ఏఐ, ఎంఎల్ సంబంధిత పరిజ్ఞానం, లోతైన అవగాహన తప్పనిసరి. డేటా అనలిటిక్స్ కూడా తెలిసి ఉంటే మరింత ప్రయోజనకరం. క్లౌడ్ కంప్యూటింగ్ బేసిక్స్ తెలియాలి. ఏడబ్ల్యూఎస్, అజ్యూర్ లేదా గూగుల్ క్లౌడ్ తెలిసి ఉండాలి.
- గిగ్ మైండ్ సెట్ అంటే ఇంటర్న్‌షిప్‌నకు సన్నద్ధంగా ఉండాలి. ప్రాజెక్ట్ బేస్డ్, ఫ్రీలాన్స్‌కు రెడీగా ఉండాలి. రెజ్యూమే, నెట్‌వర్క్‌ను సొంతంగా నిర్మించుకోవాలి.
- చివరాఖరుగా ఒక్క విషయం, చదువుతున్న కోర్సులో అత్యధిక మార్కుల సాధించిన విద్యార్థులు ఈ రోజు ప్లేస్‌మెంట్స్‌లో పెద్దగా రాణించడం లేదు. సమస్యలను ఊహించి పరిష్కరించగలిగే సత్తాకు తోడు కోర్ డొమైన్‌లో పటిష్టమైన పునాది, ప్రాక్టికల్ ప్రాజెక్టుల్లో అనుభవం, తమ ఆలోచనలను స్పష్టంగా చెప్పగలిగే చాకచక్యం, బృందంలో పనిచేయగలిగే చొరవ ఉన్న వారికే అవకాశాలు లభిస్తున్నాయి. రెజ్యూమేకు బదులు పటిష్టమైన ప్రొఫైల్‌ను సొంతంగా రూపొందించుకోగలిగే వారికి ఎదురు ఉండదని గట్టిగా చెప్పవచ్చు.



టీ ఆకృతి - ప్రొఫెషనల్స్‌ను కంపెనీలు కోరుకుంటున్నాయి. అంటే అడ్డంగా ఒకటి, నిలువుగా మరొకటి గీతలతో టి అక్షరం ఏర్పడుతుంది. ఇక్కడ అడ్డంగా - కోర్ ఏరియాలో - తను చదువుకున్న సబ్జెక్టులో విద్యార్థికి ఉన్న పరిజ్ఞానం. నిలువుగా అంటే మిగిలినవైన కమ్యూనికేషన్, ప్రాబ్లెమ్ సాల్వింగ్, బిజినెస్‌పై అవగాహన వంటివి వస్తాయి.



ప్రొఫెసర్ ఎస్.వి. రమణారావు
డైరెక్టర్, ఎస్ఐటీ రాయపూర్

బ్యాంక్ ఆఫ్ బరోడా

బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన బ్రాంచీల్లో 2700 గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ఖాళీలు ఉన్నాయి. ఏపీలో 38, తెలంగాణలో 154 ఖాళీలు కూడా వాటిలో కలిపి ఉన్నాయి.
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత
ఎంపిక: ఆన్‌లైన్‌లో పరీక్ష, లోకల్ లాంగ్వేజ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా.
ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 1
వెబ్‌సైట్: portal https://nats.education.gov.in (Navigate to the "Student Register/Login" section) and NAPS portal https://www.apprenticeshipindia.gov.in

జనరల్ ఇన్సూరెన్స్

జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఇండియా 20 యాక్చూరియల్ అప్రెంటిస్‌ల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యాక్చూరీస్ ఆఫ్ ఇండియా లేదా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాకల్టీ ఆఫ్ యాక్చూరీస్ నిర్వహించే పరీక్షల్లో కనీసం రెండు యాక్చూరియల్ సబ్జెక్టులు పాసై ఉండాలి.
స్టయిపెండ్: మొదటి ఏడాది నెలకు రూ.40,000, రెండో ఏడాది నెలకు రూ.45.00 చెల్లిస్తారు. (కనీసం ఏడు యాక్చూరియల్ సబ్జెక్టులు పాసైతే రెగ్యులర్ ప్రాతిపదికన అసిస్టెంట్ మేనేజర్‌గా తీసుకుని రెగ్యులర్ స్కేల్, ఇతర అలవెన్స్‌లు చెల్లిస్తారు.)
ఎంపిక: గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు: ఈ మెయిల్ RecruitmentAA@gicre.in ద్వారా
ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబర్ 7
వెబ్‌సైట్: www.gicre.in/images/2025/ Detailed_Advertisement.pdf

మిథానీ

హైదరాబాద్ - కంచన్‌బాగ్‌లోని మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ 30, టెక్నీషియన్ డిప్లొమా అప్రెంటిస్ 20, ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్ 160 ఖాళీలు ఉన్నాయి.
అర్హత: పోస్టునుబట్టి సంబంధిత విభాగం/ ట్రేడ్‌లో డిప్లొమా/ గ్రాడ్యుయేట్/ ఐటీఐ ఉత్తీర్ణత
ఎంపిక: విద్యార్హతలో పొందిన మార్కులు, ధ్రువపత్రాల పరిశీలన, వైద్యపరీక్షల ఆధారంగా
దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 10
వెబ్‌సైట్: https://nats.education.gov.in

అప్రెంటిస్‌షిప్

సౌత్ ఈస్ట్రన్ రైల్వే



కోల్‌కతాలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ) - సౌత్ ఈస్ట్రన్ రైల్వే పరిధిలో యాక్ట్ అప్రెంటిస్ శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు: 1785(ట్రేడులు: ఫిట్టర్ వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, మెకానికల్ డీజిల్, ట్రిమ్మర్, ఎంఎంటీఎం, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్, రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్, లైనమన్ వంటివి)
వయస్సు: వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 15-24 సంవత్సరాల మధ్య వయస్కులై ఉండాలి.
ఎంపిక: టెన్త్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా
ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 17
వెబ్‌సైట్: www.rrcser.co.in.

నార్తరన్ రైల్వే

ఢిల్లీలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ) - నార్తరన్ రైల్వే పరిధిలో యాక్ట్ అప్రెంటిస్ శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు: 4116(ట్రేడులు: ఫిట్టర్ వెల్డర్, ఎలక్ట్రీషియన్, పెయింటర్(జనరల్)/ కార్పెంటర్ మెషినిస్ట్, టర్నర్, మెకానికల్ డీజిల్/మోటార్ వెహికల్, ట్రిమ్మర్, రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్, ఎలక్ట్రీషియన్/వైర్‌మన్ వంటివి)
వయస్సు: డిసెంబర్ 24 నాటికి 15-24 సంవత్సరాల మధ్య వయస్కులై ఉండాలి.
ఎంపిక: టెన్త్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా
ఆఖరు తేదీ: నవంబర్ 25 నుంచి డిసెంబర్ 24
వెబ్‌సైట్: www.rrcsnr.co.in.

రైట్స్ లిమిటెడ్

గుర్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్(రైట్స్)లో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ 146, డిప్లొమా అప్రెంటిస్ 49, ట్రేడ్ అప్రెంటిస్(ఐటీఐ) 57 మొత్తం 252 ఖాళీలు ఉన్నాయి.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ/ డిప్లొమా/ బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
ఎంపిక: విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా
ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబర్ 5
వెబ్‌సైట్: https://nats.education.gov.in/ student_type.php; for ITI pass candidates www.apprenticeshipindia.gov.in

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను 'అఖండ 2: తాండవం' చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఆదివారం బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను, నటి సంయుక్త, నిర్మాతలు ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ ఆదిత్యనాథ్‌కి అఖండ త్రిశూలాన్ని బహూకరించారు.

'రెబల్ సాబ్' వచ్చేశాడు



ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న హారర్ కామెడీ 'ది రాజా సాబ్'. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ది కుమార్ కథానాయికలు. బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కీలకపాత్రలో కనిపించనున్నారు. పీపుల్ మీడియా బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం నుంచి 'రెబల్ సాబ్...రెబల్ సాబ్.. రొమాంటిక్ రెబల్ సాబ్... వస్తున్నాడు, స్టెప్ ఎ సైడ్..స్టెప్ ఎ సైడ్' అంటూ సాగే మొదటి పాటను ఆదివారం నిర్వహించిన వేడుకలో మేకర్స్ ఆవిష్కరించారు. తమన్ కంపోజ్ చేసిన ఈ పాటలో ప్రభాస్ స్టైలిష్ స్టెప్పులతో అదరగొట్టారు. ఈ సందర్భంగా దర్శకుడు మారుతి మాట్లాడుతూ 'ప్రేక్షకుల కోసమే ప్రభాస్ గారు 12 ఏళ్ల తర్వాత ఇలాంటి పాటలో నటించారు. ముగ్గురు హీరోయిన్లు, ప్రభాస్ గారి నటన, వారి మధ్య కెమిస్ట్రీ స్క్రీన్‌పైనే చూడాలి' అని అన్నారు. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ 'జనవరి 9న సినిమా వస్తుందా అనే సందేహాలు కొందరిలో ఉన్నాయి. కచ్చితంగా అదే తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నాం' అని చెప్పారు.

నిరీక్షణ ముగిసింది.. పట్టాలెక్కిన స్పిరిట్!

ప్రభాస్ కథానాయకుడిగా 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాల దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న 'స్పిరిట్' ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని అభిమానులు ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. వారి నిరీక్షణకు తెరదించుతూ ఆదివారం ఈ చిత్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ముహూర్తపు వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీ సిరీస్ ఫిల్మ్స్, భద్రకాళి పిక్చర్స్ బేనర్లపై భూషణ్‌కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, క్రిషన్ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు ప్రభాస్. త్రిప్తీ దిమ్రీ కథానాయిక. ప్రకాశ్‌రాజ్, వివేక్ ఒబెరాయ్, కాంచన కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తొమ్మిది భాషల్లో ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్ విడుదల కానుంది. ఎలాంటి విజువల్స్ లేకుండా ప్రభాస్ పుట్టినరోజున విడుదల చేసిన 'సౌండ్ స్టోరీ' ఆడియో టీజర్ సినిమాలపై అంచనాలను రెట్టింపు చేసిన విషయం తెలిసిందే.






పుట్టిన రోజు బహుమతి

చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'మన శంకర వరప్రసాద్ గారు' అనే చిత్రం తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఆదివారం అనిల్ రావిపూడి పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆయనకు అందమైన వాచ్‌ను బహుమతిగా ఇచ్చి సర్‌ప్రైజ్ చేశారు మెగాస్టార్. అనంతరం కేక్ కట్ చేసి బర్త్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

'గోదారి గట్టుపైన' తొలి గీతం



సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్ జంటగా సుభాష్ చంద్ర తెరకెక్కిస్తోన్న చిత్రం 'గోదారి గట్టుపైన'. జగపతి బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ బేనర్‌పై అభినవ్ రావు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'చూడు చూడు..' అంటూ సాగే తొలి గీతాన్ని మేకర్స్ ఆవిష్కరించారు. దినేశ్ కాకర్ల రాసిన పాటను హరి చరణ్ ఆలపించారు. నాగవంశీ కృష్ణ స్వరాలు సమకూర్చారు. మంచి ప్రేమ కథతో పాటు వాణిజ్య హంగులతో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి సాయి సంతోష్ సినిమాటోగ్రాఫర్‌గా, అనిల్ కుమార్ పి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.



కార్యసాధకుడిగా నాగచైతన్య

అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా 'విరూపాక్ష' ఫేమ్ కార్తిక్ వర్మ దండు ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఆదివారం నాగచైతన్య పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ చిత్రం టైటిల్‌ను, ఫస్ట్ లుక్‌ను హీరో మహేశ్‌బాబు సోషల్‌మీడియా ద్వారా విడుదల చేశారు. ఈ సినిమా టైటిల్ 'వృషకర్మ'. అంటే కార్యసాధకుడు అని అర్థం. ఇందులో నిధిని అన్వేషించే సాహసికుడిగా శక్తిమంతమైన పాత్రను పోషిస్తున్నారు నాగచైతన్య. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. శ్రీ వేంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ బేనర్లపై బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బాపినీడు సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: నవీన్ నూలి, సంగీతం: అజనీశ్ లోక్‌నాథ్.

నేను గర్వపడే చిత్రమిది

రామ్ పోతినేని



'నా కెరీర్‌లో గర్వపడే సినిమా 'ఆంధ్ర కింగ్ తాలూకా'. ఉపేంద్ర గారితో కలసి పనిచేయడం గౌరవంగా భావిస్తున్నా' అని అన్నారు రామ్ పోతినేని. ఆయన కథానాయకుడిగా మహేశ్ బాబు పి తెరకెక్కించిన చిత్రమిది. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవి శంకర్ నిర్మించారు. సినిమా ఈనెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ వైజాగ్‌లో మ్యూజిక్ కాన్సర్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపేంద్ర మాట్లాడుతూ 'ఈ సినిమాను చూసిన ప్రతి ఒక్కరు థియేటర్ల నుంచి కాలర్ ఎగరేసుకుంటూ బయటికి వస్తారు. మహేశ్ బాబు గారు సినిమాని అంత అద్భుతంగా తీశారు' అని అన్నారు. 'నవంబరు 27న మీరందరూ సినిమాని థియేటర్లలో తప్పకుండా చూడాలి' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే కోరారు. ఆంధ్రప్రదేశ్ హోం మినిస్టర్ వంగలపూడి అనిత మాట్లాడుతూ ' 'ఆంధ్ర కింగ్ తాలూకా' టైటిల్ వినగానే చాలా కనెక్ట్ అయ్యాను. వైజాగ్ సముద్ర తీరంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు. దర్శకుడు మహేశ్ బాబు మాట్లాడుతూ 'ప్రపంచంలో ఎవర్నో ఒకర్ని అభిమానించకుండా ఎవరూ ఉండరు. జీవితంలో ఉండే అన్ని రకాల భావోద్వేగాలను ఒక అభిమాని కోణంలో చూపించే ప్రయత్నం చేశాం' అని చెప్పారు. నిర్మాత రవి శంకర్ మాట్లాడుతూ 'స్టార్ ఫ్యాన్స్ అందరిని కలిపిన చిత్రమిది. అద్భుతంగా ఉంటుంది. అందరూ తప్పకుండా చూడాలి' అని కోరారు.

థియేటర్లలోకి జనతాబార్

కథానాయిక రాయ్ లక్ష్మి ప్రధాన పాత్రలో రూపొందిన హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రం 'జనతా బార్'. రమణ మొగిలి దర్శకత్వం వహిస్తూ, అశ్వర్థ నారాయణతో కలసి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 28న 'జనతా బార్' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'మహిళా అథ్లెట్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన అధికారులకు వ్యతిరేకంగా పోరాడిన ఓ మహిళ కథతో తెరకెక్కిన చిత్రమిది. రాయ్ లక్ష్మి పాత్ర శక్తిమంతంగా ఉంటుంది. అమ్మాయిల్లో చైతన్యం నింపే సినిమా ఇది. వాణిజ్య హంగులతో పాటు మంచి సందేశంతో తెరకెక్కింది. బాలీవుడ్ నటుడు శక్తికపూర్ కీలకపాత్ర పోషించారు' అని చెప్పారు.



రమణ గోగుల సంగీత యాత్ర



సంగీత దర్శకుడు, గాయకుడు రమణ గోగుల తన కెరీర్‌లో తొలి సారి 'ఇన్ కాన్వర్సేషన్స్ విత్ ది ట్రావెలింగ్ సోల్జర్ - రమణ గోగుల ఆస్ట్రేలియా టూర్ ఫిబ్రవరి 2026' పేరిట గ్లోబల్ కాన్సర్ట్ టూర్ నిర్వహించనున్నారు. మెల్‌బోర్న్ మామా క్రియేటివ్ స్పేస్, టాప్ నాచ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆస్ట్రేలియా సంస్థలు ఈ కార్యక్రమాన్ని సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రమణ గోగుల ఈ యాత్ర వివరాలు వెల్లడించారు. ఈ గ్లోబల్ కాన్సర్ట్ టూర్ తెలుగు సంగీత చరిత్రలో ఒక మైలురాయిగా నిలవనుందని అభిప్రాయపడ్డారు. ఈ టూర్ కేవలం సంగీత కచేరీలకు మాత్రమే పరిమితం కాదనీ, అత్యంత ఆదరణ పొందిన తన సినీ గీతాలు, వాటి వెనుక ఉన్న జ్ఞాపకాలు, తెర వెనుక ఉన్న కథలతో కూడిన ఒక భావోద్వేగభరితమైన అన్వేషణ అని ఆయన తెలిపారు.

ఆకట్టుకునే అమ్మ కథ



ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం 'విచిత్ర'. రవి, శ్రియ తివారి జంటగా నటించారు. సైఫుద్దీన్ మాలిక్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధమైంది. ఆదివారం చిత్ర బృందం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకుంది. ఈ సందర్భంగా సైఫుద్దీన్ మాట్లాడుతూ 'అమ్మ సెంటిమెంట్‌తో రూపొందిన చిత్రమిది. తల్లి ప్రేమ, త్యాగం లాంటి అంశాలతో హృదయాన్ని కదిలించేలా ఉంటుంది. పాత్రల తాలూకు భావోద్వేగాలను ప్రేక్షకులు అనుభూతి చెందుతారు' అని చెప్పారు. సంగీతం: నిజాని, అంజన్, ఎడిటర్: లక్ష్మీ నారాయణ.

స్పోర్ట్స్

హాకీ వరల్డ్‌కప్‌నకు టిక్కెట్లు ఫ్రీ

మధురై: పురుషుల హాకీ జూనియర్ వరల్డ్‌కప్ పోటీలను ప్రత్యక్షంగా వీక్షించాలనుకునే అభిమానులకు భారత హాకీ సమాఖ్య బంపర్ ఆఫర్ ఇచ్చింది. చెన్నై వేదికగా ఈనెల 28 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు జరగనున్న ఈ మ్యాచ్‌లకి అభిమానులకు ఉచితంగా టిక్కెట్లు ఇవ్వనున్నట్టు హాకీ సమాఖ్య తెలిపింది. ఈ వరల్డ్‌కప్‌లో మొత్తం 24 దేశాలు పాల్గొంటున్నాయి. టిక్కెట్ జీనీ వెబ్‌సైట్‌లో అభిమానులు ఫ్రీ టిక్కెట్లను పొందవచ్చు. యువ క్రీడాకారులు, విద్యార్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా మ్యాచ్‌లు చూడడానికి రావచ్చునని హాకీ సమాఖ్య తెలిపింది.

కబడ్డీ టైటిల్‌పోరుకు భారత్

ఢాకా: భారత మహిళల జట్టు అద్భుతమైన ఆటతీరుతో కబడ్డీ వరల్డ్‌కప్‌లో ఫైనల్ చేరింది. సెమీఫైనల్ పోరులో భారత జట్టు 33-21తో బలమైన ఇరాన్‌ను ఓడించి, ట్రోఫీకి చేరువైంది. డిఫెండింగ్ చాంపియన్ అయిన భారత క్రీడాకారిణులు శత్రు దుర్భేద్యమైన డిఫెన్స్‌తో పాటు మెరుపు రైడ్లతో ప్రత్యర్థి ఇరాన్‌ను చిత్తు చేశారు. అంతకుముందు జరిగిన లీగ్ దశలోనూ గ్రూప్-ఎ ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ భారత్ విజయం సాధించడం విశేషం. సోమవారం జరిగే ఫైనల్లో చైనీస్ తైపీ జట్టుతో భారత అమ్మాయిలు తలపడనున్నారు.

అభినవ్‌కు స్వర్ణం

● బధిర ఒలింపిక్స్



టోక్యో: బధిర ఒలింపిక్స్‌లో భారత షూటర్లు అదరగొడుతున్నారు. తాజాగా పిస్టల్ విభాగంలో అభినవ్ దేశ్వాల్ స్వర్ణంతో మెరిశాడు. ఈ ఒలింపిక్స్ షూటింగ్ అంశంలో భారత్‌కిది 15వ పతకం. ఆదివారం జరిగిన 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో అభినవ్ 44 పాయింట్లతో టాప్‌లో నిలిచాడు. కొరియా షూటర్ సెంగ్ రజతం, ఉక్రెయిన్‌కు చెందిన సెర్హీ కాంస్యం దక్కించుకొన్నారు. అయితే, క్వాలిఫికేషన్ రౌండ్‌లో అభినవ్ 575 పాయింట్లతో డెఫిలింపిక్స్ క్రీడల రికార్డు నెలకొల్పాడు.



రఫీల్

భారత్ శుభారంభం

● 1-0తో కొరియాపై గెలుపు ● అజ్లాన్ షా కప్ హాకీ

ఇఫో (మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా కప్‌లో భారత హాకీ జట్టు బోణీ చేసింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 1-0తో కొరియాపై గెలిచింది. తొలి క్వార్టర్ 15వ నిమిషంలో రఫీల్ ఫీల్డ్ గోల్‌తో భారత్‌ను ఆధిక్యంలో నిలిపాడు. మ్యాచ్‌లో భారత్‌కు ఐదు పెనాల్టీ కార్నర్‌లు లభించినా ఒక్కదాన్ని కూడా గోల్‌గా మలచలేక పోయింది. కాగా, ఈ మ్యాచ్ సమయానికి మధ్యాహ్నం భారీగా వర్షం కురవడంతో మిగిలిన మ్యాచ్‌లు పూర్తయిన తర్వాత రాత్రికి పూర్తి చేశారు. మలేసియా, న్యూజిలాండ్ మ్యాచ్ 2-2తో, బెల్జియం, కెనడా మ్యాచ్ 1-1తో డ్రాగా ముగిశాయి.

సేన్.. సాధించెన్!



● లక్ష్య ఖాతాలో ఆస్ట్రేలియన్ ఓపెన్
● సీజన్‌లో తొలి టైటిల్ కైవసం

ఆహా... ఎన్నాళ్లకెన్నాళ్లకు.. లక్ష్య సేన్ టైటిల్ కొరత తీరింది. ఏడాదికాలంగా విజయం కోసం ఎదురు చూస్తున్న ఈ స్టార్ షట్లర్ కల నెరవేరింది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సేన్ చాంపియన్‌గా నిలిచి ఈ సీజన్‌లో తొలి ట్రోఫీని ముద్దాడాడు. తన ఫామ్‌పై నెలకొన్న సందేహాలకు చెక్ పెడుతూ, పునర్వైభవం దిశగా ముందడుగు వేశాడు.

2 ఈ సీజన్‌లో బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టైటిల్ నెగ్గిన రెండో భారత షట్లర్ లక్ష్య. అంతకుముందు ఈ ఏడాది ఆయుష్ శెట్టి యూఎస్ ఓపెన్‌లో విజేతగా నిలిచాడు.

లక్ష్యకు ఇది కెరీర్‌లో మూడో బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 500 టైటిల్. అంతకుముందు ఇండియా, కెనడా ఓపెన్ గెలిచాడు.

3 సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్ తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గిన మూడో భారత షట్లర్ లక్ష్య సేన్.

సిడ్నీ: గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లో నాలుగోస్థానంతో త్రుటిలో కాంస్య పతకాన్ని చేజార్చుకున్న భారత యువ షట్లర్ లక్ష్య సేన్.. ఆ తర్వాత ఇన్నాళ్లకు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచి ఈ సీజన్‌లో అతి పెద్ద విజయాన్ని నమోదు చేశాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో లక్ష్య సేన్ 21-15, 21-11తో జపాన్‌కు చెందిన 26 ఏళ్ల యుషి తనకను వరుస గేముల్లో చిత్తుచేసి ట్రోఫీ దక్కించుకున్నాడు. గత మ్యాచ్‌లో మూడు గేమ్‌ల పాటు పోరాడిన లక్ష్య.. ఫైనల్లో మాత్రం ప్రత్యర్థి యుషిని అలవోకగా ఓడించాడు. కేవలం 38 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించిన సేన్.. ఆద్యంతం ఆధిపత్యం ప్రదర్శించాడు. రెండో గేమ్‌లో మూడుసార్లు మ్యాచ్ పాయింట్‌ను కాచుకొని విజయం సాధించాడు. ఉత్తరాఖండ్‌లోని అల్మోరాకు చెందిన 24 ఏళ్ల లక్ష్యకు ఇది ఈ ఏడాది తొలి టైటిల్. చివరిగా అతను నిరుడు నవంబరులో భారత్ వేదికగా జరిగిన సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ 300 టోర్నీలో విజేతగా నిలిచాడు. ఇక.. ఈ సీజన్ సెప్టెంబరులో హాంకాంగ్ ఓపెన్ ఫైనల్ చేరినా, టైటిల్ దక్కించుకోలేకపోయాడు. 2021లో ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం నెగ్గిన లక్ష్య సేన్.. ఆ తర్వాత ప్రతి ఏటా కనీసం ఒక టైటిల్ నెగ్గడం విశేషం. 2022లో ఇండియా ఓపెన్ విజేతగా నిలిచిన లక్ష్య.. 2023లో కెనడా ఓపెన్, 2024లో సయ్యద్ మోదీ, ఇప్పుడు ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిళ్లు కైవసం చేసుకున్నాడు. ప్రస్తుతం ప్రపంచ 14వ ర్యాంక్‌లోనున్న లక్ష్య.. తాజా ప్రదర్శనతో 11వ స్థానానికి ఎగబాకాడు.



అంధ మహిళల టీ20 వరల్డ్‌కప్ విజేత భారత్

మన అమ్మాయిలు టైటిల్ పట్టేశారు

● అదరగొట్టిన ఫులా సరెన్, కరుణ
● ఫైనల్లో 7 వికెట్లతో నేపాల్ చిత్తు

కొలంబో: టోర్నీ ఆసాంతం అజేయంగా నిలిచిన భారత జట్టు.. అంధ మహిళల తొలి టీ20 వరల్డ్ కప్ చాంపియన్‌గా నిలిచింది. ఓపెనర్ ఫులా సరెన్ (44 నాటౌట్), తెలుగమ్మాయి కరుణకుమారి (42) రాణించడంతో.. ఆదివారం ఏకపక్షంగా జరిగిన ఫైనల్లో భారత్ 7 వికెట్ల తేడాతో నేపాల్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకొన్న భారత్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని నియంత్రించింది. దీంతో నేపాల్ జట్టు 20 ఓవర్లలో 114/5 స్కోరు మాత్రమే చేసింది. బ్యాటర్లను బౌలర్లు కట్టడి చేయగా.. ఫీల్డర్లు అద్భుతంగా రాణిస్తూ ప్రత్యర్థి నేపాల్‌ను ఒత్తిడిలోకి నెట్టారు. ఇన్నింగ్స్ మొత్తంలో నేపాల్ ఒకే ఒక బౌండ్రీ సాధించిందంటే భారత ఫీల్డర్లు ఎంత అద్భుతంగా బౌల్ చేశారో అర్థం చేసుకోవచ్చు. ఛేదనలో భారత్ 12.1 ఓవర్లలో 3 వికెట్లకు 117 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన సరెన్ ఎడాపెడా షాట్లలో స్కోరు బోర్డును పరుగులు పెట్టించడంతో భారత్ 10 ఓవర్లలో సెంచరీ మార్క్ దాటింది. 13వ ఓవర్ తొలి బంతిని ఫైన్ లెగ్ మీదుగా ఫోర్ బాదిన సరెన్ మ్యాచ్‌ను ఫినిష్ చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా సరెన్ నిలిచింది. సెమీస్‌లో ఆస్ట్రేలియాను భారత్ ఓడించగా.. పాకిస్థాన్‌పై నేపాల్ గెలిచింది.

ట్రోఫీతో కరుణ కుమారి



గెలుపులో పాడేరు మన్యం బిడ్డ

భారత జట్టు వరల్డ్‌కప్ సాధించడంలో తెలుగమ్మాయి పి.కరుణ కుమారి కీలక పాత్ర పోషించింది. ఫైనల్లో టాప్ స్కోరర్ ఫులా సరెన్ తర్వాత అత్యధిక పరుగులు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని పాడేరుకు చెందిన కరుణ కుమారి గత రెండేళ్లుగా అంధుల క్రికెట్‌లో నిలకడగా రాణిస్తోంది. ప్రస్తుతం విశాఖపట్నంలోని ప్రభుత్వ బాలికల అంధుల రెసిడెన్షియల్ పాఠశాలలో కరుణ పదో తరగతి చదువుతోంది. కరుణ ప్రతిభను గుర్తించిన అర్జున అవార్డు గ్రహీత, కోచ్ అజయ్ కుమార్ రెడ్డి ప్రోత్సాహంతో ఆమెకు జాతీయ జట్టులో చోటు లభించింది. తనకు లభించిన అవకాశాన్ని చక్కగా వినియోగించుకొంది.

తండ్రికి అస్వస్థత.. మంధాన పెళ్లి వాయిదా



సాంగ్లీ (మహారాష్ట్ర): మూడ్రోజులపాటు హల్దీ, మెహందీ, సంగీత్ వేడుకలతో సంబరాలు జోరుగా సాగాయి. అందరూ హుషారుగా స్టెప్పులేశారు.. సందడి చేశారు. ఇంకొన్ని గంటల్లో పెళ్లి వేడుకకు సిద్ధమవుతున్న వేళ.. కాబోయే వధువు, క్రికెటర్ స్మృతీ మంధాన తండ్రి శ్రీనివాస్ అనారోగ్యానికి గురయ్యారు. ఛాతీలో నొప్పిగా ఉందనడంతో ఆయనను హుటాహుటిన ఆసుపత్రిలో చేర్చారు. ఈ హఠాత్పరిణామంతో ఇరుకుటుంబాల బంధుగణమంతా ఒక్కసారిగా ఉలిక్కిపడగా.. తండ్రితో ఎంతో అనుబంధమున్న స్మృతీ మంధాన తీవ్ర దు:ఖసాగరంలో మునిగిపోయింది. ఈ పరిస్థితుల్లో పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదన్న స్మృతి.. ప్రియుడు పలాష్ ముచ్చల్‌తో ఆదివారం జరగాల్సిన వివాహాన్ని వాయిదా వేసుకొంది. ఆసుపత్రిలో ఉన్న తండ్రి కోలుకునేదాకా పెళ్లిని నిరవధికంగా వాయిదా వేయాలని స్మృతీ నిర్ణయించుకుందని ఆమె మేనేజర్ తుహిన్ మిశ్రా మీడియాకు వెల్లడించారు. 'ఇవాళ ఉదయం నుంచే శ్రీనివాస్ నలతగా ఉన్నారు. ఛాతీలో నొప్పి ఉందని చెప్పిన వెంటే ఆయన్ని సాంగ్లీలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాం. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. తండ్రి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఇప్పుడు పెళ్లి చేసుకోకూడదని స్మృతీ నిర్ణయించుకుంది. ఇదే విషయాన్ని పలాష్ కుటుంబంతో చెప్పగా.. పెళ్లి వాయిదా వేసేందుకు వాళ్లు కూడా అంగీకరించారు' అని తుహిన్ తెలిపారు.





రెండో టెస్టు

'తోక'తో కొట్టారు!

టాప్-5 ఆటగాళ్లంతా ఓ మాదిరి స్కోర్లకే పరిమితం కాగా.. తొలి రోజు ఆటలోనే ఆరు వికెట్లు ఫట్. ఇంకేముంది మిగిలిన వికెట్లను చకచకా పడగొట్టి భారత్ తమ ఇన్నింగ్స్‌ను ఆరంభిస్తుందనే అంతా భావించారు. కానీ ఆదివారమంతా దక్షిణాఫ్రికాదే ఆధిపత్యంగా సాగింది. టెయిలెండర్ల నుంచి అనూహ్య పోరాటం ఎదురవడంతో.. మన బౌలర్లకు చుక్కలు కనిపించాయి. బంతులు వేసీ వేసీ అలసిపోయారే తప్ప రెండు సెషన్లలో కలిపి తీసింది ఒక్క వికెట్‌నే. అటు ఏడో నెంబర్ బ్యాటర్ ముత్తుసామి శతకం అందుకోగా.. తొమ్మిదో నెంబర్ బ్యాటర్ యాన్సెన్ ఏకంగా 93 రన్స్‌తో అదుర్స్ అనిపించాడు. ఈ జోడీ ఎదురుదాడికి సఫారీలు సిరీస్‌ను శాసించే స్థితిలో నిలిచారు.

సెనురన్ ముత్తుసామి (109)

ముత్తుసామి శతకం

యాన్సెన్ సెంచరీ మిస్

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 489

చెమటోడ్చిన భారత బౌలర్లు

గువాహటి: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో భారత బౌలర్లు తేలిపోయారు. ఆదివారం ఆటలో టెయిలెండర్లు సెనురన్ ముత్తుసామి (109), మార్కో యాన్సెన్ (93) అసాధారణ ఇన్నింగ్స్‌తో అలరించారు. వీరికి వెరీన్ (45) కూడా సహకరించడంతో సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 489 పరుగుల భారీ స్కోరు సాధించింది. స్పిన్నర్ కుల్దీప్‌నకు నాలుగు.. పేసర్లు బుమ్రా, సిరాజ్‌లతో పాటు మరో స్పిన్నర్ జడేజాకు రెండేసి వికెట్లు దక్కాయి. చివరి సెషన్ ఆఖర్లో తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ 6.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 9 పరుగులతో ఉంది. వెలుతురు లేమితో ఆట కాస్త ముందుగానే ముగియగా, క్రీజులో ఓపెనర్లు జైస్వాల్ (7), రాహుల్ (2) ఉన్నారు. భారత్ ఇంకా 480 పరుగులు వెనుకబడి ఉండడంతో సిరీస్‌ను సమం చేయడం కష్టమే.

అద్భుత భాగస్వామ్యం: 247/6 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఆటను ఆరంభించిన దక్షిణాఫ్రికా దాదాపు మూడు సెషన్ల పాటు ఆడి మరో 242 పరుగులు జోడిస్తుందని ఎవరూ ఊహించివుండరు. లెఫ్ట్ హ్యాండర్ ముత్తుసామి స్పెషలిస్ట్ బ్యాటర్‌గా భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న తీరు ఆకట్టుకుంది. పిచ్ పేస్, స్పిన్‌కు సహకారం అందించకపోవడంతో తొలి సెషన్‌లో వికెట్ తీయలేకపోయారు. ఆరంభంలో ఆచితూచి ఆడినా కుదురుకున్నాక ముత్తుస్వామి, వెరీన్ బౌండరీలతో ఆకట్టుకున్నారు. అద్భుత డిఫెన్స్ కనబర్చిన ముత్తు అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇద్దరూ వికెట్ కోల్పోకూడదనే ఉద్దేశంతో ఆచితూచి ఆడి టీ బ్రేక్‌కు వెళ్లారు. రెండో సెషన్‌లో కాసేపటికే భారత ఎదురు చూపులు ఫలించాయి. జడేజా ఓవర్‌లో ముందుకు వచ్చి ఆడిన వెరీన్‌ను పంత్ స్టంపౌట్ చేయడంతో ఏడో వికెట్‌కు 88 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది.



యాన్సెన్ (93)

యాన్సెన్ ధనాధన్: వెరీన్ నిష్క్రమణతో వచ్చిన యాన్సెన్ ఆట స్వరూపాన్నే మార్చేశాడు. స్పిన్నర్లను లక్ష్యంగా చేసుకుంటూ అలవోకగా సిక్సర్లు బాదేయడంతో స్కోరు వేగంగా పెరిగింది. అతడిని చూసి ముత్తుసామి కూడా కుల్దీప్ ఓవర్‌లో 6,4తో గేరు మార్చాడు. ఈ దాటికి తన తొలి శతకం కూడా పూర్తయ్యింది. అటు 53 బంతుల్లోనే యాన్సెన్ ఫిఫ్టీ పూర్తి చేశాడు. అయితే చివరి సెషన్ రెండో ఓవర్‌లోనే ముత్తుసామి మారథాన్ ఇన్నింగ్స్‌కు సిరాజ్ ముగింపు పలికాడు. ఫైన్ లెగ్‌లో జైస్వాల్ క్యాచ్ అందుకోవడంతో ఎనిమిదో వికెట్‌కు 107 బంతుల్లో 97 పరుగుల మెరుపు భాగస్వామ్యం ముగిసింది. మరోవైపు యాన్సెన్ మాత్రం దూకుడును ఆపలేదు. వరుసగా జడేజా ఓవర్‌లో రెండు సిక్సర్లు, సిరాజ్ ఓవర్‌లో 4,6తో బెంబేలెత్తించాడు. అటు హార్మర్ (5)ను బుమ్రా బౌల్డ్ చేయడంతో జట్టు తొమ్మిదో వికెట్ కోల్పోయింది. అయితే ఆఖరి వికెట్‌కు కేశవ్ (12 నాటౌట్) అండగా నిలవడంతో యాన్సెన్ సెంచరీ ఖాయమనిపించింది. కానీ శతకం సాధించే క్రమంలో గేమ్‌ప్లాన్‌ను మార్చుకుని డిఫెన్స్‌కు పరిమితమయ్యాడు. దీంతో ఒత్తిడికి గురై 7 పరుగుల దూరంలో కుల్దీప్ గూగ్లీకి బౌల్డ్ కావడంతో నిరాశ తప్పలేదు. మరోవైపు సఫారీల అద్భుత పోరాటం కూడా ముగిసింది.

1 సౌతాఫ్రికా తరఫున ఓ ఇన్నింగ్స్‌లో ఎక్కువ సిక్సర్లు (7) బాదిన బ్యాటర్‌గా డివిల్లీర్స్, డికాక్‌లతో సమంగా నిలిచిన యాన్సెన్. భారత్‌పై టెస్టుల్లో షాహిద్ అఫ్రీదితో సమంగా నిలిచాడు.

2 తొమ్మిది అంతకన్నా దిగువ బ్యాటర్లలో ఇన్నింగ్స్‌లో ఎక్కువ సిక్సర్లు (7) బాదిన రెండో బ్యాటర్‌గా యాన్సెన్. టిమ్ సౌథీ 9 సిక్సర్లతో టాప్‌లో ఉన్నాడు.

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (బి) బుమ్రా 38, రికెల్టన్ (సి) పంత్ (బి) కుల్దీప్ 35, స్టబ్స్ (సి) రాహుల్ (బి) కుల్దీప్ 49, బవుమా (సి) జైస్వాల్ (బి) జడేజా 41, డి జోర్జి (సి) పంత్ (బి) సిరాజ్ 28, ముల్డర్ (సి) జైస్వాల్ (బి) కుల్దీప్ 13, ముత్తుస్వామి (సి) జైస్వాల్ (బి) సిరాజ్ 109, వెరీన్ (స్టంప్) పంత్ (బి) జడేజా 45, యాన్సెన్ (బి) కుల్దీప్ 93, హార్మర్ (బి) బుమ్రా 5, కేశవ్ (నాటౌట్) 12; **ఎక్స్‌ట్రాలు: 21, మొత్తం: 151.1 ఓవర్లలో 489 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-82, 2-82, 3-166, 4-187, 5-201, 6-246, 7-334, 8-431, 9-462, 10-489. **బౌలింగ్:** బుమ్రా 32-10-75-2, సిరాజ్ 30-5-106-2, నితీశ్ 6-0-25-0, సుందర్ 26-5-58-0, కుల్దీప్ 29.1-4-115-4, జడేజా 28-2-94-2.

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వీ జైస్వాల్ (బ్యాటింగ్) 7, రాహుల్ (బ్యాటింగ్) 2; **ఎక్స్‌ట్రాలు:0, మొత్తం: 6.1 ఓవర్లలో 9/0. బౌలింగ్:** యాన్సెన్ 3.1-1-9-0, ముల్డర్ 3-3-0-0.

టెస్టు మ్యాచ్ జోక్ అనుకున్నారా?



రెండో రోజు ఆటలో ఓవర్ వేసేందుకు ఎక్కువ సమయం తీసుకోవడంతో స్పిన్నర్ కుల్దీప్‌పై తాత్కాలిక కెప్టెన్ పంత్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. అప్పటికే అంపైర్ రెండుసార్లు హెచ్చరించాడు. మూడోసారి ఇదే రిపీట్ అయితే జట్టుపై 5 పరుగుల పెనాల్టీ విధిస్తారు. దీంతో పంత్ ఘాటుగా స్పందిస్తూ.. '30 సెకన్ల టైమర్ ఆన్‌లో ఉంది. ఇంట్లో ఆడుతున్నావా? బంతి త్వరగా వెయ్' అని కుల్దీప్‌కు సూచించాడు. ఇతర ఆటగాళ్లు కూడా ఓవర్ ముగిశాక నెమ్మదిగా కదులుతుండడంతో అసంతృప్తి చెందాడు. 'కుల్దీప్‌ను రెండుసార్లు హెచ్చరించారు. మీరు కదిలేందుకు పూర్తి ఓవర్ కావాలా? మీరంతా టెస్టు క్రికెట్‌ను జోక్‌గా భావిస్తున్నారు' అని పంత్ వారిపై కోపగించుకున్నాడు.

రాహుల్‌కు వన్డే పగ్గాలు

● గిల్ అవుట్ ● బుమ్రాకు విశ్రాంతి
● దక్షిణాఫ్రికాతో వన్డేలకు భారత జట్టు



న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాతో జరగబోయే మూడు వన్డేల సిరీస్ కోసం భారత జట్టును ప్రకటించారు. రెగ్యులర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మెడ నొప్పితో బాధపడుతుండగా.. అతడి స్థానంలో జట్టు పగ్గాలు కేఎల్ రాహుల్‌కు అప్పగించారు. ఈనెల 30 నుంచి డిసెంబరు 6 వరకు జరిగే సిరీస్ కోసం సెలెక్టర్లు 15 మందితో కూడిన జాబితాను ఆదివారం వెల్లడించారు. ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన వన్డే జట్టు నుంచి నాలుగు మార్పులు చేశారు. కీపర్ రిషభ్ పంత్ జట్టులోకి వచ్చాడు. శ్రేయాస్ అయ్యర్ కూడా గాయంతో దూరం కావడంతో రాహుల్‌కు డిప్యూటీగా పంత్ వ్యవహరించనున్నాడు. అలాగే శ్రేయాస్ అయ్యర్ స్థానంలో హైదరాబాదీ తిలక్ వర్మకు చోటు దక్కింది. రెండేళ్ల క్రితం తను భారత్ తరఫున చివరి వన్డే ఆడాడు. ఇటీవల భారత్ 'ఎ' తరఫున ఆడి ఫామ్ నిరూపించుకున్న రుతురాజ్ గైక్వాడ్ కూడా జట్టులోకి వచ్చాడు. శ్రేయాస్ స్థానం కోసం ఈ ఇద్దరి మధ్య పోటీ నెలకొంది. అయితే ఆసీస్ పర్యటనలో రాణించినప్పటికీ స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ స్థానంలో వెటరన్ జడేజాను తీసుకున్నారు. పేసర్ సిరాజ్ మాత్రం ఆ టూర్‌లో ఆడిన మూడు వన్డేల్లో కేవలం రెండు వికెట్లు మాత్రమే తీయడంతో తనను పరిగణనలోకి తీసుకోలేదు. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. పంత్ జట్టులో ఉన్నా ధ్రువ్ జురెల్‌కు సెలెక్టర్లు అవకాశం ఇవ్వడం విశేషం. స్టార్ పేసర్ బుమ్రాకు విశ్రాంతినిచ్చారు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా గాయం కారణంగా మరోసారి నితీశ్ కుమార్‌తో కొనసాగనున్నారు.

వన్డే జట్టు

రాహుల్ (కెప్టెన్), రోహిత్, విరాట్ కోహ్లీ, జైస్వాల్, తిలక్, రుతురాజ్, జురెల్, పంత్, సుందర్, జడేజా, కుల్దీప్, నితీశ్, హర్షిత్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్.

అమర్ సింగ్ రికార్డు ప్రదర్శన

న్యూఢిల్లీ: భారత రేసర్ అమర్ సింగ్ దేవాండ అంతర్జాతీయ స్థాయిలో రికార్డు ప్రదర్శన చేశాడు. బ్యాంకాక్‌లో జరిగిన ఆసియా ఓషియానా 100 కిలోమీటర్ల అల్ట్రా చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచాడు. అతను 6 గంటల 59 నిమిషాల 37 సెకన్ల జాతీయ రికార్డు టైమింగ్‌తో రేస్ ముగించాడు.

భారత్-ఎ గెలుపు

బెంగళూరు: ఆదిత్య రావత్ (4/34), మాలిక్ (4/49) బంతితో విజృంభించగా.. ఆల్‌రౌండర్ ఇనాన్ (105 నాటౌట్) సెంచరీతో చెలరేగాడు. దీంతో అండర్-19 ముక్కోణపు సిరీస్‌లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్-బిపై 26 పరుగులతో నెగ్గిన భారత్-ఎ ఫైనల్ బెర్త్‌ను దాదాపుగా ఖాయం చేసుకొంది. తొలుత భారత్-ఎ నిర్ణీత 50 ఓవర్లలో 269/7 స్కోరు చేసింది. కెప్టెన్ విహాన్ మల్హోత్రా (42), ఖిలన్ పటేల్ (37) రాణించారు. జగన్నాథన్, రోహిత్, కిశోర్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం ఛేదనలో భారత్-బి 47.2 ఓవర్లలో 243 పరుగులకు కుప్పకూలింది. హర్వంశ్ (99) త్రుటిలో శతకం చేజార్చుకొన్నాడు.

ఫైనల్లో జావోఖిర్ x వీ యి

చెస్ విశ్వకప్

పనాజీ: చెస్ వరల్డ్‌కప్ ఫైనల్లో అమీతుమీ తేల్చుకొనేందుకు జావోఖిర్ సిందరోవ్ (ఉజ్బెకిస్థాన్), వీ యి (చైనా) సిద్ధమయ్యారు. ఆదివారం జరిగిన రెండు సెమీఫైనల్స్‌లో జావోఖిర్, వీ యి గెలిచి ఫైనల్లో ప్రవేశించారు. సెమీస్‌లో వీరు సాధించిన విజయాలతో కాండిడేట్స్ టోర్నీకి కూడా అర్హత సాధించారు. ఇక, సెమీస్‌లోని రెండు క్లాసికల్ గేమ్‌లు డ్రాగా ముగియడంతో టైబ్రేకర్లు అనివార్యమయ్యాయి. ఇందులో జావోఖిర్ 2.5-1.5తో నోడిర్బెక్‌పై, వీ యి 2.5-1.5తో ఆండ్రీ ఎసిపెంకోపై గెలిచారు.

బంగ్లాదేశ్ క్లీన్‌స్వీప్

మిర్పూర్: ఐర్లాండ్‌తో రెండు టెస్టుల సిరీస్‌ను బంగ్లాదేశ్ 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. 509 పరుగుల భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన ఐర్లాండ్ ఆదివారం ఆఖరి రోజు 291 పరుగులకే పరిమితమైంది. దీంతో బంగ్లా 217 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. అంతకుముందు ఐర్లాండ్ ఓవర్‌నైట్ స్కోరు 176/6 తో రెండో ఇన్నింగ్స్ ఆరంభించగా.. కాంఫర్ (71 నాటౌట్) పోరాడాడు. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లా 476, ఐర్లాండ్ 265 రన్స్ చేయగా.. బంగ్లా రెండో ఇన్నింగ్స్‌ను 297/4 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది.



ఉట్నూర్ సభలో ఆదివాసీ నాయకుల అభివాదం

లంబాడాలను ఎస్టీల నుంచి తొలగించాల్సిందే

- ఉట్నూర్ ధర్మ యుద్ధం మహాసభలో డిమాండ్
- కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చిన ఆదివాసీలు

ఉట్నూర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాల్సిందేనని ఆదివాసీలు డిమాండ్ చేశారు. సామాజికంగా, ఆర్థికంగా తమ కంటే ఎన్నో రెట్లు ముందున్న లంబాడాలు.. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో గిరిజన కోటా అవకాశాలను వినియోగించుకుంటున్నారని తెలిపారు. చదువు, చైతన్యం లేక గూడేలకే పరిమితమై.. అనేక రంగాల్లో వెనుకబడిన ఆదివాసీలు.. లంబాడాలతో పోటీ పడలేకపోతున్నారని అన్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్ సహా అనేక రాష్ట్రాల్లో బీసీ కోటాలో ఉన్న లంబాడాలను.. తెలంగాణలో కూడా అదే జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని ఎంపీడీవో గ్రౌండ్‌లో ఆదివాసీ సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో 'ఆదివాసీల ధర్మ యుద్ధం మహాసభ' జరిగింది. లంబాడాలను ఎస్టీల నుంచి తొలగించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ తరహాలో రాజకీయ చైతన్యం పొంది, ఉద్యమాలు చేయాలని ఆదివాసీలకు పిలుపునిచ్చారు. ఆదివాసీ సంఘాలతో సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని చెప్పారు. రాష్ట్రంలోని విద్య, ఉద్యోగ రాజకీయ అవకాశాల్లో ఆదివాసీలు నష్టపోతున్నారని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి తెలిపారు. ప్రభుత్వం దిగి రావాలంటే ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

'సురక్షిత గ్రామం' శిక్షణ ప్రారంభం

హైదరాబాద్, నవంబర్ 23(ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారుల భద్రత, అక్రమ మానవ రవాణాను నిరోధించే సేఫ్ విలేజ్ ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరాన్ని డీజీపీ శివధర్ రెడ్డి ప్రారంభించారు. మహిళా భద్రతా విభాగం, మై చాయిస్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ పథకానికి రూపకల్పన చేశారు. దీన్ని తొలుత 7జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపడతారు. మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో పోలీసు అధికారులంతా జాగ్రత్తగా వ్యవహరించాలని, మానవ అక్రమ రవాణాను కట్టడి చేయాలని డీజీపీ శివధర్‌రెడ్డి సూచించారు. భరోసా బృందాలు, షీటీమ్స్‌ను ఈ ప్రాజెక్టులో వాడుకోవాలని ఆయన సూచించారు.

జీపీవోలు ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలి

- తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి

హైదరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామీణ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తేనే క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని ప్రభుత్వం భావిస్తోందని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. గ్రామ పాలన అధికారులు సర్కారు ఆశయాన్ని నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ గ్రామపాలన అధికారుల సంఘం ఆవిర్భావ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న లచ్చిరెడ్డి మాట్లాడుతూ జీపీవోల సమస్యలను పరిష్కరించే బాధ్యత గ్రామపాలన అధికారుల సంఘం తీసుకుంటుందన్నారు. పదోన్నతుల విషయంలో ఆందోళన అవసరం లేదన్నారు. కాగా, తెలంగాణ గ్రామ పాలన అధికారుల సంఘం రాష్ట్ర నూతన కమిటీ అధ్యక్షుడిగా గరికె ఉపేంద్రరావు (హైదరాబాద్), మహిళా అధ్యక్షురాలిగా కంది శిరీషారెడ్డి (హన్మకొండ), ప్రధాన కార్యదర్శులుగా అర్జున్ మల్లారం (సిరిసిల్ల), ఆర్.విజయ్‌కుమార్ (నాగర్ కర్నూలు), కోశాధికారి ఇంజమూరి ఈశ్వర్ (రంగారెడ్డి), సెక్రటరీ జనరల్‌గా వి.లక్ష్మీనర్సింహులు (మహబూబ్‌నగర్), దాసరి వీరన్న (భువనగిరి) ఎన్నికయ్యారు.

పక్కకు పోయిన పైరసీ బొమ్మ

- బెట్టింగ్, మనీల్యాండరింగ్‌పైనే ప్రశ్నలు
- కొలిక్కిరాని 'ఐ బొమ్మ' రవి కేసు.. నేడు సాయంత్రానికి చంచల్‌గూడ జైలుకు రవి
- మరోసారి కస్టడీ కోరే అవకాశం

హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఐ బొమ్మ రవి కేసులో హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. నిందితుడు రవిని ఐదు రోజులు కస్టడీకి తీసుకున్న పోలీసులు.. నాలుగు రోజులుగా పలు కోణాల్లో విచారిస్తున్నారు. సోమవారంతో కస్టడీ పూర్తవుతుంది. నాలుగు రోజుల విచారణ ముగిసినప్పటికీ.. రవి నుంచి వివరాలు రాబట్టడంలో పోలీసులు ఎలాంటి పురోగతీ సాధించలేదని విశ్వసనీయంగా తెలిసింది. ఎన్ని కోణాల్లో ప్రశ్నిస్తున్నా అతడు సహకరించట్లేదని.. 'తెలియదు.. గుర్తు లేదు.. మర్చిపోయా' అనే చెబుతున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. మొదట్లో అతడు ఓటీటీల్లో విడుదలైన సినిమాలను వేరేవారి (థర్డ్‌పార్టీ) నుంచి కొనుగోలు చేసి తన వెబ్‌సైట్లలో పెట్టి ప్రజలకు ఉచితంగా అందించినట్టు.. తర్వాతి కాలంలో ఓటీటీలోకి రాక ముందే కొత్త సినిమాలను ఐబొమ్మలో పెట్టేవాడని పోలీసులు గుర్తించారు. అదెలా సాధ్యమైంది అని పోలీసులు ఎంతగా ప్రశ్నించినా రవి ఎలాంటి వివరాలూ వెల్లడించలేదని తెలిసింది. తొలుత ఐబొమ్మ రవికి సినిమాలు విక్రయించిన ఆ థర్డ్‌పార్టీ వ్యక్తులు ఎవరు అనే దానిపై పోలీసులు దృష్టి సారించినట్లు సమాచారం. అలాగే.. ఐబొమ్మ మాటున రవి ప్రమోట్ చేసిన బెట్టింగ్ యాప్స్, రవి ఖాతాల ద్వారా జరిగిన రూ.కోట్ల విలువైన ఆర్థిక లావాదేవీలపైనే పోలీసులు ఎక్కువగా దృష్టిసారించినట్లు తెలిసింది. అందుకు సంబంధించిన సమాచారం పూర్తిగా సాంకేతికపరమైనది కావడంతో పోలీసులు రవి ఖాతాలున్న 35 బ్యాంకులకు పోలీసులు లేఖలు రాశారు. వాటి నుంచి పూర్తి సమాచారం వస్తే తప్ప.. కేసులో పురోగతి సాధించలేమని పోలీసులు పేర్కొన్నారు. కాగా.. ఐబొమ్మ రవిని అరెస్టు చేసినా సినిమా పైరసీ మాత్రం ఆగడంలేదు. రెండు రోజుల క్రితం విడులైన సినిమాలు సైతం పైరసీకి గురై వివిధ వెబ్‌సైట్లలో ప్రత్యక్షం అవడంతో సైబర్ క్రైమ్ పోలీసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక.. న్యాయస్థానం రవికి అనుమతించిన పోలీస్ కస్టడీ సోమవారం ముగియనున్న నేపథ్యంలో సాయంత్రం అతడికి వైద్యపరీక్షలు నిర్వహించి, న్యాయస్థానంలో హాజరుపరచి చంచల్‌గూడ పీఎస్‌కు తరలిస్తారు. అయితే విచారణ కొలి క్కి రావాలంటే నిందితుణ్ని మరోసారి కస్టడీకి ఇవ్వాల్సిందిగా పోలీసులు పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలిసింది.

నిర్మాత కల్యాణ్‌నే ఎన్‌కౌంటర్ చేయాలి: 'ఐబొమ్మ' రవి తండ్రి


విశాఖపట్నం: సినిమా పైరసీ ద్వారా పరిశ్రమకు తీవ్రనష్టం కలిగించిన ఐబొమ్మ రవిని పోలీసులు ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేసిన సినీ నిర్మాత సి.కల్యాణ్‌పై.. రవి తండ్రి ఇమంది చిన అప్పారావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పోలీసులు సి.కల్యాణ్‌నే ఎన్‌కౌంటర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. "కల్యాణ్ చెబితే పోలీసులు ఎన్‌కౌంటర్ చేసేస్తారా? ఒకవేళ ఆయన చెప్పినట్టే పోలీసులు చేస్తే చట్టాలు ఎందుకున్నాయి" అని ఆయన ప్రశ్నించారు. అసలు సినిమా పైరసీ సమస్య ఎందుకు వచ్చిందో.. ప్రజలు పైరసీని ఎందుకు ఆదరిస్తున్నారో కల్యాణ్ ఒకసారి ఆలోచించుకోవాలని సూచించారు. హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు రెండు రోజుల కిందట తనకు ఫోన్ చేసి రవితో మాట్లాడించారని తెలిపారు. ఒక న్యాయవాదిని పెడతానని రవికి చెబితే, 'నువ్వు బాధపడకు. నాకు న్యాయసాయం చేయడానికి వేరే వాళ్లు ఉన్నారు. ధైర్యంగా ఉండు' అని చెప్పాడని వివరించారు.

టచ్ చేశారో ఖాతా ఖాళీ!

ఏపీకే ఫైల్స్‌తో సైబర్ నేరగాళ్ల పంజా.. ఎస్‌బీఐ పేరిట లక్షలాది మందికి సందేశాలు

- వేలాది ఖాతాల్లో డబ్బు కాజేసిన వైనం
- మంత్రులు, జర్నలిస్టుల గ్రూపుల హ్యాక్
- ఆధార్ అప్‌డేట్ చేసుకోమంటూ వాట్సాప్ సందేశం

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు సరికొత్త ఎత్తుగడతో మళ్లీ పంజా విసిరారు. ఆదివారం ఒకేరోజు పెద్దసంఖ్యలో సెల్‌ఫోన్ వినియోగదారుల వాట్సా‌ప్‌లకు మోసపూరిత పంపి డబ్బులు కొల్లగొట్టేశారు. ఆదివారం బ్యాంకులకు సెలవుదినం కావడంతో దీన్ని అవకాశంగా మల్చుకున్న సైబర్ నేరగాళ్లు రాష్ట్రంలోని లక్షలాది మందికి ఆదివారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) పేరిట ఏపీకే ఫైల్స్ రూపంలో సందేశాలు పంపి.. 'మీ ఆధార్ నెంబర్ ఈ రోజు అర్ధరాత్రి లోపు అప్‌డేట్ చేసుకోవాలి. లేదంటే మీ బ్యాంకు ఖాతా క్లోజ్ అవుతుంది. ఆధార్ అప్‌డేట్ చేసుకోవడానికి వెంటనే ఎస్‌బీఐ ఆధార్ అప్‌డేట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి' అని సూచిస్తూ హెచ్చరించారు. మరోవైపు వేలాది వాట్సాప్ గ్రూపుల్లోకి చొరబడి వాటి అడ్మిన్‌లను కంట్రోల్ తీసుకుని డీపీని ఎస్‌బీఐ చిహ్నం కింద మార్చివేశారు. జర్నలిస్టులు, మంత్రులు, ఆఖరికి సీఎంఓ వాట్సాప్ గ్రూపుల్లోకి సైతం సైబర్ నేరగాళ్లు చొరబడ్డారు. ఆదివారం ఉదయం ఒక జర్నలిస్టుకు సంబంధించిన వాట్సా‌ప్‌కు వచ్చిన సందేశాన్ని అతను పొరపాటున ఓపెన్ చేయడంతో ఆయన ఫోన్‌లో ఉన్న అన్ని వాట్సాప్ గ్రూపుల్లోకి సైబర్ నేరగాళ్లు చొరబడి తీవ్ర కలకలం సృష్టించారు. వీరు పంపించిన ఏపీకే ఫైలును తెరిచిన వెంటనే ఫోన్లు హ్యాంగ్ అయిపోతుండటం, బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు ఖాళీ అవుతుండటంతో వేలాది మంది సైబర్ క్రైం విభాగానికి ఫిర్యాదులు చేశారు. సీనియర్ సిటిజన్లు చాలామంది తమ వాట్సా‌ప్‌కు అది బ్యాంకు నుంచి వచ్చిన నిజమైన సందేశమని నమ్మి ఏపీకే ఫైళ్లను ఓపెన్ చేసి ఫోన్లు హ్యాక్ కావడంతో గందరగోళానికి గురవుతున్నారు. ఎస్‌బీఐ పేరిట వచ్చిన ఏపీకే ఫైల్‌ను పొరపాటున ఇన్‌స్టాల్ చేస్తే వెంటనే హ్యాకర్లు ఆ ఫోన్‌కు సంబంధించిన ఓటీపీలు, ఎస్ఎంఎస్‌లు, యూపీఐ పిన్‌లు తెలుసుకుంటారు. నిమిషాల వ్యవధిలో బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తారు. హ్యాకింగ్‌కు గురైన వారి ఫోన్‌లోని కాంటాక్ట్‌లో పలువురికి వాట్సాప్ ద్వారా డబ్బు పంపాలని సందేశాలు పంపుతారు. లేదా వాట్సాప్ ద్వారా భయపెట్టే సందేశాలను పంపుతారు. స్క్రీన్ రికార్డింగ్ ఆటోమేటిక్‌గా ఆన్ అయిపోతుంది. యూపీఐ పేమెంట్ యాప్స్‌కు వారు లాగిన్ అయిపోతారు.



సైబర్ నేరగాళ్లు పంపిన సందేశం

తల్లికి సీరియస్‌గా ఉందంటూ

ఆదివారం ఒక మహిళా జర్నలిస్టు ఇలాంటి ఏపీకే ఫైల్‌ను ఓపెన్ చేయడంతో హ్యాకర్లు ఆమెకు చెందిన కాంటాక్ట్స్‌లోకి చొరబడి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు వాట్సాప్ సందేశాన్ని పంపించారు. ఆమె తల్లికి సీరియస్‌గా ఉందని, వెంటనే డబ్బు పంపాలని కోరారు. కొద్దిసేపటికి ఆమె ఖాతాల్లో జమ అయిన రూ.12 లక్షలను సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టారు. మీ ఖాతాలో ఇతరుల ద్వారా డబ్బు వేయించి కొల్లగొట్టడం కొత్త యత్నమని నిపుణులు అంటున్నారు.

వాటిని ఓపెన్ చేయొద్దు: సైబర్ సెక్యూరిటీ బ్యూరో

మోసపూరిత సందేశాల నేపథ్యంలో సెల్‌ఫోన్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలంటూ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఆదివారం హ్యాకర్లు ఎస్‌బీఐ పేరిట ఫిషింగ్ స్కామ్‌కు పాల్పడ్డారని, ఎస్‌బీఐ పేరిట వచ్చిన ఏ సందేశాన్ని ఓపెన్ చేయవద్దని అలర్ట్ సందేశాన్ని విడుదల చేశారు. ఆధార్ అప్‌డేట్ కోసం బ్యాంకులు తమ వినియోగదారుల సెల్‌ఫోన్లకు ఎలాంటి సందేశాలు పంపించవని, దీన్ని అందరూ గమనించాలన్నారు. ఇలాంటి సందేశం వచ్చిన నెంబర్‌ను బ్లాక్ చేయాలని పేర్కొన్నారు. ఒకవేళ ఏపీకే ఫైల్‌ను ఇన్‌స్టాల్ చేసి ఉంటే వెంటనే ఆ ఫోన్‌ను ఏరోప్లేన్ మోడ్‌లో పెట్టాలని, మీ బ్యాంకులకు సంబంధించిన కస్టమర్ కేర్‌కు కాల్ చేసి నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్ కార్డులను బ్లాక్ చేయించుకోవాలని అధికారులు సూచించారు.

ఆగివున్న చోటే దూసుకొచ్చిన మృత్యువు!

- నంద్యాలలో ప్రైవేట్ బస్సును ఢీకొన్న లారీ.. ఇద్దరు టెకీల మృతి

ఆళ్లగడ్డ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న బస్సును వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొనడంతో ఇద్దరు టెకీలు మృత్యువాత పడ్డారు. మరో తొమ్మిది మంది గాయపడ్డారు. మైత్రి ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేటు బస్సు హైదరాబాద్ నుంచి 33 మంది ప్రయాణికులతో శనివారం పుదుచ్చేరికి బయలు దేరింది. ఆదివారం తెల్లవారుజామున నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం పేరాయిపల్లె మెట్ట వద్ద జాతీయ రహదారిపైకి రాగానే ఇద్దరు ప్రయాణికులు బహిర్భూమికి వెళ్లాలని డ్రైవర్‌ను కోరడంతో ఆయన బస్సును రోడ్డు పక్కన నిలిపారు. ఇంతలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ.. బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సులో వెనుక సీట్లలో కూర్చున్న పుదుచ్చేరికి చెందిన పి.హరిత(23), గద్వాల జిల్లాకు చెందిన గడ్డం బద్రీనాథ్(25) అక్కడికక్కడే మృతి చెందారు. మరో తొమ్మిదిమంది గాయపడగా ఆళ్లగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో హైదరాబాద్‌కు చెందిన బండ్ల శ్రావ్య, రాయచోటికి చెందిన ఖాదర్‌వలీ, ఆశాబేగం, లారీ డ్రైవర్ సురేశ్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో నంద్యాల ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ సునీల్ షెరాన్ పరిశీలించారు.

సీటు మారిన వ్యక్తి సేఫ్..

గడ్డం బద్రీనాథ్, హరిత స్నేహితులు. వీరు హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. పుదుచ్చేరిలో ఉన్న స్నేహితులను కలిసి.. అక్కడ విహారయాత్రకు వెళ్లాలని హైదరాబాద్ నుంచి మైత్రి ట్రావెల్ బస్సులో బయలుదేరారు. సీటు నంబరు ఎఫ్-6 బద్రీనాథ్‌కు, ఎఫ్-2 హరితకు రిజర్వ్ అయింది. అయితే తనకు రిజర్వ్ అయిన ఎఫ్-2 సీట్‌లో కూర్చోవాలని హరిత ఎఫ్-4 సీటులో కూర్చున్న హైదరాబాద్‌కు చెందిన నరసింహారెడ్డిని విజ్ఞప్తి చేసింది. దీంతో ఇద్దరూ తమ సీట్లను ఎక్స్ఛేంజ్ చేసుకున్నారు. స్నేహితులిద్దరూ సమీపంలోని సీట్లలో కూర్చున్నారు. ప్రమాదంలో ఇద్దరూ మృతి చెందగా, నరసింహారెడ్డి ప్రాణాలతో బయటపడ్డారు.

బిజినెస్

అదానీకనెక్స్ చేతికి ట్రేడ్ క్యాజిల్ టెక్ పార్క్

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌కు చెందిన జాయింట్ వెంచర్ అదానీకనెక్స్..ముంబైకి చెందిన మౌలిక వసతుల అభివృద్ధి కంపెనీ ట్రేడ్ క్యాజిల్ టెక్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్‌ను (టీసీటీపీపీఎల్) రూ. 231.34 కోట్లకు చేజిక్కించుకున్నట్లు ప్రకటించింది. దేశంలో డేటా సెంటర్ల రంగంలో భారీ విస్తరణకు సిద్ధమవుతున్న అదానీకనెక్స్.. ఈ మేరకు టీసీటీపీపీఎల్ వాటాదారులైన అయిన శ్రీ నమాన్ డెవలపర్స్, జయేస్ షాలతో కొనుగోలు ఒప్పందం (ఎస్‌పీఏ) కుదుర్చుకుంది. ఈ డీల్ ఈ నెల 25 నాటికి పూర్తయ్యే అవకాశముంది. వచ్చే పదేళ్లలో 1 గిగావాట్ జాతీయ డేటా సెంటర్ నెట్‌వర్క్‌ను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న అదానీకనెక్స్ హైదరాబాద్, చెన్నై, నవీ ముంబై, నోయిడా, పుణేలో డేటా సెంటర్లను నిర్వహిస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (సెక 100 గుడ్లు)



24వ తేదీ			
హైదరాబాద్	650	విజయవాడ	660
వరంగల్	652	గోదావరి	645
చిత్తూరు	673	విశాఖపట్నం	635
		డజను గుడ్లు రూ. 90	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	103
వరంగల్	107	గుంటూరు	108
కరీంనగర్	107	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	106
కర్నూలు	107	నెల్లూరు	111
విశాఖపట్నం	100	అనంతపురం	111
గోదావరి	103		

ఈ ఏడాది చివరికి బ్రేక్ ఈవెన్

చైనా ప్లాంటు నష్టాలపై అరబిందో ఫార్మా సీఎఫ్‌ఓ

- పెన్సిలిన్-జీకి కనీస దిగుమతి ధర ఉండాలి



న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న అరబిందో ఫార్మా చైనాలో ఏర్పాటు చేసిన ఓరల్ సాలిడ్ డోసేజి (ఓఎస్‌డీ) ప్లాంటు ఇంకా నష్టాల్లోనే నడుస్తోంది. ఈ త్రైమాసికంలో నష్టం 10 లక్షల డాలర్ల (సుమారు రూ.8.9 కోట్లు) వరకు ఉంటుందని కంపెనీ సీఎఫ్ఓ ఎస్ సుబ్రమణియన్ తెలిపారు. అయితే ఈ ఆర్థిక సంవత్సరం చివరికల్లా చైనా ప్లాంటు లాభ-నష్టాలు లేని స్థితికి (బ్రేక్ ఈవెన్) చేరే అవకాశం ఉందన్నారు. కంపెనీ స్థూల లాభాలు పెంచడంలో ముందు ముందు చైనా ప్లాంటు పాత్ర కూడా ఉంటుందన్నారు. విశ్లేషకుల ప్రశ్నలకు సమాధానంగా ఆయన ఈ విషయాలు వెల్లడించారు.

చైనా ప్లాంటు ప్రత్యేకతలు: చైనాలో ఈ ప్లాంటు ఏర్పాటు కోసం అరబిందో ఫార్మా 14.5 కోట్ల డాలర్లు (సుమారు రూ.1,290 కోట్లు) ఖర్చు చేసింది. ఏటా 200 కోట్ల డోసుల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ గత ఏడాది నవంబరులో ఉత్పత్తి ప్రారంభించింది. ఈ ప్లాంటులో తయారుచేసే 10 ఉత్పత్తులకు యూరోపియన్ యూనియన్, మూడు ఉత్పత్తులకు చైనా ఔషధ నియంత్రణ సంస్థల ఆమోదం ఉంది. దీంతో ముందు ముందు ఈ ప్లాంటు తమ లాభాల వృద్ధికి చెప్పుకోదగ్గ స్థాయిలో సహకరిస్తుందని అరబిందో ఫార్మా భావిస్తోంది.

దేశీయ వ్యాపారం: దేశీయ వ్యాపారం పైనా అరబిందో ఫార్మా సుబ్రమణియన్ మాట్లాడారు. ఏటా 15,000 టన్నుల పెన్సిలిన్-జీ ఉత్పత్తి సామర్థ్యంతో కాకినాడ సెజ్‌లో ఏర్పాటు చేసిన ప్లాంటులో ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 1,050 టన్నుల పెన్సిలిన్ జీ ఉత్పత్తి చేసినట్టు సుబ్రమణియన్ చెప్పారు. ఇది ప్లాంటు మొత్తం ఉత్పత్తి సామర్థ్యంలో 40 నుంచి 50 శాతం మాత్రమే. ప్రభుత్వం ఈ ఉత్పత్తికి కనీస దిగుమతి ధర (ఎంఐపీ) నిర్ణయిస్తే తప్ప, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్లాంటు పనిచేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. దేశంలో పెన్సిలిన్ జీ ఉత్పత్తి చేసే అనేక కంపెనీలు ఇప్పటికే దీనిపై ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

అమెరికా, ఈయూ బేష్: అమెరికా, ఈయూ దేశాలు అరబిందోఫార్మాకు కీలక మార్కెట్లని సుబ్రమణియన్ చెప్పారు. ఈయూ దేశాలు వ్యూహాత్మకంగా మరింత కీలకమన్నారు. అక్కడ తమ ఆదాయ వృద్ధి అద్భుతంగా ఉందన్నారు. అమెరికాలోని డేటన్‌లో ఏర్పాటు చేసిన ప్లాంటులోనూ వాణిజ్య స్థాయి ఉత్పత్తి ప్రారంభమైందన్నారు. వచ్చే జనవరి నుంచి ఈ ప్లాంటు ఉత్పత్తులు మార్కెట్‌లో విడుదలవుతాయన్నారు. దీంతో 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ ప్లాంటు కంపెనీ ఆదాయ వృద్ధికి గణనీయంగా తోడ్పడుతుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. వచ్చే రెండేళ్లలో పెన్సిలిన్ జీ ఉత్పత్తి సామర్థ్య విస్తరణ, బయోసిమిలర్స్ బయోలాజిక్ సీఎంఓ కార్యకలాపాలు కంపెనీ ఆదాయాలు, లాభాల వృద్ధికి పెద్ద ఊతం కానున్నాయన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం 20–21 శాతం మార్జిన్ల లక్ష్యాన్ని అందుకోగలమని సుబ్రమణియన్ విశ్వాసం వ్యక్తం చేశారు.

మళ్లీ తెరపైకి బీమా కంపెనీల విలీన ప్రతిపాదన

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని మూడు బీమా కంపెనీల విలీన ప్రతిపాదన మళ్లీ తెరపైకి వచ్చింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రభుత్వం ఇందుకు సంబంధించిన బిల్లును సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఆర్థిక పరిసితి మెరుగైనందున ఓరియంటల్ ఇన్సూరెన్స్, నేషనల్ ఇన్సూరెన్స్, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలను విలీనం చేసి ఒకే కంపెనీగా చేయాలని ప్రభు త్వం యోచిస్తున్నట్టు సమాచారం. నిజానికి 2018-19 ఆర్థి క సంవత్సరంలోనే అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈ ప్రతిపాదన తెచ్చారు. ఈ లోగా తీవ్ర ఆర్థిక కష్టాల్లో ఉన్న ఈ కంపెనీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభు త్వం 2019-22 మధ్య కాలంలో రూ.17,450 కోట్ల నిధులు కూడా సమకూర్చింది. ప్రైవేటు పరం చేస్తే ఉద్యోగ సంఘా ల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం ఉన్నందున, ఈ మూడు ప్రభుత్వ రంగ బీమా కంపెనీలను ఒకటిగా విలీనం చేయడమే మంచిదని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

26,375 పైన బుల్లిష్

(నవంబరు 24-28 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ : 26068 (+158)

నిఫ్టీ గత వారం 26246-25864 పాయింట్ల మధ్యన కదలాడి 158 పాయింట్ల లాభంతో 26068 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 26375 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25844, 25452, 25192, 25415 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి : 26350 **బ్రేక్‌డౌన్ స్థాయి :** 25700
నిరోధ స్థాయిలు : 26275, 26375, 26475 (26175 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు : 25875, 25775, 25675 (25975 దిగువన బేరిష్)

రియల్టీలో లిస్టెడ్ కంపెనీల అమ్మకాల జోరు

ఆరు నెలల్లో రూ.92,437 కోట్లు

న్యూఢిల్లీ: వర్తమాన ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలలు దేశంలోని 28 లిస్టెడ్ రియల్టీ కంపెనీలకు బాగానే కలిసొచ్చింది. ఈ కాలంలో ఈ కంపెనీలు రూ.92,437 కోట్ల విలువైన ఇళ్ల అమ్మకాలు నమోదు చేశాయి. ఇందులో టాప్-5 కంపెనీల వాటానే రూ.63,000 కోట్లకు (70%) పైగా ఉంది. కొవిడ్ తర్వాత అన్ని వసతులు ఉన్న నివాస గృహాలకు గిరాకీ పెరగడం, చిన్న చిన్న బిల్డర్ల వద్ద కొని ఇబ్బందులు పడేందుకు కొనుగోలుదారులు ఇష్టపడకపోవడం ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. రెరా వచ్చినా చిన్న చిన్న బిల్డర్లపై నమ్మకం లేకపోవడం సైతం ఇందుకు దోహదం చేసింది.

టాప్-5 లిస్టెడ్ సెల్లర్స్

కంపెనీ పేరు	అమ్మకాలు(రూ.కోట్లలో)
ప్రెస్టీజ్ గ్రూప్	రూ.18,147.7
డీఎల్ఎఫ్	రూ.15,757
గోద్రెజ్ ప్రాపర్టీస్	రూ.15,587
లోథా డెవలపర్స్	రూ.9,020
సిగ్నేచర్ గ్లోబల్	రూ.4,650

గ్లోబల్ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు..

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడవచ్చు. క్రితం వారం ప్రారంభంలో రాణించిన సూచీలు గ్లోబల్ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో ఆఖరిలో చతికిలపడ్డాయి. రూపాయి పతనం, యెన్, డాలర్ బాండు రాబడుల పెరుగుదల, అనిశ్చితి, యూఎస్ ఫెడ్ నిర్ణయాలు కీలకమవుతాయి. ప్రస్తుతం ఐటీ, ఆటో, ఫార్మా, ఫైనాన్స్ రంగాల షేర్లు జోరు ప్రదర్శిస్తున్నాయి.

స్టాక్ రికమెండేషన్స్

ఎస్‌బీఐ కార్డ్: ప్రస్తుతం ఈ షేర్లు మధ్యకాలిక అప్‌ట్రెండులో ఉన్నాయి. తాజా ఫలితాల తర్వాత 12% వరకు దిద్దుబాటుకు లోనయ్యాయి. కీలకమైన రూ.880 స్థాయిలో మరోసారి మద్దతు లభించింది. గత శుక్రవారం రూ.878 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.990 టార్గెట్ ధరతో రూ.850పై స్థాయిలో పొజిషన్ తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.830.

ఐటీసీ: గత ఏడాది సెప్టెంబరు నుంచి ఈ షేర్లు దాదాపుగా 20% మేర కుంగాయి. కీలక మద్దతు స్థాయి రూ.400కి చేరడంతో టర్న్ అరౌండ్ సూచనలు కనిపిస్తున్నాయి. గత శుక్రవారం రూ.407 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.455/470 టార్గెట్ ధరతో రూ.400పై స్థాయిలో ప్రవేశించవచ్చు. స్టాప్‌లాస్ : రూ.385.

టెక్ మహీంద్రా: ప్రస్తుతం ఐటీ రంగం టర్న్ అరౌండ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో టెక్ మహీంద్రా షేర్లపై ఆసక్తి పెరిగింది. 52 వారాల గరిష్ఠం నుంచి 25% మేర పతనమైన ఈ షేర్లలో ఇప్పుడిప్పుడే మూమెంటమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.1461 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.1650 టార్గెట్ ధరతో రూ.1450 పై స్థాయిలో పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ. 1420.

హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్: ఈ షేర్లలో గరిష్ఠ స్థాయుల్లో కన్సాలిడేషన్ కొనసాగుతోంది. మరోసారి ఇవి 10, 20, 50 డీఎంఏల పైన మద్దతు తీసుకున్నాయి. రిలేటివ్ స్ట్రెంత్ సైతం క్రమంగా పెరుగుతోంది. గత శుక్రవారం రూ.764 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.820 టార్గెట్ ధరతో రూ.750 శ్రేణిలో ప్రవేశించాలి. స్టాప్‌లాస్ : రూ.730

ఎస్కార్ట్స్: ఈ షేర్లు మధ్యకాలిక అప్‌ట్రెండ్‌లో కన్సాలిడేషన్ ట్రెండ్‌లో కొనసాగుతున్నాయి. వాల్యూమ్ తక్కువగా నమోదవ్వడాన్ని బట్టి ఇన్వెస్టర్ల ఆసక్తి కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.3617 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.3850 టార్గెట్ ధరతో రూ.3600 పై స్థాయిలో పొజిషన్ తీసుకోవాలి. స్టాప్‌లాస్ : రూ. 3565.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో పరీక్ష



వి. సుందర్ రాజా

గత వారం నిఫ్టీ కీలక స్థాయి 26,000 వరకు వెళ్లి రియాక్షన్‌లో పడినప్పటికీ గురువారం తిరిగి కోలుకుని జీవితకాల గరిష్ఠ స్థాయి 26,300 వరకు వెళ్లింది. శుక్రవారం నాటి రియాక్షన్‌లో కూడా 26,000 కన్నా పైనే నిలదొక్కుకుని 26,070 వద్ద ముగిసింది. గరిష్ఠ స్థాయిల్లో ప్రతిఘటన ఎదురవుతోందనేందుకు ఇది సంకేతం. టెక్నికల్‌గా మార్కెట్ అప్‌ట్రెండ్‌లోనే ఉంది. గత వారం 26,000 వద్ద బ్రేకౌట్ సాధించినందు వల్ల ఈ వారంలో పుల్‌బ్యాక్ రియాక్షన్ ఏర్పడవచ్చు. సుమారు ఏడాది తర్వాత మార్కెట్ మరోసారి జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో పరీక్షకు సమాయత్తం అవుతోంది. అప్రమత్తంగా ఉండాలి.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం మార్కెట్ ప్రధాన నిరోధం 26,300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన మరిన్ని ఉన్నత శిఖరాల దిశగా ప్రయాణం సాగిస్తుంది.

బేరిష్ స్థాయిలు: మార్కెట్ ప్రస్తుతం 26,000 కన్నా స్వల్పంగా పైన ఉంది. ఇక్కడ విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ఏర్పడవచ్చు. ప్రధాన మద్దతు స్థాయిలు 25700, 25450.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత శుక్రవారం రియాక్షన్‌కు గురికావడం గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్త సంకేతం. పాజిటివ్ ట్రెండ్‌లో ప్రవేశించినట్టయితే నిరోధ స్థాయి 59,300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. రియాక్షన్‌లో పడినా ప్రధాన మద్దతు స్థాయి 58,700 వద్ద నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీన పడుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 58,000.

పాటర్న్: నిఫ్టీ గత శుక్రవారం రివర్స్ డౌన్‌సైడ్ బ్రేకౌట్ సాధించింది. గరిష్ఠ స్థాయిల్లో కన్సాలిడేషన్ లేదా రియాక్షన్ ఏర్పడవచ్చుననేందుకు ఇది సంకేతం. 26,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది. గత వారం 26,300 వద్ద డబుల్ టాప్ పాటర్న్ ఏర్పడడం కూడా ఆ స్థాయిలో నిరోధం ఎదురవుతోందనేందుకు సంకేతం.

టైమ్ : ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	26,200, 26,300
మద్దతు	26,000, 25,900

నేడు స్పీకర్ ముందుకు దానం?

» అనర్హత అంశంలో వివరణ ఇచ్చేందుకు ముగిసిన గడువు

» స్పీకర్‌ను మరింత గడువు కోరినట్టు ప్రచారం

హైదరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌పై వివరణ ఇచ్చేందుకు శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్.. దానంకు ఇచ్చిన గడువు ఆదివారంతో ముగిసింది. అయితే వివరణ ఇచ్చేందుకు తనకు మరికొంత సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తూ దానం నాగేందర్ స్పీకర్‌కు లేఖ రాశారని ప్రచారం జరిగింది. కానీ అలాంటి లేఖ వచ్చినట్లుగా స్పీకర్ కార్యాలయం ధ్రువీకరించలేదు. అయిత, ఆదివారం సెలవు రోజు కావడంతో దానం నాగేందర్ సోమవారం స్పీకర్‌ను కలిసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసే అంశానికి సంబంధించి కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కలిసిన దానం నాగేందర్.. పార్టీ పెద్దల ముందు పలు ప్రతిపాదనలు పెట్టినట్లుగా ప్రచారం ఉంది. ఆ ప్రతిపాదనలపై అధిష్ఠానం స్పందన ప్రకారం.. రాజీనామా విషయంలో దానం నాగేందర్ నిర్ణయం తీసుకుంటారని చెబుతున్నారు.



మా కుమారుడి నిశ్చితార్థానికి రండి..

» సీఎం రేవంత్‌రెడ్డికి డిప్యూటీ సీఎం భట్టి ఆహ్వానం

హైదరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న జరగనున్న తమ కుమారుడు సూర్య విక్రమాదిత్య నిశ్చితార్థ వేడుకకు కుటుంబ సమేతంగా హాజరు కావాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మని వారివారి నివాసాల్లో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దంపతులు ఆహ్వాన పత్రికను అందజేశారు.భట్టి సోదరుడు ఎంపీ మల్లు రవి కూడా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

చేనేత కార్మికుల బతుకులు దయనీయం: కవిత

కొత్తకోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేనేత కార్మికుల బతుకులు దయనీయంగా ఉన్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. వనపర్తి జిల్లా కొత్తకోటలోని వీవర్స్ కాలనీలో ఆదివారం పర్యటించిన ఆమె.. చేనేత కార్మికుల కుటుంబాలతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. నేతన్నలు ఎంతో నైపుణ్యం, కళాత్మకతతో చీరలు తయారు చేస్తున్నా.. వారి ఉత్పత్తులను మార్కెట్‌లో నేరుగా అమ్ముకునే పరిస్థితి లేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వ్యాపారులపై ఆధారపడి జీవనం సాగించాల్సి వస్తోందన్నారు.

టిమ్స్‌పై సర్కారుది నేరపూరిత నిర్లక్ష్యం: హరీశ్

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను తెగనమ్మడంపై సీఎంకు ఉన్న శ్రద్ధ ప్రజలకు వైద్య సేవలందించే ఆసుపత్రులపై లేకపోవడం సిగ్గుచేటని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణాలు పూర్తిచేయకుండా, పేదలకు వైద్యం అందించకుండా దుర్మార్గ కాంగ్రెస్ ప్రభుత్వం నేరపూరిత నిర్లక్ష్యం చూపుతోందన్నారు. వీటిని ఎప్పుడు ప్రారంభిస్తారో కోతల రేవంత్‌రెడ్డి చెప్పాలని ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన డిమాండ్ చేశారు. సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణ పనులపై ప్రభుత్వం తీరు చూస్తే నత్త కూడా ఆత్మహత్య చేసుకుంటుందని ఎద్దేవా చేశారు. సీఎం సహా కాంగ్రెస్ మంత్రుల మాటలు కోటలు దాటితే, ఆచరణ గడప దాటదని చెప్పడానికి టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణంలో జాప్యమే నిదర్శనమన్నారు.

నేడో.. రేపో.. నగారా..!

» పంచాయతీ, వార్డుల రిజర్వేషన్లపై జిల్లాల్లో గెజిట్‌ల జారీ

» నేడు ఎస్ఈసీకి అందజేయనున్న పీఆర్

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నగారా మోగించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. ఈ నెల 26న ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల నిర్వహణను సైతం తొందర్లోనే పూర్తిచేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. గ్రామ పంచాయతీలకు జరగబోయే ఎన్నికలకు సంబంధించి.. ఆయా జిల్లాల్లో సర్పంచ్, వార్డు సభ్యులకు సంబంధించి రిజర్వేషన్ల ప్రక్రియ దాదాపు పూర్తయింది. ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా.. వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఎంపీడీవోలు ఖరారు చేయగా, సర్పంచుల రిజర్వేషన్లను ఆర్డీవోలు సిద్ధం చేశారు. ఎంపీడీవోలు, ఆర్డీవోలు తమ పరిధిలోని మండలాల వారీగా రూపొందించిన రిజర్వేషన్ల జాబితా కలెక్టర్లకు సమర్పించారు. వారు అందించిన వివరాల ఆధారంగా నిబంధనలను సరిపోల్చుకుని.. జిల్లాల వారీగా (హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలు మినహా) సర్పంచ్, వార్డుసభ్యుల రిజర్వేషన్లకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను కలెక్టర్లు ఆదివారం విడుదల చేశారు. గెజిట్ కాపీలను పూర్తి సమాచారంతో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు ఆన్‌లైన్‌లో చేరవేశారు. జిల్లాల వారీగా రిజర్వేషన్లకు సంబంధించిన జాబితా ఇప్పటికే ప్రజా సంబంధాల శాఖకు చేరింది. ఏ జిల్లానుంచైనా రావాల్సిన తుది జాబితా ఉంటే, సోమవారం ఉదయంలోపు సేకరించి.. రాష్ట్ర ఎన్నిల సంఘానికి సమర్పించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. రిజర్వేషన్ల ఖరారు పూర్తయిన తర్వాతనే ఎన్నికల ప్రక్రియకు మార్గం సుగమం అవుతుంది. రిజర్వేషన్లను సూచిస్తూ.. జిల్లాల్లో విడుదలైన గెజిట్ సమాచారం ఆధారంగానే ఎస్ఈసీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉంది.

ఎన్నికల నిర్వహణకు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు

రాష్ట్రవ్యాప్తంగా 12,760 సర్పంచు, 1,12,534 వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించి ఎన్నికల నిర్వహణ కోసం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. గ్రామ పంచాయతీల వారీగా తుది ఓటరు జాబితాలు సిద్ధం అయ్యాయి. ఓటర్లు ఒక వార్డు నుంచి మరో వార్డుకు మారడం, ఒక కుటుంబంలోని ఓటర్లందరూ ఒకేవార్డులో ఉండేలా మ్యాపింగ్‌లో తప్పులు సరిదిద్దే ప్రక్రియ పూర్తయింది. మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు అందడంతో అధికారులు ఆయా ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు. పార్టీ గుర్తుల్లేకుండానే సర్పంచ్, వార్డుసభ్యుల ఎన్నికలు చేపడుతున్నప్పటికీ.. ఆయా గ్రామాల్లో పోటీచేసే అభ్యర్థుల్లో, గెలుపు గుర్రాలపై రాజకీయ పార్టీలు దృష్టిపెట్టాయి. పోటీ చేయాలనుకునే వారు సైతం ఆయా పార్టీల మద్దతు కూడగట్టుకుంటూనే, ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. తమ మద్దతుతో గెలిచే అభ్యర్థుల ద్వారా భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవాలన్న యోచనలో ఆయా పార్టీలు.. కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుంటున్నాయి.

సత్యసాయి.. ప్రజల్లో దేవుడిని చూసిన

మహానుభావుడు

(మొదటిపేజీ తరువాయి)

తోడ్పడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని హిల్‌వ్యూ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన సత్యసాయి శతజయంత్యుత్సవాల్లో రేవంత్ ప్రసంగించారు. "తన సేవలతో ప్రజలలో సత్యసాయి దేవుడయ్యారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించడం ద్వారా ట్రస్టు లక్షలాది మంది జీవితాలకు వెలుగునిచ్చింది. ప్రభుత్వాలకు సరితూగే స్థాయిలో, కొన్ని సందర్భాల్లో అంతకుమించి సేవలు అందిస్తోంది. ప్రభుత్వ వైద్య సేవలు అందని ప్రాంతాల్లో బాబా ఆస్పత్రులు అనేక మందికి ప్రాణదానం చేస్తున్నాయి. తెలంగాణలోని పాలమూరు, ఏపీలో అనంతపురం జిల్లా లాంటి కరువు ప్రాంతాల్లో ప్రభుత్వాలు పరిష్కరించలేని తాగునీటి సమస్యను బాబా ట్రస్టు పరిష్కరించింది. అందుకే సత్యసాయి ప్రాణమిచ్చే దేవుడి స్థానాన్ని పొందారు" అని రేవంత్ పేర్కొన్నారు. శాంతి, ప్రేమ, నిస్వార్థ సేవలకు భగవాన్ సత్యసాయిబాబా ప్రతిరూపమని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ఆయన బోధనలు.. 'అందరినీ ప్రేమించు-అందరినీ సేవించు, ఎల్లప్పుడూ సాయపడు, ఎన్నటికీ బాధించకు' వంటివి విశ్వవ్యాప్తంగా కోట్లాది మందిని ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు. 1964-65 మధ్య తన కుటుంబానికి సత్యసాయి ఆశీస్సులు అందాయని.. తమిళం మాత్రమే తెలిసిన తన అత్తయ్య ఒంటరిగా పుట్టపర్తికి వచ్చి, 15 రోజులు ఇక్కడ ఉండి బాబా ఆశీస్సుల అందుకోవడం దైవిక శక్తికి నిదర్శనమని గుర్తు చేసుకున్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు దేశవ్యాప్తంగా అందిస్తున్న సేవలను ప్రశంసించారు. సంఘర్షణలు, ఒత్తిళ్లతో నిండిన నేటి ప్రపంచానికి ఆయన బోధించిన ప్రేమ, ఐక్యత, సేవ వంటి విలువలు మరింత అవసరమన్నారు. కాగా, మానవ విలువల వికాసానికి సత్యసాయి అందించిన సేవలు అపూర్వమని త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి కొనియాడారు. మానవత్వం, దైవత్వం మధ్య ఉన్న దూరాన్ని తగ్గించేందుకు సత్యసాయి ట్రస్టును ఏర్పాటు చేయడం బాబా తీసుకున్న దైవ నిర్ణయమని చెప్పారు. ఆయన శత జయంత్యుత్సవాలు భావి తరాలకు సేవామార్గంలో పునఃసమర్పణగా నిలవాలని ఆకాంక్షించారు.



సత్యసాయి శతజయంత్యుత్సవాల్లో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, సీఎం రేవంత్, ఏపీ సీఎం చంద్రబాబు, లోకేశ్ తదితరులు

లక్ష్యం కోసం అవతరించిన మహోన్నతుడు

ప్రజలకు జ్ఞానాన్ని బోధించి, సన్మార్గం చూపే లక్ష్యంతో అవతరించిన మహోన్నతుడు సత్యసాయి బాబా అని ఏపీ సీఎం చంద్రబాబు చెప్పారు. "సమాజ సేవ, సమస్యకు పరిష్కారం, ఆధ్యాత్మిక భావన, ప్రశాంత జీవనం, ముక్తి మార్గంతో కోట్ల మంది జీవితాలను బాబా ప్రభావితం చేశారు. విశ్వశాంతి, విశ్వ సౌభాగ్యం, సకల జనుల సంక్షేమాన్ని ఆయన కోరుకున్నారు. భగవాన్ మనో దర్శనం ద్వారా దేశ, విదేశాల నుంచి సంపన్నులు, ప్రముఖులు వచ్చి ఆయన సేవా మార్గాన్ని అనుసరించారు. ఎక్కడా లేని ప్రశాంతతను పుట్టపర్తిలో పొందారు" అని పేర్కొన్నారు. ఇక ప్రేమ, అహింస, సత్యం, ధర్మం, శాంతి ప్రతి మనిషి జీవిత పరమార్థమని సత్యసాయి బోధించారని.. భగవాన్ శతజయంత్యుత్సవాల్లో పాల్గొనడం తన అదృష్టమని మంత్రి లోకేశ్ చెప్పారు.

సర్వం.. సాయి స్మరణ

పుట్టపర్తి: 'సత్యమే యథార్థం. అదే నా తత్వం. నాపేరు కూడా సత్యం. నా ప్రచారమే సత్యం. నేనే సత్యం..' అని ప్రకటించుకున్న పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో రాష్ట్ర ప్రభుత్వం, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సంయుక్తంగా నిర్వహించిన ఈ వేడుకలకు దేశ విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు, ప్రముఖులు తరలివచ్చారు. వేడుకలలో చివరి రోజు, సత్యసాయి జయంతి అయిన ఆదివారం పుట్టపర్తిలోని హిల్‌వ్యూ స్టేడియం ఉదయం ఏడు గంటలకే భక్తజనంతో నిండిపోయింది. నిర్మల, నిస్వార్థ సేవ, ప్రేమను పంచిన సత్యసాయికి జయము జయము అని భక్తులు స్మరించుకున్నారు. శాంతి వేదిక వద్దకు చేరుకున్న స్వర్ణ రథానికి సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ మంగళహారతి ఇచ్చారు. అనంతరం వేదికపై సత్యసాయి శత జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆర్‌జే రత్నాకర్ అతిథులకు స్వాగతం పలికారు. శత జయంతి వేడుకలలో రెండు రోజుల పాటు పాల్గొన్న ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ సత్కరించారు. భగవాన్ సత్యసాయి బాబా ప్రారంభించిన సత్యసాయి మిషన్‌కు భక్తులే మూలస్తంభాలు అని అన్నారు. వేడుకలకు హాజరైన ఉప రాష్ట్రపతి, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సహా వీవీఐపీలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

తెలుగు నేల వరప్రసాదం సత్యసాయి

» రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

» రవీంద్రభారతిలో ఘనంగా సత్యసాయి శత జయత్యుత్సవం



హైదరాబాద్ సిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయి బాబా తెలుగు నేల వర ప్రసాదమని, దైవ దూత అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బోధనల ద్వారా ప్రేమ, కరుణను మానవాళికి పంచిన సత్యసాయి సేవా భావాన్ని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సత్యసాయి సేవా సంస్థలు సంయుక్తంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహించిన సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. యువత రీల్స్, ఇన్‌స్టా వంటి సామాజిక మాధ్యమాలలో తమ సమయాన్ని వృథా చేయకుండా.. అదే స్మార్ట్‌ఫోన్ ద్వారా ఆధ్యాత్మిక గురువు సత్యసాయి బోధనలు విని స్ఫూర్తి పొందాలని సూచించారు. బాబా పలుకులు మానవీయతను మేల్కొలుపుతాయని అన్నారు. సత్యసాయి సేవా ట్రస్ట్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సుకు నిరంతరం పరితపించిన సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను సీఎం రేవంత్ ఆదేశాలతో తెలంగాణలో పండుగగా నిర్వహించినట్లు తెలిపారు. సత్యసాయి మొదలుపెట్టిన అనేక సేవా కార్యక్రమాలు దినదిన ప్రవర్ధమానమై విరాజిల్లుతున్నాయని ప్రశంసించారు. ఉమ్మడి ఏపీ మాజీ డీజీపీ, సత్యసాయి సేవాసంస్థల కన్వీనర్ హెచ్‌జే దొర, తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారు కేవీ రమణాచారి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు ఏనుగు నరసింహారెడ్డి, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనసలహామండలి చైర్మన్ బి. జనక్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టి పెరిగిన ఊరు రుణం తీర్చుకుంటా..

» రహత్‌నగర్‌ను ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతా: మహేశ్ గౌడ్

» 11 ఎకరాల భూమిని గ్రామాభివృద్ధికి విరాళం ఇచ్చిన పీసీసీ చీఫ్



రహత్‌నగర్‌లో దుర్గాదేవి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మహేశ్ గౌడ్

భీమ్‌గల్ రూరల్/నిజామాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తాను పుట్టి పెరిగిన మారుమూల గ్రామమైన రహత్‌నగర్ రుణం తీర్చుకుంటానని.. రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చుదిద్దుతానని ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. తన తల్లిదండ్రులు చేసిన సేవల వల్లే ఈ స్థాయికి ఎదిగానని చెప్పారు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలంలోని రహత్‌నగర్‌లో దుర్గాదేవి ఆలయ నిర్మాణానికి దేవాదాయ శాఖ నుంచి రూ.50 లక్షలను మంజూరు చేయించిన మహేశ్ గౌడ్.. ఆ నిర్మాణ పనులకు స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డితో కలిసి ఆదివారం భూమి పూజ చేశారు. మహేశ్ గౌడ్ ఊరిలోకి అడుగుపెట్టగానే గ్రామస్థులు గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం రహత్‌నగర్ గ్రామాభివృద్ధి కోసం మహేశ్ గౌడ్ తన 11 ఎకరాల సొంత భూమిని విరాళంగా ఇచ్చి దాతృత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు 10 ఎకరాలు, సబ్ స్టేషన్‌కు ఎకరా భూమి ఇచ్చానని, తన గ్రామానికి ఎంత సేవ చేసినా తక్కువేనన్నారు. రహత్‌నగర్ మీదుగా కొండగట్టు ఆంజనేయ స్వామి, వేములవాడ, ధర్మపురి దేవాలయాలను కలుపుతూ టెంపుల్ కారిడార్ రోడ్డు నిర్మాణానికి రూ.380 కోట్లు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల తమ గ్రామం అభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జెండాను ఆయన ఎగరవేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మహిళలకు చీరలను అందజేశారు.

కాంగ్రెస్ హయాంలోనే బీసీలకు ప్రాధాన్యం..

తెలంగాణలో బీసీలు 65 శాతం మంది ఉన్నారని, బీసీలంతా ఏకం కావాల్సిన అవసరముందని మహేశ్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ హయాంలోనే బీసీలకు ప్రాధాన్యం దక్కిందని.. అరుగుల రాజారాం, వి.హనుమంతరావు, డి.శ్రీనివాస్ వంటి వారిని పీసీసీ చీఫ్‌లుగా నియమించారని గుర్తు చేశారు. నిజామాబాద్‌లోని ప్రగతినగర్ మున్నూరుకాపు సంఘంలో జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ధర్మపురి సంజయ్ ప్రమాణస్వీకారానికి ముఖ్య అతిథిగా హాజరై మహేశ్ గౌడ్ ప్రసంగించారు. కాంగ్రెస్ బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి గవర్నర్‌కు పంపిందని గుర్తు చేశారు. నూతనంగా నియమించిన డీసీసీ, సీసీసీ అధ్యక్షుల్లో 75 శాతం మంది బీసీలనే నియమించామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు పి.సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే ఆర్.భూపతిరెడ్డి, పలు కార్పొరేషన్ల చైర్మన్లు ఈరవత్రి అనిల్, అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నభూతో నభవిష్యతిగా గ్లోబల్ సమ్మిట్

దావోస్ సమ్మిట్ తరహాలో ఏర్పాట్లు ఉండాలి.. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సీఎం సూచన

» అధికారులతో కలిసి పనుల పరిశీలన

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి/ కందుకూరు): భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8 నుంచి 11వ తేదీ వరకు తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025ను నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ అంతర్జాతీయ సదస్సుకు వివిధ దేశాల నుంచి ప్రఖ్యాత సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరవుతున్నందున దావోస్ సమ్మిట్ తరహాలో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న గ్లోబల్ సమ్మిట్ -2025 ఏర్పాట్లను సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. స్కిల్ యూనివర్సిటీ, ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ భవన సముదాయ నిర్మాణ పనులను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్లోబల్ సమ్మిట్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో సమ్మిట్ నిర్వహించాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్‌ను ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోందనిచెప్పారు. సదస్సుకు వివిధ దేశాల రాయబారులు కూడా హాజరయ్యే అవకాశం ఉన్నందున కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని డీజీపీ శివధర్‌రెడ్డిని ఆదేశించారు. పాసులు లేకుండా, సమ్మిట్‌తో సంబంధం లేని వ్యక్తులు ఎవరూ ప్రాంగణంలోకి రావడానికి వీలులేదని స్పష్టం చేశారు. శాఖలవారీగా నిర్దేశించిన అధికారులకు మాత్రమే ప్రవేశం ఉండాలని చెప్పారు. అలాగే సమ్మిట్‌కు హాజరయ్యే మీడియా ప్రతినిధులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.



గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఏటా గ్లోబల్ సమ్మిట్

ఫ్యూచర్ సిటీలో ప్రతి సంవత్సరం గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అందువల్ల ఈ ఏడాది నిర్వహించే సమ్మిట్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమ్మిట్ రోల్ మోడల్‌గా నిలిచిపోవాలని అన్నారు. ఫ్యూచర్ సిటీకి మూడు రాష్ట్రాల రాజధానులను నేరుగా అనుసంధానం చేస్తూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రహదారులు నిర్మించనున్నట్లు సీఎం వెల్లడించారు. వీటికి సమాంతరంగా బుల్లెట్ రైలు మార్గాలు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

స్కిల్ యూనివర్సిటీ పనులపై అసంతృప్తి

ఫ్యూచర్ సిటీలో స్కిల్ యూనివర్సిటీ పనులు ఆశించిన స్థాయిలో జరగకపోవడంపై సీఎం రేవంత్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. పనులు జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించిన ఆయన.. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి రోజూ పనులను సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఫ్యూచర్ సిటీ అథారిటీ భవన పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఫిబ్రవరి నాటికి పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.

పారిశ్రామిక వాడలు.. ఇక వాణిజ్య వీధులు

(మొదటిపేజీ తరువాయి)

జారీ చేసింది. దీని ప్రకారం.. ఇప్పటిదాకా పారిశ్రామిక ఎస్టేట్‌లుగా ఉన్న ప్రాంతాల్లో ఇకపై అపార్టుమెంట్లు, టౌన్‌షిప్‌లు, ఆఫీసులు, స్కూళ్లు, హాస్పిటళ్లు, హోటళ్లు, టెక్ పార్కులు, రీసెర్చ్ సెంటర్లు నిర్మించేందుకు అనుమతులు ఇస్తామని పేర్కొంది. ఈ అనుమతులు పొందేందుకుగాను ఆయా ప్రాంతాల ప్రభుత్వ రిజిస్ట్రేషన్ (ఎస్ఆర్‌వో) విలువలో డెవలప్‌మెంట్ ఇంపాక్ట్ ఫీజు కింద.. రోడ్ల వెడల్పు 80 అడుగుల లోపు ఉంటే ఆ ప్రాంతానికి 30 శాతం, 80 అడుగులకు ఎక్కువ వెడల్పు రోడ్లు ఉంటే 50 శాతంగా ఫీజు చెల్లించి ఫ్రీ హోల్డ్‌గా మార్చుకోవచ్చునని తెలిపింది. ఫ్రీ హోల్డ్‌గా మారితే.. ఆ భూమిపై పూర్తి యాజమాన్య హక్కులు లభించనున్నాయి. దీంతో ఆ భూమిని వారు తమకు నచ్చిన విధంగా వినియోగించుకునేందుకు, విక్రయించుకునేందుకు కూడా హక్కు పొందుతారు. కాగా, ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో మొత్తం 22 పారిశ్రామిక పార్కులు, స్టాండ్ అలోన్ భూముల యూనిట్లు ఉన్నాయి. ఈ భూములు మొత్తం 9,292 ఎకరాలు కొత్త పాలసీ కిందకు వస్తున్నాయి. అయితే ఇందులో 4,740 ఎకరాలను ప్లాటెడ్ ఏరియాగా నిర్ణయించారు.

మల్టీ యూజ్‌గా మార్పు అందుకే..

గత ప్రభుత్వాలు పారిశ్రామికవేత్తలకు భూములను కేటాయించినప్పుడు.. వారు ఇక్కడ పెట్టుబడులు పెట్టి, యువతకు, నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తారనే ఉద్దేశంతో నామమాత్రపు ఫీజుకు భూములను లీజుకు ఇచ్చాయి. వారికి విద్యుత్, నీరు, ఇతర మౌలిక సదుపాయాలను కూడా కల్పించి ప్రోత్సహిస్తూ వచ్చాయి. ఇలా కేటాయించిన వాటిలో కొన్ని పరిశ్రమలు ఇప్పటికీ కొనసాగుతూ నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తుండగా, మరికొన్ని పరిశ్రమలు మూత పడ్డాయి. అయితే బాలానగర్, కాటేదాన్, కూకట్‌పల్లి, జీడి మెట్ల, చర్లపల్లి, మౌలాలి, నాచారం, ఉప్పల్ వంటి పారిశ్రామిక ప్రాంతాలు పరిశ్రమలు స్థాపించిన సమయంలో నగర శివారులో ఉండేవి. కానీ, ఆ పరిశ్రమలు ఉన్న ప్రాంతాలు నేడు నగరం నడిబొడ్డుగా మారాయి. రోజు రోజుకూ నగరంలో జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ఆ పరిశ్రమలు నగర పౌరులకు అసౌకర్యంగా, కాలుష్య కారకాలుగా మారుతున్నాయి. ఈ కారణంతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందే కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం 2013లో ఈ పరిశ్రమలన్నిటినీ నగరానికి అవతల ఏర్పాటు చేసుకోవాలంటూ ఒక విధానాన్ని తీసుకొచ్చింది. అయితే దానిని అమలు చేసే క్రమంలో ఆ సమయానికే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ఆ తర్వాత కేసీఆర్ ప్రభుత్వం కూడా ఈ ప్రతిపాదనను సూత్రపాయంగా లేవనెత్తినప్పటికీ.. అమలులోకి మాత్రం తీసుకురాలేకపోయింది. ఇప్పుడు రేవంత్‌రెడ్డి సర్కారు ఈ నిర్ణయాన్ని సీరియస్‌గా తీసుకుని అమలు దిశగా కొత్త పాలసీని తీసుకొచ్చింది.



టీజీ-ఐపాస్ ద్వారా దరఖాస్తులు..

పారిశ్రామిక ఎస్టేట్‌లను మల్టీ యూజ్ జోన్‌లుగా మార్చి ఇంపాక్ట్ ఫీజు వసూలు ద్వారా ఇతర అవసరాలకు వినియోగించేందుకు అనుమతులు ఇవ్వనుంది. ఇంపాక్ట్ ఫీజులోనే చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) ఫీజులు కూడా కలిపారు. దీంతో పారిశ్రామికవేత్తలు అప్రూవల్స్ కోసం వేర్వేరు శాఖల వద్దకు తిరగాల్సిన అవసరం లేకుండా పోతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనికోసం టీజీ-ఐపాస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఈ మొత్తం ప్రక్రియకు టీజీఐఐసీ నోడల్ ఏజెన్సీగా పని చేస్తుందని పేర్కొంది. మల్టీ యూజ్ కింద అనుమతులు పొందేందుకుగాను పారిశ్రామికవేత్తలు తమకు కేటాయించిన భూమి విలువ ప్రకారం.. మొత్తం విలువలో 20 శాతాన్ని ప్రారంభ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. మిగతా 80 శాతం ఫీజులను రెండు విడతల్లో చెల్లించవచ్చని జీవోలో వివరించింది. కాగా, దరఖాస్తులను 7 రోజుల్లోగా టీజీఐఐసీ ప్రారంభ స్క్రూటినీ చేస్తుంది. మరో 7 రోజుల్లో ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నేతృత్వంలోని కమిటీ తుది ఆమోదం తెలుపుతుందని, మరో 7 రోజుల్లో డిమాండ్ నోటీసును యూనిట్‌దారులకు ఆన్‌లైన్‌లో జారీ చేస్తామని వెల్లడించింది. ఈ ప్రక్రియ అంతా 45 రోజుల్లో పూర్తవుతుందని పేర్కొంది. అయితే ప్రతి దశలోనూ గ్రేస్ పీరియడ్‌ను నెల రోజులుగా నిర్ణయించింది. గ్రేస్ పీరియడ్ దాటితే మొత్తం రుసుము ప్రభుత్వ ఖజానాకే వెళుతుందని స్పష్టం చేసింది. ఈ పాలసీ జారీ అయిన తేదీ నుంచి 6 నెలల్లోపు దరఖాస్తులను సమర్పించాలని ఆదేశించింది. ఈఆదాయాన్ని భూ మార్పిడి ఫీజులకు, 25 శాతం టీజీ-ఐఐసీ వద్దే ఉంచి రాష్ట్ర నలుమూలల పారిశ్రామిక అభివృద్ధికి వినియోగించనుంది. మిగతా మొత్తాన్ని రాష్ట్ర ఆర్థికస్థితిని బలోపేతం చేసేందుకు ప్రభుత్వ ట్రెజరీకి జమ చేయనుంది.

మల్టీ యూజ్ జోన్లుగా మారనున్న పారిశ్రామిక వాడలు ఇవే..

ఇండస్ట్రియల్ పార్కు (ఐపీ)	విస్తీర్ణం ఎకరాల్లో	ప్లాట్లు వేసిన ప్రాంతం (ఎకరాల్లో)	టీజీఐఐసీ ధర చ.గ.. రూ..ల్లో	ఎస్ఆర్‌వో విలువ చ.మీ.. రూ...ల్లో
ఐడీఏ నాచారం	700	455	32,881	21,000
ఐపీ మల్లాపూర్	240	156	36,827	14,700
ఐపీ చర్లపల్లి	762	495.30	26,398	14,200
ఐపీ మౌలాలి	168	109.20	46,895	20,300
ఐపీ ఉప్పల్	447	290.55	52,523	18,300
ఐపీ కూకట్‌పల్లి	20.47	13.31	33,440	26,700
ఐపీ జీడిమెట్ల	980	637	42,081	12,200
ఎస్‌వీసీఐఈ జీడిమెట్ల	84	54.60	42,143	12,200
ఐపీ బాలానగర్	157.06	102.09	51,662	23,000
టీఐఈ బాలానగర్	47	30.55	51,662	23,000
ఎస్‌వీసీఐఈ బాలానగర్	50	32.50	51,662	23,000
ఐపీ సనత్‌నగర్	87.31	56.75	37,906	43,500
ఐపీ మేడ్చల్	113	73.45	20,900	7,000
ఐపీ కుషాయిగూడ	110	71.50	23,408	18,900
సీఐఈ గాంధీనగర్	101.20	65.78	46,895	12,200
ఐపీ పటాన్‌చెరు	1,188.22	772.34	19,997	7,400
ఐడీఏ పాశమైలారం ఓఆర్‌ఆర్‌కు 8 కి.మీ. పరిధిలో	1,495.63	972.16	13,548	3,100
ఐపీ కాటేదాన్	265	172.25	18,392	8,100
ఏఎన్ హయత్‌నగర్	222.55	144.66	54,340	12,200
స్వతంత్ర (స్టాండలోన్) భూమి	2,000	-	-	-
ఐపీ చందులాల్ బారాదరి (ఓఆర్ఆర్ లోపల కొత్తగా చేర్చినది)	28.82	18.73	50,550	3,100
మొత్తం	9,292.53	4,740.14		

రచయిత్రి సుధాదేవి రామరాజు కన్నుమూత


సుధాదేవి రామరాజు(ఫైల్)

నల్లకుంట/చిక్కడపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత్రి డాక్టర్ తెన్నేటి సుధాదేవి రామరాజు(73) ఆదివారం సాయంత్రం నల్లకుంటలోని స్వగృహంలో కన్నుమూశారు. ఆమెకు భర్త డాక్టర్ వంశీ రామరాజు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వంశీ ఇంటర్నేషనల్ సాంస్కృతిక సంస్థ అధినేత డాక్టర్ వంశీ రామరాజు సతీమణి డాక్టర్ తెన్నేటి సుధాదేవి తెలుగు అకాడమీలో ఉప సంచాలకులుగా సుదీర్ఘకాలం పనిచేశారు. పదవీ విరమణ చేసిన తర్వాత కూడా రచనలు కొనసాగించారు. తెలుగు సామెతలు, నాటికలతో సాహిత్య ప్రక్రియలో 20కిపైగా రచనలు చేసి పలు సంస్థలచే అవార్డులు, రివార్డులు అందుకున్నారు. నల్లకుంటలోని నివాసంలో సుధాదేవి భౌతికకాయాన్ని సినీ దర్శకుడు రేలంగి నరసింహ రావు, నిర్మాత రామ సత్యనారాయణతోపాటు పలువురు ప్రముఖులు సందర్శించి, నివాళులర్పించారు. సుధాదేవి రామరాజు అంత్యక్రియలు సోమవారం ఉదయం అంబర్‌పేట శ్మశాన వాటికలో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మైక్రో ఫైనాన్స్ వేధింపులకు వివాహిత బలి

» మెదక్ జిల్లా తూప్రాన్‌లో ఘటన


వరలక్ష్మి (ఫైల్)

తూప్రాన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మైక్రోఫైనాన్స్ ఏజెంట్ల వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం... తూప్రాన్‌కు చెందిన ఎన్నెల్లి కృష్ణ, వరలక్ష్మి (35) దంపతులు. వారు క్రిష్ బ్యాంకులో రూ.70వేలు, బంధన్ బ్యాంకులో రూ.69వేలు, ఫైవ్ స్టే బ్యాంకులో రూ.4 లక్షల వరకు ఇంటి అవసరాల నిమిత్తం రుణాలు తీసుకున్నారు. అయితే కొన్ని నెలల నుంచి కృష్ణ ఆరోగ్యం సరిగా లేకపోవడంతో రుణాలు చెల్లించలేకపోయారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఓ బ్యాంకు ఏజెంట్లు ఇంటికి వచ్చి రుణం చెల్లించాలని పట్టుబట్టారు. దీంతో వరలక్ష్మి తీవ్ర మనస్తాపానికి గురై భర్తతో గొడవపడింది. తర్వాత ఇంట్లో నుంచి వెళ్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కృష్ణ, వరలక్ష్మి దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు.

జాతీయ విద్యా విధానాన్ని ఆమోదించవద్దు

» సీఎంకు టీఎస్పీటీఏ రాష్ట్ర అధ్యక్షుడి వినతి

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్రంలో ఆమోదించవద్దని తెలంగాణ రాష్ట్ర ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం (టీఎస్పీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ షౌకత్ అలీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యనిర్వాహక కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖలో చేస్తున్న ప్రయోగాలపై ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తన ఉన్మాద, ఛాందస భావజాలంతో కూడిన విధానాన్ని రూపొందించి దాన్ని నూతన విద్యా విధానంగా, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని బలవంతం చేస్తూ.. ప్రజలపై రుద్దే ప్రయత్నం చేస్తోందన్నారు. దీనిని ప్రజాస్వామికవాదులు, మేధావులు వ్యతిరేకించాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న 5 డీఏల మంజూరు, ఉద్యోగులు, పెన్షనర్ల పెండింగ్ బిల్లులను హామీ ఇచ్చిన విధంగా ప్రతినెల రూ.700 కోట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నివేదికల పేరుతో తరచూ ప్రాథమిక ఉపాధ్యాయులపై పని ఒత్తిడి చేయడాన్ని మానుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

జీవో 46తో బీసీలకు రాజకీయ సమాధి: జాజుల



అంబర్‌పేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బీసీలను రాజకీయంగా అణచివేసేందుకే ప్రభుత్వం జీవో 46ను తీసుకువచ్చిందని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు అన్యాయం చేసి అగ్రవర్ణాల వారికి ప్రాముఖ్యం ఇచ్చేందుకే ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. జీవో 46కు వ్యతిరేకంగా అంబర్‌పేటలోని మహాత్మా జ్యోతిరావు ఫూలే విగ్రహం వద్ద బీసీ నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జీవో 46 ప్రతులను వారు చించివేశారు. అనంతరం జాజుల మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 46ను రద్దు చేయాలని, లేనిపక్షంలో బీసీల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్, బీజేపీ చేసుకున్న చీకటి ఒప్పంద ఫలితమే జీవో 46 అని విమర్శించారు. బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, కో-చైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు తగ్గించి గొంతు కోశారు

» కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడింది: ఆర్.కృష్ణయ్య

రాంనగర్/బర్కత్‌పురా, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసిన కాంగ్రెస్.. చివరకు 22 శాతానికి తగ్గిస్తూ జీవో నంబర్ 46 తేవడం శోచనీయమని ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. మంత్రులు, కాంగ్రెస్ నేతలు వందల సార్లు చట్టబద్ధంగా 42 శాతం ఇస్తామని ప్రకటించారని.. మంత్రివర్గంలో రెండు సార్లు తీర్మానం కూడా చేసి చివరకు బీసీల గొంతు కోశారని మండిపడ్డారు. ఆదివారం హైదరాబాద్‌లోని విద్యానగర్, బషీర్‌బాగ్ చౌరస్తాలో.. జీవో నంబర్ 46 ప్రతులను ఆయన బీసీ సంఘాల నేతలతో కలిసి దగ్ధం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. తక్షణమే ఆ జీవోను ఉపసంహరించుకోకపోతే బీసీలు తిరగబడతారని హెచ్చరించారు. గ్రామ పంచాయతీల ఎన్నికలకు పార్టీ ఎన్నికల గుర్తు ఉండదని.. పార్టీ ప్రతిపాదికన 42 శాతమని ఎలా అంటారని ప్రశ్నించారు. బిహార్ ఎన్నికల ఫలితాలు రాగానే కాంగ్రెస్ సర్కారు నిజస్వరూపం బయటపడిందని విమర్శించారు. హైకోర్టులో కేసు విచారణలో ఉండగానే 22 శాతం బీసీ రిజర్వేషన్లతో ఎన్నికలకు పోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అఖిలపక్షంతో ప్రధాని మోదీని కలవడానికి ఎందుకు వెళ్లలేదని నిలదీశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

కాళోజీ వర్సిటీలో అక్ర'మార్కు'లు

(మొదటిపేజీ తరువాయి)

పాస్ అయ్యాడు. రీకౌంటింగ్ తర్వాత ఓ విద్యార్థి పాస్ కావడం కాళోజీ యూనివర్సిటీ చరిత్రలోనే ఇదే తొలిసారి.

పక్కాగా నిర్వహిస్తామని చెబుతున్నా..

వైద్య విద్య పీజీ పరీక్ష ఫలితాలు ఈనెల 4వ తేదీన వెలువడ్డాయి. ఓ ప్రైవేటు వైద్యవిద్య కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదు. కానీ, ఆ తర్వాత కొద్ది రోజులకే పాస్ అయ్యారు. ఇదెలా సాధ్యమైందని సహచర మెడికోలు ఆరా తీయగా... అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అండర్, పోస్టు గ్రాడ్యుయేట్ పరీక్షల్లో విద్యార్థులు జవాబులు రాసేందుకు 30 పేజీల బుక్‌లెట్ ఇస్తారు. దానిపై విద్యార్థి హాల్ టికెట్ నంబరుతోపాటు క్యూఆర్ కోడ్ కూడా ఉంటుంది. ఆ బుక్‌లెట్‌లో జవాబులన్నీ రాశాక... ఇంకా పేపర్లు మిగిలి ఉంటే.. వాటిపై పెద్దగా కొట్టివేత ('ఎక్స్' గుర్తు) మార్క్ వేయాలి. అలా క్రాస్ మార్కింగ్ చేసిన తర్వాతే ఇన్విజిలేటర్లు ఆయా జవాబు పత్రాలను తీసుకుంటారు. ఆ తర్వాత వాటిని స్కాన్ చేసి.. జంబ్లింగ్ పద్ధతిలో వివిధ కాలేజీలకు పంపుతారు. సంబంధిత సబ్జెక్టుల అధ్యాపకులు.. వాటిని ఆన్‌లైన్‌లోనే మూల్యాంకనం చేస్తారు. ఇదంతా చాలా పకడ్బందీగా ఉంటుంది. చివరకు సదరు సాఫ్ట్‌వేరే.. ఒక్కో జవాబుకు వేసిన మార్కులన్నీ లెక్కించి మొత్తం మార్కులను వెల్లడిస్తుంది. అయితే, ఈ ఐదుగురు విద్యార్థుల జవాబు పత్రాల్లో కొట్టివేత మార్క్ వేసిన పేజీల్లోనూ జవాబులు రాసి ఉన్నట్లు తెలిసింది. సాధారణంగా కొట్టివేత మార్క్ వేసిన పేజీల్లో రాసిన జవాబులను పరిగణనలోకి తీసుకోరు. కానీ, ఆయా జవాబులకు మళ్లీ మార్కులు వేసి, పాస్ చేసినట్లు తెలుస్తోంది. ఇలా అక్రమంగా మార్కులు కలిపినందుకు పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి పీజీ పరీక్షలకు సంబంధించి రీవ్యాల్యుయేషన్ అనేదే లేదు.. కేవలం రీకౌంటింగ్ మాత్రమే ఉంది. అలాంటప్పుడు ఇదంతా ఎలా సాధ్యమైందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా, హైదరాబాద్ సమీపంలో ఉండే ఓ ప్రైవేటు మెడికల్ కాలేజీ విద్యార్థి సైతం ఎంబీబీఎస్‌లో ఫెయిల్‌కాగా, ఆ తర్వాత రీకౌంటింగ్‌లో పాస్ అయ్యాడు. కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం చరిత్రలోనే రీకౌంటింగ్‌లో ఓ విద్యార్థి పాస్ కావడం ఇదే తొలిసారి అని విద్యార్థులు చెబుతున్నారు. దీని వెనుక కూడా భారీ మొత్తంలో డబ్బు చేతులు మారినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వర్సిటీ లాగిన్ తనిఖీ చేస్తే...

"విద్యార్థులు పాస్ అయినా... ఫెయిలైనా.. వారికి వచ్చిన మార్కులు వివరాలన్నీ యూనివర్సిటీ అంతర్గత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. వాటిలో మార్పులు చేయాలంటే సంబంధిత లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌లు తెలిసిన వారే చేయగలరు. ఎన్నిసార్లు లాగిన్ అయ్యారు? ఎప్పుడెప్పుడు లాగిన్ అయ్యారు? ఏమేమి మార్పులు చేశారు? అన్న వివరాలు కూడా నమోదై ఉంటాయి. ఒక్క సారి సాంకేతిక నిపుణులతో తనిఖీ చేయిస్తే...అసలు బండారం బయటపడుతుంది" అని వైద్య వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. వైద్య విద్య పరీక్షలను అపహాస్యం చేస్తూ.. అక్రమాలకు పాల్పడిన వైనంపై సమగ్ర విచారణ చేపట్టాలని మెడికోలు డిమాండ్ చేస్తున్నారు.

సోలార్.. గుండె గు'బిల్లు'!

రూఫ్‌టాప్ బిల్లులు ఏకపక్షంగా పెంపు.. ఈఆర్‌సీ అనుమతించకున్నా దక్షిణ డిస్కమ్ నిర్ణయం

» నెట్‌మీటరింగ్‌కు బదులుగా నెట్ బిల్లింగ్

» ఇప్పటిదాకా ఎక్స్‌పోర్ట్, ఇంపోర్ట్ యూనిట్ల తేడా లెక్కగట్టి బిల్లు

» ఇప్పుడేమో ఎక్స్‌పోర్టు, ఇంపోర్ట్ బిల్లులకు వేర్వేరుగా బిల్లులు

» ఇంపోర్టు విద్యుత్తుకు చార్జీలు ఎక్కువ

» ఈఆర్సీకి మాజీ ఐఏఎస్ ఫిర్యాదు



హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్తు బిల్లుల బెడద నుంచి కొంత ఉపశమనం లభిస్తుందని అనుకున్న వినియోగదారులపై తెలంగాణ దక్షిణ విద్యుత్తు పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) దొంగదెబ్బ కొట్టింది. తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి (ఈఆర్సీ) అనుమతించకపోయినా సోలార్ రూఫ్ టాప్ వినియోగదారుల బిల్లులను ఏకపక్షంగా పెంచేసింది. ఈ విషయాన్ని ఓ బాధితుడిగా ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన మాజీ ఐఏఎస్ అధికారి సురేశ్ చందా.. ఈఆర్సీకి ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రాష్ట్రంలోని సోలార్ రూఫ్‌టాప్ వినియోగదారులకు 'నెట్ మీటరింగ్' విధానంలో బిల్లులను జారీ చేస్తున్నారు. వినియోగదారులు తమ సోలార్ రూఫ్‌టాప్ సిస్టం ద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్తును గ్రిడ్‌కు సరఫరా చేస్తారు. దీనిని ఎక్స్‌పోర్ట్ చేసిన విద్యుత్తు అంటారు. గ్రిడ్ నుంచి తీసుకున్న విద్యుత్తును తమ అవసరాలకు వాడుకుంటారు. దీనిని ఇంపోర్ట్ చేసుకున్న విద్యుత్తు అంటారు. ఎక్స్‌పోర్ట్ చేసిన విద్యుత్తుతో పోల్చితే ఇంపోర్టు చేసుకున్న విద్యుత్తు ఎక్కువ ఉన్నప్పుడు .. రెండింటి మధ్య తేడాలు తీసి వాటి ఆధారంగా వినియోగదారులకు బిల్లులను జారీ చేయడాన్ని 'నెట్‌మీటరింగ్' విధానంగా చెబుతారు. ఉదాహరణకు ఒక వినియోగదారుడు తన సోలార్ రూఫ్‌టాప్ సిస్టమ్ ద్వారా నెలకు 200 యూనిట్లను ఉత్పత్తి చేసి గ్రిడ్‌కు సరఫరా చేసి, అదే నెలలో గ్రిడ్(డిస్కమ్) నుంచి 300 యూనిట్లను వినియోగిస్తాడు. అంటే.. 100 యూనిట్లకు మాత్రమే నెట్ మీటరింగ్ విధానంలో బిల్లులు జారీ చేస్తారు. తాజాగా అక్టోబరు నెల వినియోగానికి సంబంధించి (నవంబరులో) సోలార్ రూఫ్ టాప్ వినియోగదారులకు దక్షిణ డిస్కమ్‌కు 'నెట్ మీటరింగ్'కు బదులుగా 'నెట్ బిల్లింగ్' విధానంలో బిల్లులు జారీ చేసింది. అంటే వినియోగదారుడు ఉత్పత్తి చేసి గ్రిడ్‌కు ఎక్స్‌పోర్ట్ చేసిన విద్యుత్తుకు, గ్రిడ్ నుంచి వినియోగదారుడు తీసుకున్న విద్యుత్తుకు వేర్వేరుగా చార్జీలను లెక్కించింది. ఈ రెండు చార్జీలను సర్దుబాటు చేసి తుదకు మిగిలే మొత్తాన్ని వినియోగదారులకు బిల్లులుగా జారీ చేసింది.

ఇక్కడే సమస్య

వినియోగదారులు ఎక్స్‌పోర్ట్ చేసే విద్యుత్తుకు టీజీఎస్పీడీసీఎల్ ఇచ్చే చార్జీలతో పోల్చితే వినియోగదారులు ఇంపోర్ట్ చేసుకునే విద్యుత్తుపై విధించే చార్జీలు అధికంగా ఉంటాయి. దాంతో వినియోగదారుల బిల్లులు భారీగా పెరిగిపోయాయి. దీనిపై వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి(రూఫ్ టాప్ పీవీ గ్రిడ్ ఇంటరాక్టివ్ సిస్టమ్స్) రెగ్యులేషన్స్-2025' పేరుతో సోలార్ రూఫ్‌టాప్‌కి సంబంధించి కొత్త మార్గదర్శకాలను ఈనెల 15న వెలువరించింది. దీనికి ముందు ఈఆర్సీ ముసాయిదా మార్గదర్శకాలను విడుదల చేసి, ప్రజాభిప్రాయ సేకరణ జరిపింది. నెట్ మీటరింగ్ విధానానికి బదులు నెట్ బిల్లింగ్ విధానంలో బిల్లుల వసూళ్లకు అనుమతించాలని కోరుతూ దక్షిణ డిస్కమ్ విజ్ఞప్తి చేయగా, ఈఆర్సీ పరిగణనలోకి తీసుకోలేదు. తుది రెగ్యులేషన్స్‌లో నెట్ మీటరింగ్ విధానాన్నే కొనసాగించాలని ఈఆర్సీ ఉత్తర్వులిచ్చింది. అయితే, దీనికి విరుద్ధంగా ఎస్పీడీసీఎల్ బిల్లులను పెంచేయడం గమనార్హం.

బాధితుడు.. ఇంధన శాఖ మాజీ ముఖ్యకార్యదర్శి

ఇంధన శాఖ మాజీ ముఖ్యకార్యదర్శి సురేశ్ చందా తన సోలార్ రూఫ్‌టాప్ సిస్టమ్ ద్వారా గత జూలైలో 124 యూనిట్ల విద్యుత్తును గ్రిడ్‌కు సరఫరా చేసి గ్రిడ్ నుంచి 309 యూనిట్ల విద్యుత్తును తీసుకుని వాడుకున్నారు. రెండింటిని సర్దుబాటు చేశాక ఆ నెలలకు ఆయనకు 179 యూనిట్ల వినియోగానికి సంబంధించి రూ.877 బిల్లును జారీ చేశారు. గత అక్టోబరులో ఆయన తన సోలార్ రూఫ్‌టాప్ సిస్టమ్ ద్వారా 158 యూనిట్లను గ్రిడ్‌కు ఎక్స్‌పోర్ట్ చేసి తన అవసరాలకు గ్రిడ్ నుంచి 330 యూనిట్ల విద్యుత్తును వాడుకున్నారు. రెండింటిని సర్దుబాటు చేస్తే ఆయనకు 172యూనిట్ల వినియోగానికి మాత్రమే బిల్లు జారీ చేయాల్సి ఉంటుంది. అయితే అక్టోబరు నెల వినియోగానికి గాను(నవంబరు) నెలలో ఆయనకు రూ.1444బిల్లు వచ్చింది. యూనిట్‌కు రూ.7.70దాకా బిల్లు వేశారు. గత జూలైతో పోల్చితే అక్టోబరు ఆయన ఎక్స్‌పోర్ట్, ఇంపోర్ట్ చేసుకున్న విద్యుత్తు, రెండింటిని సర్దుబాటు చేశాక తుదకు వచ్చే మొత్తాలు సమానంగా ఉన్నా ఆయన అక్టోబరు నెల వినియోగానికి ఆయనకు బిల్లు భారీగా పెరిగిపోయింది. దాంతో ఆయన ఈఆర్సీకి శనివారం ఫిర్యాదు చేశారు.


మాచినేనిపల్లిలో ఇందిరమ్మ ఇంటికి వితంతువుతో భూమి పూజ చేయిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ఇందిరమ్మ ఇంటికి వితంతువుతో భూమి పూజ

మూఢ నమ్మకాలను వీడాలని మంత్రి జూపల్లి పిలుపు

మహిళలు అనవసర ఆర్భాటాలకు వెళ్లొద్దని సూచన

కొల్లాపూర్/పాన్‌గల్, నవంబరు23(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతీ ఒక్కరు మూఢ నమ్మకాలు, దురాచారాలను విడనాడాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని మాచినేనిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామానికి చెందిన లక్ష్మీ దేవమ్మ కుమారుడు రాముడు పేరుతో ఇందిరమ్మ ఇల్లు మంజూరయింది. అతడి భార్య గర్భిణి కావడంతో పూజలో పాల్గొనలేదు. దీంతో రాముడు తల్లి లక్ష్మీదేవమ్మను భూమి పూజ చేయాలని మంత్రి జూపల్లి కోరారు. ఆమె వితంతువు అని మంత్రికి చెప్పడంతో.. ఇలాంటి దురాచారాలను కొనసాగించడం మంచిది కాదని చెప్పారు. వృద్ధురాలు లక్ష్మీదేవమ్మతో కొబ్బరికాయ కొట్టించి, ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేయించారు. వారి కుటుంబానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇంటి బేస్‌మెంట్ నిర్మాణానికి మహిళా సంఘాల ద్వారా రూ.లక్ష రుణం మంజూరు చేయాలని సెర్ప్ అధికారులను ఆదేశించారు. కాగా, మహిళలు అనవసర ఆర్భాటాలకు పోయి రూ.లక్షలు ఖర్చు చేయొద్దని మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. ఆర్థిక పరిస్థితి సరిగా లేకున్నా.. పట్టు చీర, పట్టు పంచె, ఫంక్షన్లు అని పోటాపోటీగా రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. దీంతో ఎంత సంపాదించినా, ప్రభుత్వం ద్వారా ఎన్ని ఉచితాలు ఇచ్చినా అప్పుల పాలవుతున్నారని చెప్పారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల, పాన్‌గల్, చిన్నంబావి మండలాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులకు చీరలు.. లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను జూపల్లి పంపిణీ చేశారు.

కోటరీ జగన్‌ను తప్పుదారి పట్టిస్తోంది

చుట్టూ నిబద్ధతలేని వ్యక్తులున్నారు

చంద్రబాబుతో వ్యక్తిగత వైరం లేదు

పవన్‌తో 20 ఏళ్లుగా స్నేహం: విజయసాయి

శ్రీకాకుళం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'జగన్‌కు చెప్పేది ఒక్కటే.. అప్పుడైనా, ఇప్పుడైనా ఆయన చుట్టూ నిబద్ధతలేని వ్యక్తులున్నారు. వారి మాటలను జగన్ నమ్మకూడదు. చుట్టూ ఉన్న కోటరీ ఆయన్ను తప్పుదారి పట్టిస్తోంది. వారి వల్లే పార్టీకి దూరంగా ఉన్నాను' అని వైసీపీ మాజీ నాయకుడు, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. శ్రీకాకుళం మండలం అంపోలు సమీపంలో ఆదివారం నిర్వహించిన రెడ్డి సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉన్నాను. కేవలం ఒక రైతుగా జీవిస్తున్నాను. కొత్త పార్టీ పెట్టే ఆలోచన కానీ.. ఇతర పార్టీల్లో చేరే ఉద్దేశం కానీ లేదు. అవసరం వచ్చినప్పుడు తప్పకుండా తిరిగి రాజకీయాల్లోకి వస్తాను. జగన్ పార్టీని మేనేజ్ చేసుకోగలడు. నేను లేని లోటు వైసీపీలో కనిపించదు. గతంలో నాపై చాలా ఒత్తిడి ఉండేది. నేను వేటికీ తలొగ్గలేదు. ఏ ప్రలోభాలకూ లొంగలేదు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో గత ఇరవై ఏళ్లుగా మంచి స్నేహం ఉంది. ఎప్పుడూ పవన్‌ను విమర్శించలేదు. భవిష్యత్తులో కూడా విమర్శించను. ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఎలాంటి వ్యక్తిగత వైరం లేదు' అని అన్నారు. శ్రీకాకుళంలో నిర్మిస్తున్న రెడ్డి సంక్షేమ భవన నిర్మాణానికి అవసరమైన ఖర్చును తానే భరిస్తున్నట్లు చెప్పారు.

హమ్మయ్య 'పంచాయితీ' తప్పినట్టే!

» పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయంతో ఎమ్మెల్యేలకు ఊరట

» ప్రస్తుతం ప్రతి చిన్న విషయానికీ ఎమ్మెల్యేలకు ఫోన్ చేస్తున్న గ్రామస్తులు

» పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ ఇబ్బందులు

» పంచాయతీ ఎన్నికలతో గ్రామ స్థాయిలో జవాబుదారీ వ్యవస్థ

» ప్రభుత్వానికి అందనున్న రూ.3 వేల కోట్ల కేంద్ర నిధులు

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'సార్.. మా వీధిలో లైట్లు వెలగట్లేదు! అయ్యా గ్రామంలో తాగునీరు సరఫరా కావట్లేదు! ఊళ్లో రోడ్ల సమస్య పరిష్కరించండి'.. ఎమ్మెల్యేలకు గ్రామాల ప్రజల నుంచి తరచూ వస్తున్న ఫోన్లు ఇవి. గ్రామ స్థాయిలో జవాబుదారీ వ్యవస్థ లేకపోవడంతో ప్రతీ చిన్న పనికి ప్రజలు, క్షేత్రస్థాయి నేతలు, కార్యకర్తలు నేరుగా ఎమ్మెల్యేలను సంప్రదించడం పెరిగింది. క్షేత్రస్థాయిలోని చిన్న చిన్న సమస్యలను పట్టించుకుని, పరిష్కరించడం ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారింది. అదే సమయంలో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి గ్రామస్థాయిలో అధికారిక వ్యవస్థ లేకపోవడం ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కూడా ఇబ్బందిగా ఉంది. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం ఎమ్మెల్యేలకు ఊరటనిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సర్పంచ్‌లు, వార్డు సభ్యులు కలుపుకొని ఏకంగా 1.25 లక్షల మంది గ్రామస్థాయి నేతలు, కార్యకర్తలకు పదవులు దక్కనుండటంతో ఉత్సాహం కనిపిస్తోంది.

స్థానికంగానే సమస్యల పరిష్కారానికి అవకాశం

స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌పై తేలకపోవడంతో ప్రభుత్వం గ్రామపంచాయతీ ఎన్నికలను పెండింగ్‌లో పెట్టిన విషయం తెలిసిందే. దీనితో గ్రామ స్థాయిలో పాలనాపరమైన సమస్యలు నెలకొన్నాయి. పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు, రోడ్ల నిర్వహణ, గ్రామ విస్తరణ ప్రణాళిక అమలు, స్థానిక పన్నుల వసూళ్లు, చిన్నచిన్న వివాదాలను పరిష్కరించడం, ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక వంటివి సమస్యాత్మకంగా మారాయి. ఇలాంటి సమయంలో డిసెంబర్‌లోనే ఎన్నికల ప్రక్రియ ముగించాలని మంత్రివర్గం నిర్ణయించడంతో.. కొత్త సంవత్సరం నుంచి గ్రామస్థాయిలో పాలన పూర్తిగా గాడినపడే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కేంద్ర నిధులూ అందే అవకాశం

కేంద్ర 15వ ఆర్థిక సంఘం గడువు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)తో ముగుస్తోంది. ఈ ఏడాదికి ఆర్థిక సంఘం నుంచి తెలంగాణకు 3వేల కోట్ల నిధులు రావాల్సి ఉంది. కానీ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించని కారణంగా ఆ నిధులు నిలిచిపోయాయి. మరో 4 నెలలు గడిస్తే.. కొత్త ఆర్థిక సంఘం ఏర్పాటవుతుంది. పాత బకాయిలు మురిగిపోయే అవకాశం ఉంది. వెంటనే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే పెండింగ్‌లో ఉన్న 3 వేలకోట్లు అందుతాయి. పంచాయతీల్లో తక్షణ సమస్యలను తీర్చేందుకు కొత్త పాలక మండళ్లకు ఉపయోగపడతాయి.

క్షేత్రస్థాయి నేతలు, కార్యకర్తకలు పదవులు..

ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు గడుస్తున్నా క్షేత్రస్థాయిలో పదవుల లేక కాంగ్రెస్ స్థానిక నేతలు, కార్యకర్తల్లో అసంతృప్తి ఉంది. ఇప్పుడు పంచాయతీ ఎన్నికలతో 12,733 గ్రామాల్లో సర్పంచ్‌లు, 1,12,288 మంది వార్డు సభ్యులు కలిపి 1.25 లక్షల మందికి పదవులు దక్కనున్నాయి. రాష్ట్రంలో అధికారంలో ఉండటం, వరుస ఓటములతో బీఆర్ఎస్ బలహీనపడటం నేపథ్యంలో.. మెజారిటీ పంచాయతీలను కాంగ్రెస్ గెలుచుకుంటుందని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీనితో వేలాది మంది నేతలు, కార్యకర్తలకు పదవులతో పార్టీకి, ప్రభుత్వానికి అవసరమైన బలమైన వ్యవస్థ ఏర్పాటవుతుందని అంటున్నారు. పార్టీపరంగా 42శాతం బీసీలనే అభ్యర్థులుగా ఎంపిక చేయాలన్న సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం నేపథ్యంలో.. కాంగ్రెస్ నుంచి పెద్ద ఎత్తున బీసీ నాయకత్వమూ ఎదుగుతుందని చెబుతున్నారు.

పోలీసుల అదుపులో మావోయిస్టు దేవ్‌జీ?

» విజయవాడలో పట్టుబడ్డ వారిలో ఆయన కూడా?

» కుటుంబసభ్యుల్లో ఆందోళన.. కోర్టులో హాజరుపర్చాలని డిమాండ్

కోరుట్ల/కోరుట్ల రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి తెలంగాణ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన తిప్పిరి తిరుపతి తెలంగాణ పోలీసులకు చిక్కినట్లు తెలిసింది. ఇటీవల ఏపీ విజయవాడలోని ఓ భవనంలో తిప్పిరి తిరుపతి అంగరక్షకులు తొమ్మిది మంది పోలీసులకు పట్టుబడిన క్రమంలో తిరుపతిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్న ప్రచారం జరుగుతోంది. కొంతకాలంగా తిప్పిరి తిరుపతిని లొంగిపోవాలని కుటుంబసభ్యులు సామాజిక మాధ్యమాల ద్వారా కోరుతున్నారు. ఈ మేరకు తిప్పిరి తిరుపతి తమ్ముడు గంగాధర్, సోదరుడి కూతురు సుమ బహిరంగ లేఖ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఇటీవల మావోయిస్టు నేత హిడ్మా ఎన్‌కౌంటర్ కావడం, తిప్పిరి తిరుపతి అంగరక్షకులు పట్టుబడటం, తిరుపతి పోలీసుల అదుపులో ఉన్నాడన్న అనుమానాలు వ్యక్తమవుతుండటం ఆయన బంధువర్గాలను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. తిప్పిరి తిరుపతి పోలీసుల అదుపులో ఉంటే అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచాలని ఆయన బంధువులు కోరుతున్నారు.

35 ఏళ్ల తర్వాత కొడుకును చూడబోతున్నా

4రోజుల్లో ఇంటికొస్తానన్నాడు.. కొడుకును చూస్తూ బతికేస్తా

లొంగిపోయిన మావోయిస్టు ఆజాద్ తండ్రి సమ్మయ్య భావోద్వేగం


ఆజాద్ రాక కోసం ఎదురుచూస్తున్న తండ్రి సమ్మయ్య, భార్య రూప

గోవిందరావుపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గట్టిగా గాలి వీస్తే పైకప్పు ఎగిరిపోయే పూరిగుడిసెలో ఉంటూ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ.. కూలి పనికి వెళితే గానీ పూట గడవని దయనీయ స్థితిలో భారంగా కాలం వెళ్లదీస్తున్న ఆ 70 ఏళ్ల పెద్దాయన, ఆయన కోడలి కళ్లలో ఇప్పుడు మాటల్లో చెప్పలేని ఆనందం. 35ఏళ్ల తర్వాత కన్న కొడుకును చూడబోతున్నానన్న ఆనందం ఆ పెద్దాయనది. 2003 తర్వాత భర్త మళ్లీ తన చెంతకు రానున్నాడనే సంతోషం ఆయన కోడలిది. ఇదంతా.. మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ అలియాస్ గోపన్న తండ్రి సమ్మయ్య, మాజీ మావోయిస్టు రూప గురించే! ఆజాద్ శనివారం డీజీపీ ఎదుట లొంగిపోయిన విషయం తెలిసిందే. ఆయన రాక కోసం తండ్రి సమ్మయ్య, భార్య నగరం రూప అలియాస్ సుజాత ఎదురుచూస్తున్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని మొద్దులగూడెంలో ఓ చిన్న పూరిగుడిసెలో సమ్మయ్య, రూప జీవిస్తున్నారు. ఆదివారం వీరిని 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. 35 ఏళ్ల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయిన కొడుకు మళ్లీ తిరిగిరాలేదని.. తన గొంతు కూడా వినిపించలేదని సమ్మయ్య చెప్పారు. తమకు గుంట భూమి కూడా లేదని.. కూలి పనులు చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నానని ఆవేదనగా చెప్పారు. తన ఎదురుచూపులకు తెరపడిందని, కొడుకును చూసుకుంటూ శేష జీవితం గడుపుతానని చెప్పారు. తాను 13ఏళ్ల వయసులోనే దళంలో చేరానని ఆజాద్ భార్య రూప చెప్పారు. పార్టీ అనుమతితో దళంలోనే ఆజాద్‌ను పెళ్లి చేసుకున్నానని వెల్లడించారు. రెండేళ్లు కలిసి ఉన్నామని..ఆరోగ్యం క్షీణించడంతో బయటకు వచ్చానని వెల్లడించారు.తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు నాలుగేళ్లపాటు తనను నిర్బంధించాయని.. 2003లో తాను విడుదలయ్యాయని తెలిపారు. భర్తఊరైన మొద్దులగూడెం వచ్చి, వృద్ధాప్యంలో ఒంటరిగా బతుకున్న మామ సమ్మయ్య ఆలనాపాలనా చూసుకుంటున్నానని చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar, Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.